
లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

ఏప్రిల్ / మే / జూన్ 2020

రూ.10/-




## అంబేద్కర్ 2020



## రేపటి చరిత్రకు మేలుకొలుపు..

# పెనునిద్రను వదిలించుకున్నామా?



### కొవిడ్-19:

# మన ఆరోగ్య వ్యవస్థను శాశ్వతంగా బలోపేతం చేసుకునే అవకాశమవ్వాలి



"కరోనా (కొవిడ్-19) మహమ్మారిని మన దేశ ఆరోగ్య వ్యవస్థను శాశ్వతంగా బలోపేతం చేసే అవకాశంగా మలచుకోవాలి. మన ప్రజారోగ్య వ్యవస్థ దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైంది. ఎంతో కీలకమైన ఈ రంగంలో ఫలితాలు అధ్వాన్నంగా, అమానుషంగా ఉన్నాయి. సరైన వైద్యాన్ని పొందే శక్తి లేక ప్రతి సంవత్సరం లక్షలమంది మరణిస్తుంటే.. కోట్లమంది పాక్షిక రోగిష్టులుగా పనిచేసే శక్తి తగ్గి బతుకీడుస్తున్నారు. అప్పులు చేసి, ఆస్తులమ్మి ఎలాగోలా వైద్యం చేయించుకోవటం వల్ల ఏటా మన దేశంలో ఆరు కోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నారు. సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలేవీ వీరిని దారిద్ర్యం బారి నుంచి కాపాడలేకపోతున్నాయి. కరోనా కల్లోలం తర్వాతైనా మనం పాఠాలు నేర్వాలి. 'ప్రతి జిల్లాలో, పట్టణంలో అనుసంధానం చేసిన ల్యాబొరేటరీలు, ప్రతి కుటుంబానికీ ఓ జనరల్ ఫిజిషియన్ అందుబాటుతో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ, తగినన్ని ఐసీయూ పడకల'తో ఎటువంటి మహమ్మారినైనా ఎదుర్కోగలిగిన, ఆర్థిక భారం లేకుండా ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించగలిగిన సమగ్ర ఆరోగ్య వ్యవస్థను భారత్ నిర్మించుకోవాలి. లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా చెబుతున్న ఈ ఆరోగ్య విధానం వల్ల మన దేశంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రతతో పాటు, దాదాపు 2 కోట్ల ఉద్యోగాలతో కూడిన గణనీయ ఆర్థికాభివృద్ధి కూడా జరుగుతుంది."

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్),
లోక్‌సత్తా వ్యవస్థాపకులు

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 23 సంచిక 6
ఏప్రిల్ / మే / జూన్
2020


సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి
సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...


06 రేపటి చరిత్రకు మేలుకొలుపు.. పెనునిద్రను వదిలించుకున్నామా?

18 నేటి ఆత్మనిర్భర్ భారత్ హామీ.. నాటి రైతు సత్యాగ్రహ యాత్ర పోరు!


22 అంబేద్కర్ 2020

29 అంబేద్కర్ భావ పోరాటాలు: 'మూక్‌నాయక్' పత్రికకు వందేళ్లు



కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్



## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

సంపాదకీయం

# ప్రజారోగ్యం పట్టని ప్రభుత్వాలు

కరోనా మహమ్మారి మనదేశ ఆరోగ్య, ఆర్థిక రంగాల్లో తీవ్రమైన సవాళ్లను తెచ్చిపెట్టింది. ఆరోగ్యరంగం అతలాకుతలం అయిపోయింది. కరోనా నియంత్రణ చర్యల విషయంలో భారత ప్రభుత్వం గందరగోళపడింది. దాంతో ఇతర ఆరోగ్య సమస్యలు విస్మరణకు గురయ్యాయి. కరోనా మరణాలతో పాటు ఇతర అనారోగ్య మరణాలు పెరుగుతూ వచ్చాయి. ఆర్థికరంగం కుదేలయ్యింది. లాక్‌డౌన్ పేరుతో ఆర్థిక జీవితాన్ని స్థంభింపచేయడంతో పెద్ద ఆర్థిక సంక్షోభం దిశగా దేశం వేగంగా పయనిస్తోంది. సవాళ్ళను, సంక్షోభాలను అవకాశంగా మలుచుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గంభీరోపన్యాసాలు ఇస్తూ వచ్చారు. కానీ కరోనా తెచ్చి పెట్టిన సవాళ్లకు దీటుగా స్పందించడంలో ఆయన విఫలమయ్యారు. నూరేళ్లకు ఒకసారి మాత్రమే వచ్చే కరోనా వంటి మహమ్మారిని ఎదుర్కోవడంలో మన తరానికి అవగాహన కానీ, అనుభవంగానీ లేని మాట నిజమే. కానీ సమస్య తీవ్రతను గురించి జనవరి 30న ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించిన తర్వాత కూడా పట్టించుకోకపోవడాన్ని ఎలా సమర్థించుకుంటారు? రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రచార ఆర్భాటాలకీ ఇచ్చిన ప్రాధాన్యం కరోనా మహమ్మారిని ఎదుర్కోవడానికి ఇవ్వకపోవడంతో ఏడెనిమిది వారాల విలువైన సమయాన్ని భారతదేశం కోల్పోయింది. దాంతో కరోనా విచ్చలవిడిగా వ్యాపించడానికి వీలు చిక్కింది.

ఆతర్వాత కూడా సమస్య తీవ్రతకు అనుగుణంగా రాష్ట్రాలను సన్నద్ధం చేయడానికి ప్రయత్నం జరగలేదు. ప్రధానమంత్రి ఏకపక్షంగా దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను ప్రకటించారు. వైద్య, ఆరోగ్య యంత్రాంగాన్ని సన్నద్ధం చేసుకోవడానికి ఒక విరామ సమయంగా వినియోగించాల్సిన లాక్‌డౌన్‌ను పరిష్కారంగా భావించారు. పైగా మహాభారతయుద్ధం 18 రోజుల్లో ముగిసిందనీ, కరోనాపై యుద్ధం 21 రోజుల్లో ముగుస్తుందని మోదీ నాటకీయతతో చెప్పిన సందేశం ప్రజలకు తప్పుడు సంకేతం ఇచ్చింది. పళ్ళాలు మోగించడం, చప్పట్లు కొట్టడం, దీపాలు వెలిగించడం, సైనిక హెలికాప్టర్లతో పూల వర్షం కురిపించడం వంటి చర్యలు ప్రజల్లో కరోనా పట్ల శాస్త్రీయ వివేచనను, అవగాహనను పెంపొందించలేకపోయాయి. పైగా మోదీ ఏం చేసినా కాని దాని వెనుకగల వైదిక ఆలోచనలు, జ్యోతిష్య సంఖ్యాశాస్త్రాల భావనలు వివరించే ప్రచారదళం ఉండనే ఉంది.

సామాజిక మాధ్యమాలలో వైద్య, ఆరోగ్య రంగాలపై జరగాల్సిన చర్చ కాస్తా అభూతకల్పనలు, నకిలీ వార్తల చుట్టూ తిప్పడంలో మోదీ భక్తులు విజయం సాధించారు. దానికి మతం రంగు సరేసరి. అదివారి బ్రాండ్!

కరోనా గురించిన వాస్తవ సమాచారం ప్రజలకు చేరలేదు. పైగా రాష్ట్రాల, స్థానిక ప్రభుత్వాల ప్రమేయం లేకుండా దేశవ్యాప్తంగా కరోనా నియంత్రణ చర్యలను కేంద్రీకృతం చేశారు. వ్యాధి లక్షణాలు వున్నవారిని మాత్రమే పరీక్షించడానికి పరిమితం కావడంతో సమస్య లోతుపాతులు అంచనా వేయలేకపోయారు. తగిన వ్యూహాలను రూపొందించలేకపోయారు. దాంతో కరోనా విస్తరిస్తూనే పోయింది. మోదీ లాక్‌డౌన్‌ను కూడా పొడిగిస్తూ వచ్చారు. మొత్తం వైద్య ఆరోగ్య, రెవెన్యూ పోలీసు యంత్రాంగాన్నంతటినీ కరోనా విధుల్లో పెట్టారు. దాంతో వారు రోజువారీ అందించాల్సిన సేవలు కుంటుపడ్డాయి. లాక్‌డౌన్ పేరుతో ప్రైవేటు ఆస్పత్రులను మూసేశారు. ఇతర అనారోగ్య సమస్యలకు చికిత్స లభించని స్థితి ఏర్పడింది. కరోనా మరణాలు పెరుగుతూనే వచ్చాయి. వాటిని మించి ఇతర అనారోగ్య మరణాలు కూడా విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వాల దగ్గర వీటికి తగిన పరిష్కారం లేని అయోమయం ఏర్పడింది.

సామూహిక రోగ నిరోధక శక్తి పెరగడం, వ్యాక్సీన్‌ను అందుబాటులో తేవడం మాత్రమే కరోనా సమస్యకు పరిష్కారం. అంతవరకూ కరోనాను నియంత్రించడం, విస్తరించకుండా అడ్డుకోవడం చేయాలి. దానికి లాక్‌డౌన్ ఒక్కటే పరిష్కారం కాదు. ప్రజల సామూహిక అవగాహనని పెంచ డానికి, కరోనా వ్యతిరేక పోరాటంలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయడానికి స్థానిక ప్రభుత్వాలను భాగస్వాముల్ని చేసిన కృషి కేరళలో మాత్రమే జరిగింది. అది సత్ఫలితాలను ఇచ్చింది. భారత ప్రభుత్వం గుడ్డిగా పాశ్చాత్య దేశాల విఫల ప్రయోగాలను అనుకరించి ఫలితాలు సాధించలేక చేతులు ఎత్తేసింది.


అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు కరోనా విధుల్లో మునిగిపోయి వారి రోజువారీ సేవలను నిలిపివేశారు. పాఠశాలల నిరవధిక మూసివేతతో సుమారు 9కోట్ల మంది పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరమయ్యారు. అంగన్‌వాడీల మూసివేతతో కోట్లాదిమంది పసి బిడ్డలకు పౌష్టికా హారం లభించలేదు. లాక్‌డౌన్‌తో దాదాపు 20కోట్ల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. వారు వేతనాలనూ, ఆదాయాలనూ కోల్పోయారు. ఇది కుటుంబాల ఆరోగ్యాన్ని, పిల్లల పౌష్టికాహార లోపాన్ని పెంచాయి. మనదేశంలో ఐదేళ్ళ లోపు పిల్లల మరణాలు ఏటా పదిలక్షల వరకూ ఉంటున్నాయి. ఐదేళ్ల లోపు వయసు పిల్లల్లో 39శాతం ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. మరో 33శాతం పిల్లలు వయసుకు తగ్గ బరువులేక నీరసించిపోతున్నారు. కరోనా పుణ్యాన, లాక్‌డౌన్ పేరుతో పిల్లల పౌష్టికాహార సమస్య మరింత తీవ్రమైంది. మలేరియా, డెంగూ వంటి వ్యాధులు, వాటి మరణాలూ పెరుగుతూనే ఉన్నాయి. ఆర్థిక కార్యకలాపాల స్థంభన, వలస కూలీల వెతలు, పరిశ్రమల మూసివేత, నిరుద్యోగిత, స్వయం ఉపాధికి గండి పడటం, సూక్ష్మ చిన్నతరహా సంస్థల మూసివేత వంటి ఆర్థిక రంగ సమస్యలు కుటుంబాల ఆర్థిక స్థితిని తీవ్రంగా దెబ్బతీసాయి. మోదీ ప్రభుత్వం ప్రకటించిన 20లక్షల కోట్ల ఆర్థిక ప్యాకేజీ నిజానికి సమస్యల పరిష్కారానికి ఏ విధంగానూ పనికొచ్చేవిగా లేవు. దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిలో పడాలంటే ప్రజల వినిమయ శక్తి పెరగాలి. మార్కెట్లో డిమాండ్ పెరగాలి. దీనికి తక్షణ నగదు బదిలీ జరగాలని రఘురామరాజన్, అభిజిత్ బెనర్జీ, సుబ్రహ్మణ్యస్వామి వంటి ఆర్థిక వేత్తలు అంటున్నారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ దీనిపై ముందునుంచీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే వచ్చారు. అనేక యూరోపియన్ దేశాలు, అమెరికా ఇప్పటికే నగదు బదిలీ అమలు చేస్తున్నాయి. అందరికీ ఆహారధాన్యాలు, నగదు బదిలీ వంటి చర్యలు ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నిలదొక్కుకోవడానికి తోడ్పడతాయని నిపుణులు అంటున్నారు. పౌరపంపిణీ వ్యవస్థ పరిధిలో లేని ప్రజలు 8కోట్ల మంది ఉన్నారని అంచనా. వారందరికీ ఉచితంగా ఆహారధాన్యాలు అందచేయాలి. కరోనా నేపథ్యంలో వైద్య, ఆరోగ్యరంగాన్ని పటిష్టం చేయడం మీద దృష్టి సారించాలి. ఇప్పటికైనా జీడీపీలో 5శాతం నిధుల్ని కేటాయించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించే చర్యలు చేపట్టాలి.

డి. సోమసుందర్

# రేపటి చరిత్రకు మేలుకొలుపు..

# పెనునిద్రను వదిలించుకున్నామా?

'మిమ్మలందర్నీ చూసి చాలారోజులైంది. ఓసారి ఇండియా వద్దామనుకుంటున్నాను' అని 2020, ఫిబ్రవరి మొదట్లో అమెరికా నుంచి తన సోదరి ఫోన్‌లో చెప్పగానే.. భారత్‌లోని ఓ సాధారణ గృహిణి రకీమని చెప్పేసింది.. 'నువ్విప్పుడు రాకు తల్లీ. కరోనా వైరస్‌ని తీసుకొచ్చి హైదరాబాద్‌లో మాకు అంటించబాకు. వైరస్ పూర్తిగా తగ్గాక, తర్వాత వద్దువు. అప్పుడు మీకూ వచ్చినట్లు, మాకూ చూసినట్లు సంతోషంగా ఉంటుంది'.



అక్క హెచ్చరికను అంగీకరించిన ఆ చెల్లెలు ఇండియా పర్యటనను వాయిదా వేసుకుందిగానీ.. అమెరికా నుంచి ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం సకుటుంబసపరివార సమేతంగా అదే నెలలో ఇండియా పర్యటనకు విచ్చేశారు. అట్టహాసంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎంతో గంభీరమైనవి అనుకునే జాతీయము, అంతర్జాతీయంవం, రాజకీయాలు, పాలన వంటి విషయాల గురించి పెద్ద ఆలోచన, అవగాహన కూడా లేని ఇద్దరు అప్పుజెల్లెళ్లకున్న పాటి బాధ్యతను, సామాన్య పరిజ్ఞానాన్ని కూడా మన దేశ, అమెరికా పాలకులు ప్రదర్శించలేకపోయారు.

ట్రంప్ ఇండియా పర్యటనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటమే కాకుండా.. భారీ బహిరంగ సమావేశాలను కూడా మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏర్పాటు చేయించారు.

కొవిడ్-19 గతేడాది నవంబర్ లేదా అంతకు కొంత ముందే చైనాలో బైటపడినా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వాకం వల్ల వివరాలు కాస్త ఆలస్యంగా ప్రపంచానికి వెల్లడయ్యాయనుకున్నా.. జనవరి నాటికి భారత ప్రభుత్వానికి స్పష్టమైన సంకేతం అయితే అందింది. అయినా ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా దాని తీవ్రత ఎలా ఉంటుందో యోచించాలన్న, ముఖ్యంగా ఏరోజుకారోజు మారిపోయే పరిణామాల నేపథ్యంలో ప్రజల జీవితాల్ని, జీవనోపాధుల్ని ఎలా కాపాడాలో స్పష్టమైన వ్యూహం ఉండాలన్న ఊహ కూడా ప్రధానికి, ఆయన బృందానికి తట్టలేదు. కేంద్ర ఆరోగ్యమంత్రి సమావేశమైతే పెట్టారు గానీ.. ఎందుకు దక్షిణాసియాలోని అనేక దేశాలు వేగంగా ప్రజారోగ్య రంగంలో అదనపు సన్నాహాలు చేసుకుంటున్నాయన్న చర్చ కూడా అందులో చేయలేదు. చివరకు, పెద్ద ఉపయోగంలేని థర్మల్ స్క్రీనింగ్ ఏర్పాట్లను అంతర్జాతీయ విమానాశ్రయాలలో చేసి మొక్కుబడిగా చేతులు దులుపుకున్నారు. ఇది సకాలంలో స్పందించినట్లు కనిపించే చర్యే తప్ప, 140 కోట్ల మంది ప్రజల జీవితాలతో, భవిష్యత్తుతో

ముడిపడిన అంశం పట్ల చాలా యాంత్రికమైన, నిర్లక్ష్యపూరితమైన స్పందన. లోక్‌సత్తా జేపీ చెప్పినట్లు.. కొవిడ్-19 గురించి మోదీ ప్రభుత్వానికి ఏమాత్రం ముందుచూపు, ఆలోచన ఉన్నా, ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో వైరాలజీ ల్యాబ్‌ల ఏర్పాటు, ప్రజారోగ్య వ్యవస్థ పటిష్ఠత గురించి ప్రస్తావించి ఉండేవారు, గణనీయంగా కేటాయింపులు చేసి ఉండేవారు. వైరాలజీ ల్యాబ్ దేశం మొత్తమ్మీదా ఒక్క పూణేలో మాత్రమే ఉన్నా, బడ్జెట్‌లో ల్యాబ్‌ల ఏర్పాటుకు కేటాయింపులే లేవు. కరోనా అనే ప్యాండమిక్ పొంచి ఉందని, దాని కోసం ఇలా చర్యలు తీసుకోబోతున్నామని మాట మాత్రం కూడా కేంద్ర ప్రభుత్వం అందులో పేర్కొనలేదు. ఆ తర్వాత ట్రంప్ దొరగారి పర్యటన!.. ఇంత పేలవంగా, నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించబట్టే, భారతదేశంలోకి వైరస్ ప్రవేశించి నలుమూలలకూ విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 16,000కుపైగా క్రిమి పరిశోధనా కేంద్రాల్లో కృషిని నిరంతరం గమనిస్తూ పనిచేయాల్సిన మన దేశంలోని పరిశోధనాకేంద్రాల్లో ఉన్నవారు ఏం చేస్తున్నారో తెలియదు. యథారాజా తథా శాస్త్రవేత్తలు అన్నట్లు వ్యవహరించారు.

కేరళ, తెలంగాణ, పంజాబ్ తదితర రాష్ట్రాలు స్పందించి చర్యలు ప్రారంభించాక కేంద్ర సర్కారు కూడా కొవిడ్ నియంత్రణకు వేగంగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. అయితే అధ్వాన్న ప్రజారోగ్య వ్యవస్థ, మందగమనంలోకి జారుతున్న ఆర్థిక వ్యవస్థ మధ్య కొవిడ్‌ను ఎలా ఎదుర్కోవాలో తగిన ప్రణాళికను

ఎంచుకోవటంలో పేలవంగా వ్యవహరించింది. వినూత్న పద్ధతుల్ని అమలు చేయాల్సిన సమయంలో యధాతథ పద్ధతుల్ని .. అత్యంత అప్రమత్తంగా విశ్లేషణలు చేస్తూ తెలివిగా, చాకచక్యంగా నిర్ణయాలు చేయాల్సిన సమయంలో యధాలాప ధోరణుల్ని .. అసాధారణ నాయకత్వ బాధ్యతల్ని తీసుకోవాల్సిన సమయంలో ఎందుకొచ్చిన రిస్కు అనుకుంటూ సోమరితనంతో, అసమర్థపు వ్యవహారశైలిని ఎంచుకున్నారు. జాతీయ విపత్తును కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎదుర్కోవాల్సి ఉండటం, మోదీలాగేనే పలువురు ముఖ్యమంత్రులు కూడా మనకెందుకు తలనొప్పి అనుకోవటంతో పలు రాష్ట్రాలు కూడా కంప్లీట్ లాక్‌డౌన్ ముసుగులో వెన్నుచూపే ధోరణిని అవలంబించాయి. దీంతో ప్రపంచంలోనే అత్యంత కఠినమైన లాక్‌డౌన్‌ను భారతదేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ప్రకటించారు. 24 గంటల 'జనతా కర్ఫ్యూ' అని ఒకసారి, మహాభారతంలో చేసిన కురుక్షేత్ర యుద్ధంలాగా అని ఇంకోసారి రకరకాల నినాదాలు, ఉపమానాలతో ప్రజలను ఆకర్షించటం తప్ప.. శాస్త్రీయంగా, నాయకత్వ పాటవంతో, పాలనా సామర్థ్యంతో, నూతన ఆలోచనలతో కొవిడ్‌ను ఎదుర్కొనే ప్రయత్నాన్ని కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు చేయలేదు.

లాక్‌డౌన్‌ను ఎన్ని రోజులపాటు అమలు చేయగలం? ఒకవేళ వైరస్ దీర్ఘకాలం కొనసాగితే ఏమిటి పరిస్థితి? లాక్‌డౌన్ ద్వారా సాధించదలచిన లక్ష్యాలేమిటి? లాక్‌డౌన్‌ను సడలించాలంటే, ఏ ప్రాతిపదికన నిర్ణయం తీసుకోవాలి?.. వంటివేమీ చర్చించకుండా, ప్రజలకు వివరాల్ని తెలియజేయకుండా లాక్‌డౌన్ ప్రకటన చేసి అమలు బాధ్యతను పోలీసులకు అప్పజెప్పారు (ప్రజల ప్రాణాల్ని కాపాడే ఈ మహాయజ్ఞంలో కూడా అవినీతి, అణచివేతలు పలుచోట్ల యధావిధిగానే సాగాయి). చివరికి 'పేనుకు పెత్తనమిస్తే తలంతా గొరిగినట్లు' తయారైంది లాక్‌డౌన్‌లో పరిస్థితి.

పాలకుల పుణ్యమా అని ఈ దేశంలో పేదరికం ఇప్పటికీ పెద్దఎత్తునే కొనసాగుతూ.. ఒక చిన్న గదిలో పదిమంది బతికే దుర్భర పరిస్థితుల్లో కోట్ల మంది ప్రజానీకం ఉన్నందున లాక్‌డౌన్ ఒక పరిధి దాటి మన దేశంలో ఫలితాన్నివ్వదని, కొంతకాలం లాక్‌డౌన్ అమలు చేయాలనుకున్నా వలస కార్మికులను వారి స్వస్థలాలకు చేర్చి కొంత ఆర్థిక సాయం చేయటం మేలని జేపీలాంటి వారు చెప్పిన సూచనల్ని పెడచెవిన పెట్టారు. వలస కార్మికులు తిరుగు వలస వెళ్లిపోతే, లాక్‌డౌన్ తర్వాత నిర్మాణ తదితర రంగాలలో పనిచేసే వారి కొరత ఏర్పడుతుందనేది వాస్తవిక సమస్యే. కానీ వేగంగా విస్తరిస్తున్న ఓ వ్యాధి, ప్రాణభయం ఉందనే ప్రచారం నేపథ్యంలో లాక్‌డౌన్ వంటి అసాధారణ పరిస్థితుల్లో స్థిమితంగా ఉండేలా, భౌతిక దూరం పాటించేలా వలస కార్మికులకు తగిన వసతుల్ని కల్పించటానికి మన ప్రభుత్వాల సామర్థ్యం సరిపోదు. దానికి బదులు లాక్‌డౌన్‌కి ముందు కార్మికులకు సొంతూరు వెళ్లే గౌరవప్రదమైన అవకాశం కల్పించి, సడలించే సమయానికి తిరిగొచ్చే వాతావరణాన్ని కల్పించాల్సింది. కానీ పైకి ప్రజల గురించి ఎంత ఉదాత్తంగా మాట్లాడినా, ఆచరణలో ప్రజల్ని యాచించేవారుగా చూసే పెత్తందారీ ధోరణి వేళ్లూనుకుని ఉండటం వల్ల వలస కార్మికుల సమస్యను అర్థం చేసుకోవటం కేంద్రంతోపాటు రాష్ట్రాల పాలకులు, ఉన్నతాధికారులు కూడా విఫలమయ్యారు.

తొలి లాక్‌డౌన్‌ను ఆరోగ్యరంగంలో శక్తుల్ని కూడదీసుకునే, ప్రజల్లో పారిశుద్ధ్యం, మాస్కుల వినియోగం, భౌతిక దూరం పాటించటంపై అవగాహన పెంచటానికి ఓ మార్గంగా ఉపయోగించుకోవాలని.. విరివిగా రోగనిర్ధారణ, యాంటీబాడీ టెస్టులతో ఎక్కడికక్కడ క్షేత్రస్థాయి పరిస్థితుల్ని అంచనావేస్తూ క్వారంటైన్, ట్రీట్‌మెంట్‌లకు తగిన ఏర్పాట్లతో తర్వాత లాక్‌డౌన్ అనేదే లేకుండా ఆంక్షలు, రక్షణలతో కూడిన ఆర్థిక వ్యవస్థను ప్రారంభించాలని జేపీ సూచించారు. టెస్టింగులు లేకుండా గుడ్డిగా వ్యవహరిస్తే లాక్‌డౌన్ వల్ల లాభం కంటే నష్టం అనేకరెట్లు ఎక్కువ ఉంటుందన్నారు. కానీ ఆ దిశగా కూడా ప్రయత్నాల్ని ప్రభుత్వం చేయలేదు. ఒక్కరోజు లాక్‌డౌన్ మూలంగా ఆర్థికవ్యవస్థకు రూ.30,000 కోట్ల దాకా నష్టం వస్తుంటే, టెస్టులు, ఇతర సన్నద్ధ చర్యలకు రూ.2,000 కోట్ల వరకు మాత్రమే ఖర్చవుతుందని లెక్కలు చెబుతున్నా, ప్రభుత్వం స్మార్ట్ వ్యవహారశైలికి మారకుండా గానుగెద్దు ధోరణితోనే వ్యవహరించింది. రోజుకు లక్షన్నర పరీక్షలు నిర్వహించే సామర్థ్యముందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కరోనా పరీక్షల ప్రాతిపదికన 84 దేశాల్లో భారత్ 71వ స్థానంలో ఉంది. ఇండియాతో పోలిస్తే అమెరికా 19 రెట్లు, ఇటలీ 25 రెట్లు కరోనా పరీక్షలు జరుపుతున్నాయి. మన దేశంలో జరిపిన పరీక్షల ప్రామాణికతపై కూడా పలు అనుమానాలున్నాయి.

లాక్‌డౌన్‌ను కొనసాగిస్తున్నామంటూ ప్రకటనలు చేస్తూనే ప్రభుత్వం చివరికి మద్యం దుకాణాలకు కూడా గేట్లు ఎత్తేసింది. కరోనా మహమ్మారి నుంచి బైటపడటానికి 'ఆయుష్' నిర్దేశించిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని, గోరువెచ్చని నీటిని తీసుకుంటూ రోగనిరోధక శక్తిని పెంచుకోండటంటూ సుద్దులు చెప్పిన ప్రధానమంత్రి.. రోగనిరోధక శక్తిని దెబ్బతీసే మద్యానికి ఎందుకు గేట్లు ఎత్తారనేది లాక్‌డౌన్ కళాపోషకులకు అర్థంకాలేదు. మద్యం విక్రయాల మూలంగా మహిళలపై హింస కూడా భారీగా పెరిగింది. తెలంగాణలో లాక్‌డౌన్ మే నెల 6 నుంచి మద్యం విక్రయాలకు అనుమతినిచ్చారు. అంతకుముందు రోజు డయల్-100కి 127 గృహహింస కేసులు వచ్చాయి. మద్యం అమ్మకాలు జరిగిన రోజున ఫిర్యాదుల సంఖ్య మూడు రెట్లు పెరిగి 370కి చేరుకుంది. ఆ మరుసటి రోజు 512 మంది బాధితురాళ్లు ఫిర్యాదు చేశారు. డయల్-100కి వచ్చిన గృహహింస ఫిర్యాదుల్లో ఇది ఆల్‌టైం రికార్డు.

ఆ తర్వాత ప్రజారవాణా సహా దాదాపు అన్నిటికీ అదేరకంగా హడావుడిగా గేట్లు ఎత్తేశారు. బతికుంటే బలుసాకు తినొచ్చు అని చెప్పిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. మాస్కు పెట్టుకోకపోతే జరిమానా వేస్తారు అని ముసిముసి నవ్వుతో తేల్చేశారు.

ఇంతకీ అసలు లాక్‌డౌన్ ఎందుకు పెట్టారు అని ప్రధానిని, ముఖ్యమంత్రుల్ని సమర్థించిన మహిళలు సహా మధ్య, ఎగువ తరగతి ప్రజలు జుట్లు పీక్కుంటుండగా.. సామాన్య ప్రజలకు

ప్రభుత్వాల తీరు పట్ల నిర్వేదం, ఈసడింపు మరింత పెరిగింది. తమ అసమర్థతతను కప్పిపుచ్చుకోవటానికి, తాము తిరుగులేని నాయకులమని చాటుకోవటానికి మీడియా ముందు పాలకులు చేసిన షో కార్యక్రమంగానే మార్చి చివరి నుంచి మొదలుపెట్టిన కొవిడ్ లాక్‌డౌన్ మిగిలిపోయింది.

వైద్యం, సైన్స్, ఆర్థికం, రాజకీయం, పాలన.. ఈ ఐదురంగాలనూ లోతైన పరిజ్ఞానంతో సమన్వయం చేసే నైపుణ్యం కొవిడ్ నియంత్రణ వ్యూహంలో అవసరం. అనేకమంది ప్రపంచస్థాయి నిపుణుల్ని మన మీడియా ప్రజల ముందుంచినా, ప్రజలకు, ప్రభుత్వాలకూ వారు ఎన్నో విలువైన సూచనలు చేసినా.. ఏ రంగానికారంగం అన్నట్లుగా వారి సూచనలుండటం కూడా కొన్ని సమస్యల్ని, అయోమయాన్ని సృష్టించింది. ఉదాహరణకు, టెస్టులు పెద్దసంఖ్యలో అక్కర్లేదని మోదీ టీంలో భాగస్వాములుగా ఉన్న వైద్యనిపుణుల్లో పలువురు చెప్పారు. వైద్యపరంగా వైరస్ అదుపులోకి వచ్చేంతవరకు లాక్‌డౌన్‌ను ఎంతకాలమైనా కొనసాగించాల్సిందే అనే వైఖరితో వీరు వ్యవహరించారు. వీరు ఆర్థికం, పాలన, రాజకీయం గురించి పట్టించుకోలేదు. మరోపక్క ఆర్థిక రంగంలోనివారు లాక్‌డౌన్‌కు వ్యతిరేకంగా తమదైన వాదనల్ని వినిపించారు. ఈ రకమైన పరిస్థితుల్ని సరిగా బేరీజువేసి సమన్వయం చేయకుండా ప్రభుత్వం వ్యవహరించటంతో.. లాక్‌డౌన్ విధింపు, సడలింపు/తొలగింపు అయోమయాన్ని పెంచాయి. ప్రహసనంలా తయారయ్యాయి. లాక్‌డౌన్ మూలంగా కొవిడ్ కట్టడిలో కొన్ని సానుకూల ఫలితాలు లభించాయనటంలో సందేహం లేదు. కానీ ప్రభుత్వాలు తాము చేయాల్సిన పనిచేయకుండా, చీకట్లో బాణం వేసినట్లు లాక్‌డౌన్‌ని అమలు చేయటం వల్ల లాభం కంటే నష్టం అనేకరెట్లు ఎక్కువగా కనిపిస్తోంది. చిట్టచివరి పౌరుని నుంచి పరిస్థితిని బేరీజు వేసే శక్తి మన సమాజానికి, మీడియాకు, రాజకీయ వ్యవస్థకు ఉంటే.. అనారోగ్యం - పేదరికం - ప్రాణం మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తించకుండా గంపగుత్త లాక్‌డౌన్ ఎంత రాజకీయ, పాలనా వైఫల్యమో తేటతెల్లమయ్యేది. చివరికి వైరస్ ఆవిర్భవించిన, వైరస్‌పై పెద్దపోరాటం చేసిన చైనా కూడా మన తరహాలో లాక్‌డౌన్ విధించలేదు. అనేక దేశాలున్న ఐరోపా ఖండం కంటే పెద్దదైన, వైవిధ్యభరితమైన, జనసాంద్రత, పేదరికం ఉన్న భారతదేశంలో అన్ని ప్రాంతాలకూ ఒకటే ఫార్ములా అంటే ఆ పరిణామాలు ఎంత దుర్భరంగా ఉంటాయి!

ప్రజలు సైతం 90 శాతానికిపైగా లాక్‌డౌన్‌ను సమర్థిస్తున్నారు అని కొన్ని సర్వేలతో మీడియా సంస్థలు ప్రకటించాయి. వీటినికూడా ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకున్నాయి. కానీ శాస్త్రీయంగా వ్యవహరించకుండా, పారదర్శకంగా సమాచారం ఇవ్వకుండా ప్రజలను గందరగోళపరుస్తూ సరైన ప్రశ్నలను సంధించకుండా అడిగితే వారు మాత్రం ఏం చెప్పగలరు? 'లాక్‌డౌన్ ఉండాలా, వద్దా' అనే రీతిలోకాకుండా.. 'లాక్‌డౌన్‌ను సడలించి కొన్ని ఆంక్షలతో, జాగ్రత్తలతో ఆర్థిక వ్యవస్థను నడపటం మేలా, కాదా' అనే రీతిలో ప్రశ్నలడిగితే వారి స్పందన, అభిప్రాయ సేకరణ ఫలితాలు భిన్నంగా ఉండేవి.

మొదట్లో ఉన్నత వర్గాల ద్వారా వ్యాప్తిని సమర్థవంతంగా అడ్డుకోవటంలో విఫలమైన ప్రభుత్వం, ఆ తర్వాత వలస కార్మికులకు విషయంలో కూడా సమర్థవంతంగా వ్యవహరించటంలో విఫలమై గ్రామీణంలోకి కూడా వైరస్ వ్యాప్తి చెందటానికి కారణమైంది. కరోనారహిత రాష్ట్రంగా ప్రకటించటానికి సిద్ధమవుతున్నామని ఓ ముఖ్యమంత్రి చెప్పినప్పుడు.. అది మీ చేతుల్లో లేదు వైరస్ చేతుల్లో ఉంది అని పరిశోధకులు హెచ్చరించినా మన నేతలు పట్టించుకోలేదు. ఏదో సింగిల్ స్లోగన్ తీసుకుని మూస పద్ధతిలో పనిచేయటం తప్ప, ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకనుగుణంగా వ్యూహాలు రూపొందిస్తూ, జాగ్రత్తలు పాటిస్తూ, తెలివిగా పనిచేసే కష్టానికి మన రాజకీయ నాయకులు సిద్ధపడలేదు. సరైన మందో, వ్యాక్సినో, సామాజిక ఇమ్యూనిటీయో వచ్చేంతవరకూ ఎక్కువ నష్టపోకుండా ఎలా ప్రజల్ని, అభివృద్ధిని కాపాడుకోవాలో శాస్త్రీయ దృష్టితో వారు సరైన కార్యాచరణ రూపొందించలేకపోయారు. ప్రజలను అందుకు సమాయత్తం చేయలేకపోయారు. లాక్‌డౌన్ వల్లకన్నా, వాతావరణం, భారతీయుల రోగనిరోధక శక్తి వంటి అంశాల వల్లే ఇక్కడ కొవిడ్ వ్యాప్తి తీవ్రత తక్కువగా ఉందనే వాదనలు కూడా ఉన్నాయి. 80 శాతం కేసుల్లో ఇన్ఫెక్షన్ సోకినా వ్యాధి లక్షణాలు కన్పించటం లేదంటున్నారు. అంటే మన ఈ మాత్రం ప్రయత్నం కన్నా 'అదృష్టం' పాత్రే ఎక్కువగా మనల్ని కాపాడిందన్నమాట. ఇవన్నీ ముమ్ముందు తేలాల్సిన విషయాలు.

ప్రభుత్వాల తీరు వల్ల చివరికి కొవిడ్‌పై ఫ్రంట్‌లైన్ యోధులుగా ప్రజల చేత వివిధ రకాలుగా ప్రశంసల్ని, త్రివిధ దళాల నుంచి పూల వర్షాన్ని పొందిన వైద్యులు, పోలీసులు కూడా ప్రభుత్వ అనాలోచిత లాక్‌డౌన్ వ్యూహం వల్ల అలసిపోయారు. లాక్‌డౌన్‌ను సడలించే వేళ, నిజంగా సరైన జాగ్రత్తలు పాటించాల్సిన వేళ.. మాస్కుల్ని ఎలా ఉతుక్కుని తిరిగి వినియోగించుకుంటూండాలి, భౌతిక దూరం ఎలా పాటిస్తుండాలి, పరిశుభ్రత వంటివి మళ్లీ మళ్లీ చెప్పాల్సిన సమయంలో కాడిపారేశారు. వీటి మీద దృష్టి సారించేవారు కూడా అధికార వ్యవస్థలో కరువయ్యారు.

**ఇది ఇక్కడితో ఆగదు..**


**అందుకే 'కొవిడ్-19 ముందు, కొవిడ్ తర్వాత భారతదేశం'పై లోతైన చర్చ జరగాలి**

కొవిడ్-19 ఈ శతాబ్దపు అతిపెద్ద పరిణామం అని పలువురు నిపుణులు అంటున్నారు. కొవిడ్ మహమ్మారి ప్రపం చాన్ని కమ్మేయనుందని 2018లోనే అంచనా వేసిన శాస్త్రవేత్తల బృందమైతే.. కరోనా శాంపిల్ మాత్రమేనని, ముమ్ముందు మరో తీవ్ర ప్యాండమిక్ కూడా పొంచి ఉందని ఘంటికలు మోగిస్తున్నారు. సాటి మనుషుల్ని, ప్రకృతిని నిర్లక్ష్యం చేసి ఎంతటి సంపన్నులు కూడా మనుగడ సాగించే అవకాశం లేదని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగారంభంలో మనల్ని హెచ్చరిం చిన పరిణామం కొవిడ్-19. అందుకే.. లాక్‌డౌన్ నిర్ణయం, అమలు, కరోనా

విస్తరణపై మనం వ్యక్తులుగా, సమాజంగా, దేశంగా, వ్యవస్థలుగా మహాసింహావలోకనం చేసుకోవాలి.

లాక్‌డౌన్ ఇచ్చిన అసాధారణ అనుభవాల నేపథ్యంలో మనలో సంకుచిత, పక్షపాత, వివక్షాపూరిత ధోరణులు కొంతైనా కొట్టుకుపోయి స్వచ్ఛత, అవగాహన వికసించి ఉంటాయి కాబట్టి.. సమీక్షకు అత్యంత ఫలవంతమైన కాలమిది.

ఎటువంటి అంశాన్నయినా, పరిణామాన్నయినా వన్డే, వన్ వీక్ ఈవెంట్లుగా మార్చేసే సమాచార, సాంకేతిక, పోటీ ప్రపంచ యుగంలో ఉన్నాం. ఆ ఈవెంట్ కల్చర్ పరిధిని కూడా దాటి కొవిడ్ మన జీవితాలు, మస్తిష్కాల మీద ఏకకాలంలో పెనుప్రభావాన్ని కలగజేసింది. పలు వర్గాల ప్రజల స్పందనలు, దాతృత్వ చర్యలు, కోట్ల మంది మనసుల్లో నెలకొన్న ఆందోళనలే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వం అసంబద్ధంగా, అపారదర్శకంగా, అర్థంలేని రీతిలో లాక్‌డౌన్‌ను అమలు చేయటం వల్ల మనలో, మన చుట్టూ వచ్చిన మార్పుల ప్రభావం కొంత పలచబడినా, అది ఇప్పటికీ గణనీయ పరిధిలోనే కొనసాగుతుంది. 'దేశానికి కరోనా ఎన్నో గుణపాఠాలు




నేర్పిందని, ప్రస్తుత పరిస్థితులు కనువిప్పు కలిగిస్తున్నాయని, గతంలో ఏం జరిగింది? భవిష్యత్తు ఎలా ఉండాలి? అనే దానిపై అవగాహన కలిగించిందని' మోదీ కూడా తన మన్ కీ బాత్‌గా చెబుతున్నారు. ఆ మార్పు సంకల్పాన్ని వదులుకోకుండా బలోపేతం చేసుకోవటం, కార్యరూపం దాల్చేలా చూసుకోవటం మనందరికీ అత్యావశ్యకం. కచ్చితంగా 'కొవిడ్-19 ముందు, కొవిడ్ తర్వాత భారతదేశం' అనే చర్చ లోతుగా మన దేశంలో చర్చ జరగాలి. కరోనా మేలుకొలుపుతో ఇప్పటి వరకూ మనం గుర్తించిన అంశాలకు పరిష్కారాలు, కార్యాచరణ చుట్టూనే మన భద్రత, భవిష్యత్ భారత భద్రత ఆధారపడి ఉన్నాయి. మౌలిక రంగాల్లో నివారించదగ్గ వైఫల్యాలు అనేకం ఉన్న భారత్ వంటి దేశాలకు కొవిడ్-19 సంక్షోభం ఒక పెద్ద సదవకాశం కూడా.

పటిష్ఠమైన ప్రజారోగ్య వ్యవస్థ, బలమైన స్థానిక ప్రభుత్వాలు, సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలకు నాణ్యమైన విద్య, ఇతర సంస్కరణలు, దయనీయ వలసలు లేకుండా చిన్న పట్టణాల అభివృద్ధి, పొలం నుంచి పళ్లెం దాకా రిటైల్ చెయిన్లతో రైతుకి-వినియోగదారుడికి లాభసాటిగా వ్యవసాయం, చిట్టచివరి పౌరునికి కూడా నాణ్యమైన సేవలనందించేలా పాలనా వ్యవస్థను ప్రక్షాళన చేయటం, కష్టసమయంలో ప్రజలకు ఉదారంగా డబ్బు పంపిణీకి వీలుగా అనుత్పాదక, అసంబద్ధ పథకాలకు దుబారా చేయకుండా ఉండటం.. అంశాలపై మనం ప్రధానంగా దృష్టి సారించాలి.

## 1. పటిష్ఠమైన ప్రజారోగ్య వ్యవస్థ నిర్మాణం

కరోనాపై పోరులో భాగంగా మార్చి 22న 'జనతా కర్ఫ్యూ' పాటించాలనే పిలుపునిస్తూ ప్రధాని మోదీ.. బహుశా మొట్టమొదటిసారిగా 'అభివృద్ధి చెందుతున్న భారతదేశం' అనే పదాల్ని చాలా వక్కాణింపుతో వాడారు. ఇప్పటిదాకా.. ఐదో అతిపెద్ద ఆర్థికశక్తి, ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అంటూ ఒకవైపే చూపుతూ పలికిన డాంబికాల వెనుక డొల్లతనాన్ని ప్రధాని బహిరంగంగా అంగీకరించారు. ఈ డొల్లతనం గురించి ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఎన్నోసార్లు ఈ ప్రధాని దృష్టికి కూడా తీసు కొచ్చారు. ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని, విద్యని అందించనప్పుడు ఆ అభివృద్ధి కుప్పకూలిపోతుందని, సంక్షోభాల్ని తట్టుకోలేదని, పునాదుల్లేని అలాంటి దేశం మార్కెట్‌గా తయారవుతుంది తప్ప ఎప్పటికీ అభివృద్ధి చెందిన దేశమవదని చెబుతూ వచ్చారు. చివరికి కొవిడ్ సన్నద్ధత కోసమైనా ప్రజల ముందు తన వైఫల్యాన్ని ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించాల్సి వచ్చింది.

మన ప్రజారోగ్య వ్యవస్థ అధ్వాన్నం కావటం వల్లే పాలకుల లాక్‌డౌన్ ప్రకటనకు ప్రజల్లో ఎక్కువమంది మద్దతివ్వాల్సి వచ్చింది. మనకుగనక కాస్త చెప్పుకోదగ్గస్థాయి ఆరోగ్య వ్యవస్థ ఉండి ఉంటే, అద్భుత సర్వరోగనివారిణి అన్నట్లు ఏకమొత్తంగా లాక్‌డౌన్ విధించాల్సిన అవసరం ఉండేది కాదు. అంటే మన దేశం ఒక్క లక్ష కోట్ల కోసం ఎన్నో లక్షల కోట్లను, ఎంతోమంది విలువైన ప్రాణాలను కోల్పోవలసి వచ్చింది. పదుల కోట్ల మంది దుర్భర పరిస్థితుల్ని అనుభవించాల్సి వచ్చింది. మన నాయకులు కేంద్రీకృత పాలన, ఓట్ల కోసం తాత్కాలిక తాయిలాల్ని పందేరం చేయటం తప్ప, ప్రజారోగ్యం పట్టని రాజకీయం చేయటం వల్లే ఈవేళ కరోనా వైరస్ తాకిడికి మనం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కోవలసి వస్తోంది.

ఉన్న కాస్త ప్రజారోగ్య వ్యవస్థను కూడా వేలంవెర్రిగా కరోనా చుట్టూనే తిప్పటం వల్ల.. సాధారణ అనారోగ్యాలకు గురైనవారు, జీవనశైలి వ్యాధుల బారినపడినవారు, టీబీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడినవారు ఎంతో మంది మూల్యం చెల్లించాల్సి వచ్చింది. వైరస్‌లా వేగంగా, తక్షణం ప్రభావం ఉండదు కాబట్టి మనలో చాలామంది పట్టించుకోరు, పాలకులకు పట్టదుగానీ.. కేవలం నివారించదగ్గ వ్యాధులతో ఈ దేశంలో ఏటా 12 లక్షల మంది పిల్లలు ఐదేళ్లలోపే మరణిస్తున్నారు. సరైన చికిత్స అందక 30 లక్షలమంది ప్రజానీకం మరణిస్తున్నారు. లోక్‌సత్తా 20 ఏళ్ల

పోరాటం తర్వాత ఎంఎంఆర్ వ్యాక్సిన్ ఇటీవల వచ్చింది. దీనివల్ల ఏటా 3 లక్షల మంది పిల్లల్ని గర్భస్థ దశ వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందుతున్నారు. పెద్ద ఖర్చు కూడా లేని ఈ వ్యాక్సిన్‌ను తీసుకురావటంలో ఇన్నేళ్లుగా చూపుతున్న నిర్లక్ష్యానికి ఎన్ని లక్షల మంది బలయ్యారో తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. క్షయ వల్ల మన దేశంలో ఏటా 4,00,000 మంది దాకా మరణిస్తున్నారు. అంటే రోజుకు సగటున 1000 మందికిపైగానే. కరోనాను మించిన భయంకరమైన సంక్షోభం దీర్ఘకాలంగా మన ఆరోగ్యవ్యవస్థలో కొనసాగుతున్నా, మనం అలవాటు పడిపోయాం. కరోనా నుంచి ప్రాణాల్ని కాపాడే పేరుతో గుడ్డిగా అమలు చేసిన లాక్‌డౌన్ సమయంలో కనీసం అంబులెన్స్‌లు కూడా రాకుండా ఎంతమంది మరణించారో (వీరిలో పలువురు వలస కార్మికులు కూడా ఉన్నారు) లెక్క కూడా తెలియటం లేదు.

కరోనాలాంటి పెద్దవిపత్తు ఒకేసారి విరుచుకుపడితే ఎంత పటిష్ఠమైన ప్రజారోగ్య వ్యవస్థయినా చేతులెత్తేస్తుంది. దీన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ కనీస స్థాయి ప్రమాణాలున్న ప్రజారోగ్య వ్యవస్థ లేకపోతే, అసలు కరోనాపై పోరు మొదలుపెట్టక ముందే చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడుతుంది. భారతదేశం చేసిందిదే. కొవిడ్–19 కాస్త పెచ్చరిల్లితేనే ఏమాత్రం తట్టుకోలేని స్థాయిలో భారతదేశ ప్రజారోగ్య వ్యవస్థ ఉండటంతో పాలకులు దుకాణం మూసి కాలక్షేపం చేసేందుకు ఓ వంక దొరికింది.

**ఏ) తప్పించుకునే ధోరణితో వ్యవహరించిన రాష్ట్రాల్లో తెలంగాణ సైతం ప్రజారోగ్యం, కరోనా టెస్టింగుల విషయంలో పాలకులు ఎంత తప్పించుకునే ధోరణితో వ్యవహరించారో తెలంగాణ ఉదాహరణను చూస్తే చాలు అర్థమవుతుంది.**

కరోనా పరీక్షలకు హైదరాబాద్‌లోని సీసీఎంబీని కూడా ఉపయోగించుకునే అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధానికి విజ్ఞప్తి చేశారు. దాన్ని కేంద్రం కూడా ఆమోదించింది. కానీ 2010లో స్వైన్‌ఫ్లూ (హెచ్1ఎన్1) వచ్చి వణికించినప్పుడే వైరాలజీ ల్యాబ్‌ల లేమి గురించి జేపీ హెచ్చరించారు. జిల్లా కేంద్రాల్లోనైనా ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కానీ తెలంగాణ వచ్చి ఆరేళ్లయినా ఇప్పటికీ ప్రజారోగ్యం అంటే.. ఓట్లు తెచ్చే ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్లు, ప్రచారం అని తప్ప.. వ్యాధుల నివారణ, అంటువ్యాధుల కట్టడి, ప్రాథమిక, ద్వితీయ దశలో చికిత్సకు ప్రాధాన్యత అనే ఆలోచనను కూడా కేసీఆర్ చేయలేదు. ఇక కరోనా వచ్చాక, వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరుతో తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని విన్యాసాలు జరిగాయో లెక్కలేదు. కరోనాను నిగ్గుతేల్చేలా పరీక్షలు చేయకుండా, పైపైన బండిలాగించటం రోజుల తరబడి సాగింది. సరైన రీతిలో పరీక్షలు చేయకుండా గ్రీన్, ఆరెంజ్ జోన్లు అని ఎలా నిర్ధారిస్తారని హైకోర్టు కూడా తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించింది. లాక్‌డౌన్ నుంచి సురక్షితంగా బయటపడటానికి వీలుగా టెస్టింగుల్లో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించటం, ధరల్ని తగ్గించే దిశగా ప్రోత్సాహక చర్యలు తీసుకోవటం వంటివి ప్రభుత్వం చేయలేదు. ఒక వ్యూహం లేకుండా వ్యవహరించింది. టెస్టింగులతో సంబంధం లేకుండా, మరణాల లెక్క అనే బండ గుర్తుతో వ్యాధి తీవ్రతను అంచనా వేస్తూ చాలా అశాస్త్రీయమైన, ప్రమాదకరమైన ధోరణిని ప్రదర్శించింది.

కరోనా పరీక్షల్ని పెద్దఎత్తున చేపడితే కేసుల సంఖ్య లక్షల్లో కనిపిస్తూ తమకు పెనుభారంగా పరిణమిస్తాయని తెలంగాణతోపాటు పలు ఇతర రాష్ట్రాలు కూడా భావించాయి. గుజరాత్ హైకోర్టులో ఏకంగా అడ్వొకేట్ జనరలే ఈ వాదన వినిపించారు. ఎక్కువ పరీక్షలు జరిపితే అహ్మదాబాద్ పౌరుల్లో 70 శాతం మందికి కరోనా సోకిందని ప్రజల్లో భయాందోళనలు పెరుగుతాయని ఆయన అశాస్త్రీయమైన, అసమర్థమైన వాదనా విన్యాసాలు చేశారు.

**బి) ఒక్క ఆరోగ్య రంగాన్ని బాగు చేసినా, ఇప్పటికే మోదీ గొప్ప ప్రధానిగా గుర్తింపుపొంది ఉండేవారు**

ప్రధానమంత్రి పదవికి రేసులో మోదీకి బ్రాండ్ ఇమేజ్‌ని అందించిన గుజరాత్ అభివృద్ధి నమూనాలో ప్రజారోగ్యానికి చాలా తక్కువ ప్రాధాన్యత ఉంది. అదే ధోరణిని ప్రధానిగా కూడా మోదీ కొనసాగించారు. రోగనిరోధక శక్తిని పెంచే దినుసులున్న శాకాహారం, మద్యం వంటి అలవాట్లు లేకుండా ఉండటం, పరిశుభ్రతను పాటించటం, యోగా చేయటం వంటి సంప్రదాయ భారతీయ జీవనశైలి పద్ధతుల్లో జీవిస్తే ఆరోగ్య సమస్యలేవీ రావని, మరీ అంతగా ఆరోగ్య సమస్య వస్తే పేదలకు మాత్రం అండగా నిలిచేందుకు ఆరోగ్యశ్రీ తరహాలో ఆయుష్మాన్ భారత్ సరిపోతుందనే భ్రమ ఆయనలో కొనసాగినట్లు కనిపిస్తుంది. భారతీయ జీవనశైలి మాత్రమే ఆరోగ్య సమస్యలకు పరిష్కారమైతే.. పాత తరాల్లో సగటు ఆయు:ప్రమాణం 40 ఏళ్ల లోపే ఎందుకుంది? ఇప్పటికీ మన దేశంలో జీవనకాలం అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే ఎందుకు తక్కువగా ఉంది? తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ 13 ఏళ్లుగా ఉన్నా అక్కడ ఎందుకు ఆరోగ్య సంక్షోభం పెరగటమే తప్ప తగ్గటం లేదు? .. అనే వివేచన ఆయన చేయలేదు. జేపీలాంటి వాళ్లు అనేకమార్లు చెప్పినా ఆయన మారాలనుకోలేదు. అందుకే.. వైద్యానికి, ఆరోగ్యానికి మధ్య ఉన్న సన్నని రేఖను గుర్తిస్తూ ప్రభుత్వ వ్యవస్థల్ని ఎలా ఏర్పాటు చేయాలి? ఆర్థికానికి, ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు ఎటువంటి ఒడిదుడుకులు రాకుండా ఎలాంటి ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించాలి? అన్న చర్చ చేయలేదు. అందుకే కరోనా గురించి చాలా ముందుగా మనకు సమాచారం ఉన్నా కూడా దాని తీవ్రతను మోదీ కనీసం ఊహించటం కూడా చేయలేకపోయారు. మోదీ పార్టీకి భావజాల మాతృసంస్థలో కూడా ప్రజారోగ్యం విషయంలో లోతైన ఆలోచన, ముందుచూపు లేకపోవటంతో అది పెద్దచర్చనీయాంశం కాకుండా పోయింది. ప్రజల జేబుల్లో నుంచి రూపాయి ఖర్చులేకుండా అందరికీ ఆరోగ్యాన్నందించే ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించటం మన దేశంలో పూర్తిగా ఆచరణ సాధ్యం. ఈ నమూనాను జేపీ ఇప్పటికే అందించారు. యూపీయే ప్రభుత్వం జారవిడిచిన ఆ అవకాశాన్ని మోదీ అందిపుచ్చుకుని అమలు చేసి ఉంటే, ఆయన ఓ గొప్ప ప్రధానిగా భారత చరిత్రలో నిలిచిపోయి ఉండేవారు. ఈ ఆరేళ్లలో ఆయనేమీ చేయకపోయినా, ప్రజలు ఆయన్ని శాశ్వతంగా

గుర్తుపెట్టుకునేవారు. ప్రస్తుతమున్న కరోనాలాంటి విపత్తుల సమయంలోనైతే ఆయన కృషికి ఎన్నో రెట్లు ఫలితాలు వచ్చేవి. కానీ ఆయన ఆరోగ్యం, విద్య వంటి మౌలికాంశాల్ని పట్టించుకోకుండా, కేంద్రీకృత పాలనలో ఆర్థిక వృద్ధి, తన పార్టీని గెలిపించుకోవటం అనే రెండు అంశాలకే పరిమితమయ్యారు. ఒకప్పుడు మోదీతో పోలిస్తే పేలవమైన ప్రధాని అనిపించుకున్న డా॥ మన్మోహన్ సింగ్.. ఇప్పుడు మోదీ కంటే మెరుగనిపించుకుంటున్నారు. సరైన ప్రాథమ్యాలు, ప్రత్యామ్నాయాలు, విధానపరమైన స్పష్టత, పరిణతి కొరవడుతూ మోదీ విఫలమవటమే ఇందుకు కారణం.

మోదీకి ఏదో దోచుకోవాలని, దాచుకోవాలని కోరికలేకపోవచ్చు. కానీ తన పేరుని భారతదేశం శాశ్వతంగా గుర్తుపెట్టుకోవాలన్న బలమైన ఆకాంక్షయితే ఉంది. అది ఆయనకు నిరంతర స్ఫూర్తిలా పనిచేస్తుండొచ్చు కూడా. కానీ బీజేపీని గెలిపిస్తేనో, భారత్‌లో కొద్దిమంది సంపన్నుల్ని సృష్టిస్తేనో, మీడియాలో పతకాశీర్షికల్లో వస్తేనో చరిత్రలో స్థానం రాదు. 'ఒక వ్యక్తి ప్రజలకు ఎంత మేలు చేశాడు లేదా చేయటానికి తన శాయశక్తులా ప్రయత్నించాడు?' అన్నది మాత్రమే కాలాతీత గొప్పతనానికి ఏకైక గీటురాయి. మోదీ, ఆ మాటకొస్తే ఆయన భావజాల సంస్థలు కూడా తమ దార్శనికతను సవరించుకోకపోతే చివరికి.. ఓ లోపభూయిష్ట కలను కని, ఆ కలను నెరవేర్చుకుని కూడా విఫలమైన విషాదాల జాబితాలో చేరిపోతారు. కరోనా సంక్షోభం తర్వాతైనా వారు మేలుకోవాలి. ఆరోగ్యం, విద్యలకు ఓట్లు కూడా వస్తాయని ఢిల్లీ ఓటర్లు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నిర్ద్వంద్వంగా రుజువు చేశారు.

'మీకు కరతాళధ్వనులతో ప్రజల చేత మోదీ అభినందనలు చెప్పించారు కదా, ప్రధానిని మీరు కోరేవి ఏమైనా ఉన్నాయా?' అని ఒక వైద్యనిపుణుడ్ని ఓ జాతీయ ఛానెల్ అడగ్గా.. 'ప్రజారోగ్యానికి కాస్త నిధుల్ని పెంచి ప్రాథమిక స్థాయి నుంచి బలోపేతం చేయాలి' అన్నారాయన. అలాగే ఇంకొందరు వైద్యులు 'ఓటు వేసేటప్పుడు మనం ఎన్నుకునేవారు మంచి ఆరోగ్యాన్ని అందిస్తారా, లేదా? అని చూసుకుని వేస్తే, కరోనా వంటి వాటికి మరీ ఇంత భయపడాల్సిన, చేతులు ముడుచుకు కూర్చోవాల్సిన అగత్యం ఉండదు' అన్నారు.

కాబట్టి మోదీ ప్రభుత్వం దేశీయంగా సమగ్ర ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించటంతోపాటు మహమ్మారులు విస్తరించకుండా ప్రపంచ దేశాల మధ్య ఆరోగ్య రంగంలో బలమైన సహకారం ఉండేందుకు కూడా తీసుకోవాలి.

కేరళలో ఆరోగ్య వ్యవస్థ మిగతా దేశంలో కన్నా మెరుగ్గా ఉండటం వల్ల కరోనాను సమర్థంగా కట్టడి చేసినప్పటికీ, సరైన ప్రజారోగ్య వ్యవస్థ ప్రమాణాలకు కేరళ నమూనాను కూడా ఇంకా మెరుగుపరచాల్సి ఉంది.

మన దేశంలో పెట్టే ఆరోగ్య ఖర్చులో ప్రజలు జేబులో నుంచి 70 శాతందాకా ఖర్చు చేస్తుండగా, మిగిలినదే ప్రభుత్వాలు చేస్తున్నాయి. ప్రపంచంలో చెప్పుకోదగిన దేశాలేవీ ఈ స్థాయిలో జనం మీద భారం మోపటం లేదు. ఆరోగ్య వ్యయంలో చైనాలో 36 శాతం, బ్రిటన్‌లో 16, జపాన్‌లో 13, జర్మనీలో 12, బ్రెజిల్‌లో 27 శాతం వంతున మాత్రమే ప్రజలు భరిస్తున్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకోవాల్సిన ఆరోగ్య వ్యవస్థ సక్రమంగా లేకపోవటం వల్ల ఎంతమంది నలిగిపోతున్నారో కరోనా సమయంలో కూడా అనేకచోట్ల కనిపించింది. వైద్యఖర్చుల కోసం పుస్తెలమ్ముకున్నవారి కథనాలు పత్రికల్లోనే వచ్చాయి. ట్రంప్ వ్యవహారశైలితోపాటు తమ ఆరోగ్య వ్యవస్థ నమూనాలో తప్పిదాల వల్ల అమెరికా కోవిడ్ విజృంభణకు దెబ్బతినాల్సి వచ్చింది. అమెరికాలోలా మొత్తం ప్రైవేటు ఇన్సూరెన్స్ ఆధారిత నమూనాను కాకుండా, బ్రిటన్ ఎన్‌హెచ్‌ఎస్ తరహాలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భారత్ ఆరోగ్య వ్యవస్థను రూపొందించుకుంటే, మన దేశంలో అందరికీ మంచి ఆరోగ్యం అందుబాటులోకి వస్తుంది. ఆస్పత్రి ఖర్చులు భరించలేక అప్పులపాలై పేదరికంలోకి జారిపోకుండా ఏటా దాదాపు 6 కోట్ల మందిని కాపాడగలం. కొన్ని సంవత్సరాల వ్యవధిలోనే పేదరికాన్ని నిర్మూలించగలం.

భారత్ ఫార్మా రంగంలో ప్రపంచస్థాయిలో ఉంది. పలు దేశాలకు వ్యాక్సీన్ల సరఫరా కేంద్రం ఇండియా. మన వైద్యులు అన్ని దేశాల్లో నిపుణులుగా గుర్తింపుపొందారు. మన దేశంలోని ఆస్పత్రులు ఖరీదైన తృతీయ స్థాయి వైద్యాన్ని సంపన్న దేశాల్లో అయ్యే ఖర్చులో 5-10 శాతంతోనే అందించ గలుగుతున్నాయి. ఇలాంటి సానుకూల అంశాలు మనకున్నాయి. కోవిడ్ తర్వాత వైద్యపరికరాల తయారీలో కూడా మన దేశం గణనీయ పురోగతిని సాధిస్తోంది. కాబట్టి.. ఆరోగ్య రంగంపై ఇప్పుడు చేస్తున్న ఖర్చును కేంద్ర ప్రభుత్వం 1 శాతం నుంచి జీడీపీలో 2 శాతానికి పెంచితే చాలు, మనం చెప్పుకోదగిన మంచి ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించుకోవచ్చు. ఆరోగ్యశ్రీని, దాని నమూనాలో రూపొందించిన ఆయుష్మాన్ భారత్ స్కీముల్ని కూడా ఈ విధానంలో ద్వితీయ శ్రేణి వైద్య సేవలకు ఉపయోగించుకోవచ్చు.

ఇంతకుముందే చెప్పుకున్నట్లు, సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని మన బడ్జెట్ పరిధిలోనే డా॥ జేపీ తెలుగు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వానికీ అందించారు. దీనివల్ల ప్రజలందరికీ ఆర్థికభారంలేని వైద్యం అందటంతోపాటు దేశంలో దాదాపు రెండు కోట్ల ఉద్యోగాలు కూడా లభిస్తాయి.

కరోనా కట్టడికి ప్రజల చేత సూచనల్ని పాటింపచేయటం కోసం పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం ఒళ్లు వంచాలి కాబట్టే, ప్రభుత్వం తేలికైన మార్గంగా గంపగుత్త లాక్‌డౌన్‌ను ఎంచుకుంది. అదే లోక్‌సత్తా చెప్పినట్లు ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిలో అందరికీ ఆరోగ్య విధానాన్ని అమల్లోకి తెచ్చి ఉంటే, ప్రజలకు మెడికల్ కమ్యూనికేషన్ కూడా చాలా తేలిగ్గా ఉండేది. ఫ్యామిలీ డాక్టర్ ఇచ్చే సూచనల్ని ప్రజలు చాలా స్వచ్ఛందంగా పాటించి ఉండేవారు. డాక్టర్లకు కూడా కోవిడ్ నియంత్రణ తేలిగ్గా ఉండేది. ఎక్కడికక్కడ వ్యాధి అదుపులోకి వచ్చేది. పోలీసుల అవసరం తక్కువ పడేది.

ప్రపంచం ఎటుపోయినా, ప్రభుత్వాలు సరిగా పనిచేయకపోయినా తాము మాత్రం సుఖంగా బతకగలమని భ్రమపడే సంపన్నులు, వనరులు గలవారు కూడా ప్రజారోగ్యం

ప్రాధాన్యాన్ని గుర్తించి సాధించటం కోసం పోరాడాల్సి ఉంది. కరోనా కుదుపు తర్వాతైనా ఈ వాస్తవాల్ని గుర్తించే విజ్ఞతను ప్రదర్శించాలి.

## 2. బలమైన స్థానిక ప్రభుత్వాలు

కరోనాను ఎదుర్కోవటానికి వీలుగా స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికల్ని జరపకపోయినా, ఆర్థిక సంఘం నిధుల్ని విడుదల చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రకటించింది. కరోనాను నియంత్రించటానికి స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని ఇస్తున్నట్లు, ఎవరి ఊళ్లల్లో వారే హీరోలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా చెప్పారు. పారిశుద్ధ్యం, ప్రజారోగ్య నిర్వహణ అంశాల్లో స్థానిక ప్రభుత్వాలది ప్రధానపాత్ర తప్ప ప్రధానమంత్రిది, ముఖ్యమంత్రులు, మంత్రులది, సినిమాస్టార్లది, ఇతర ప్రముఖులది కాదని.. అందుకే అధికార వికేంద్రీకరణ ఫార్ములాతో స్థానిక ప్రభుత్వాల చుట్టూ 'స్వచ్ఛభారత్'ను రీడిజైన్ చేయాలని డా॥ జేపీ 2014 నుంచీ చెప్పినా మోదీ వినిపించుకోలేదు. చివరికి ఆ కార్యక్రమం ప్రచారం, నిధులు ఎక్కువ - ఫలితం తక్కువ అనే రకంగా తయారై విఫలమైంది. స్థానిక ప్రభుత్వాలకు ఎంత ప్రాధాన్యముందో కొవిడ్ కట్టడి ప్రయత్నంలో మనకు తెలిసివచ్చింది.

పారాసిటమాల్‌తో కరోనాను కట్టడి చేయవచ్చని కేసీఆర్‌లాగే చెప్పి ప్రజల ఆరోగ్యం పట్ల తన చులకన భావాన్ని చాటుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. స్థానిక ప్రభుత్వాలను కించపరచటంలో కేసీఆర్ కంటే ఇంకా కొన్ని అడుగులు ముందుకేశారు. కరోనా ఉరుముతున్నా, దాన్ని కాచుకునే ఆరోగ్య వ్యవస్థలేకున్నా, కేంద్రం జాతీయ విపత్తుగా హెచ్చరిక జారీ చేసినా.. స్థానిక ఎన్నికలు జరపాల్సిందే అని ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మీద దుమ్మెత్తిపోసి, రాజ్యాంగ సంస్థ అని కూడా చూడకుండా తొలగింపు ఉత్తర్వునిచ్చారు.

స్థానిక సాధికారత అంటే.. కేవలం గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటే సరిపోదు, పీఎం-సీఎం-డీఎం (ప్రధానమంత్రి-ముఖ్యమంత్రి-కలెక్టర్)ల కేంద్రీకృత పాలన నమూనాను మార్చితేనే, క్లస్టర్ ఎఫెక్ట్‌కు ఏర్పాట్లు చేసుకుంటేనే స్థానిక ప్రభుత్వాల సాధికారత సాధ్యమవుతుంది. 73, 74 రాజ్యాంగ సవరణల వల్ల ఈ మార్పు సాధ్యం కాదు. అధికారాలు, విధుల బదలాయింపుతోపాటు.. బడ్జెట్ కేటాయింపుల్లో విధిగా స్థానిక ప్రభుత్వాలకు 33 శాతం వాటా ఉండేలా ఏర్పాట్లు ఉండాలి. ఇందుకోసం రాజ్యాంగ సవరణ దగ్గర్నుంచి వెంటనే చేయగలిగిన చట్టపరమైన ఏర్పాట్ల వరకూ ఎలా వీలుంటే ఆ రకంగా ఏర్పాట్లు చేయాలి.

భారతదేశ ఆర్థికకలాపాల్లో 60 శాతందాకా 8 మహానగరాల్లోనే జరుగుతున్నాయి. కాబట్టి.. కనీసం 10లక్షల జనాభా దాటిన నగరాల్లో స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనివ్వటంతో మొదలుపెడితే, వలస కార్మికులకు కొంతవరకు ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని కూడా అందించవచ్చు.

## 3. సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలకు నాణ్యమైన విద్య, ఇతర సంస్కరణలు

భారతదేశ ఉపాధి రంగంలో వేగంగా పెరుగుతున్న సంక్షోభాన్ని కొవిడ్-19 బద్దలు చేసింది. కీలక రంగాలు, పలు సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి సంస్థలు కుదేలవటంతో కోట్ల మంది ఉపాధిని కోల్పోయారు. వీరిలో అత్యధికులు అసంఘటిత రంగంలో ఉన్నవారు. మన దేశంలో పనిచేసే 55 కోట్ల జనాభాల దాదాపు 90 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. మరోవైపు, ఇప్పటికే ఉద్యోగావకాశాలలో తమ వాటాను కోల్పోతున్న మహిళలు.. కరోనా దెబ్బకు మరీ ఎక్కువ సంఖ్యలో ఇంటికే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఈ సంక్షోభాన్ని బహుముఖంగా ఎదుర్కోవాలి.

నాణ్యమైన విద్యతో నైపుణ్యాల్ని అందిస్తూ కార్మిక, భూ, పన్ను సంస్కరణల్ని పెద్దఎత్తున తీసుకురావాలి. పనిగంటలు, భౌతిక రక్షణ వంటి వాటి విషయంలో రాజీలేకుండానే కార్మిక సంస్కరణల్ని అమలు చేయటం పూర్తిగా ఆచరణసాధ్యం. పర్యావరణాన్నీ పరిగణలోకి తీసుకుంటూనే వాణిజ్య అనుమతుల నిబంధనలను సడలించాలి. దీనివల్ల ముఖ్యంగా పొరుగున చైనాలో పెద్దసంఖ్యలో ఉన్న విదేశీ కంపెనీల నుంచి కూడా పెట్టుబడులు మొదలయ్యే అవకాశముంది. ఈ మార్పుల వల్ల సంఘటిత రంగంలో ఇబ్బడిముబ్బడిగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పారిశ్రామిక ప్రగతి పెరుగుతూ ఉపాధి అనేకరెట్లు ఊపందుకుంటుంది. అధ్వాన్నంగా ఉన్న మన విద్యావ్యవస్థను బాగు చేసుకోవటానికి ఆన్‌లైన్ బోధనను ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలి. ఇందుకు ఉపకరణాలకు తప్ప మిగతా అంశాలకు పెద్ద అదనంగా కూడా నిధుల్ని వెచ్చించాల్సిన అవసరం లేదు. చిన్న పని-పెద్ద పని, గొప్ప పని-తక్కువ పని అనే భావన లేకుండా, సమాజానికి ఉపయోగపడే ఏ పని ద్వారానైనా ఉపాధిని పొందటం గౌరవప్రదమైనదేననే భావనను భారతీయ సంస్కృతిలో భాగంగా మార్చాలి. ఈ రకమైన చర్యలు తీసుకుంటేనే, యువజనాభా ఆధిక్యత మన దేశానికి సమస్యగా మారకుండా సదవకాశంగా ఉపయోగపడుతుంది.

## 4. దయనీయ వలసలు లేకుండా చిన్న పట్టణాల అభివృద్ధి

భరతమాతకే నిజంగా రూపం వస్తే కరోనా వల్ల జరిగిన ఇతర నష్టాలకన్నా ముందు వలస కార్మికులు పడ్డ వేదనను చూసి కన్నీరు కార్చి ఉండేది. దేశాలకు దేశాలే రోడెక్కినట్లు వలస కార్మికులు జాతీయ రహదారుల మీద నిరంతర ప్రస్థానం సాగించారు. వలస కార్మికులంటే బిచ్చగాళ్లు కాదు. ప్రభుత్వాలు ఎన్ని ప్రగల్భాలు పలికినా పలుచోట్ల వలస కార్మికులు కడుపారా తిండికి కూడా అలమటించారు. కొన్నిచోట్ల వలస కార్మికులకు కొందరు స్వచ్ఛందంగా ఆహారం, ఇతర నిత్యావసర సాయాల్ని అందించినా వారు తీసుకోవటానికి అంగీకరించలేదు. తమకు చేసిన సాయాన్ని ఫోటో, వీడియో తీసి మీడియాకు రిలీజ్ చేస్తున్నారని, తాము

యాచకులమన్నట్లు ప్రచారం కావటం ఇష్టం లేకే సాయాన్ని తిరస్కరిస్తున్నామని వారు చెప్పారు.. విన్నావా సమాజమా?.. విన్నారా రాజకీయ నాయకులారా?

వలసలు తప్పు కాదు. వలసలు దేశాభివృద్ధిలో ఒక భాగం. స్థానికుల కంటే ఎంతో కష్టపడి పనిచేయటం ప్రపంచవ్యాప్తంగా వలసల్లో కంటే కనిపించే లక్షణం. అయితే నైపుణ్యాలకు తగ్గ మెరుగైన అవకాశాలను వెతుక్కుంటూ వలసలు వెళ్లటం వేరు, గతిలేక పొట్ట చేత పట్టుకుని వలసలు పోవటం వేరు. గతిలేక వలసలు వెళ్లే పరిస్థితి నుంచి మన దేశం బైటపడాలి. ఇందుకోసం గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరాన్ని ఇప్పటికైనా సరిదిద్దాలి. దేశవ్యాప్తంగా చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. చుట్టుపక్కల గ్రామాలకు పర్యావరణహిత ఆర్థిక కేంద్రాలుగా ఈ పట్టణాలు రూపుదిద్దుకోవాలి. ఇక్కడ వ్యవసాయాధారిత పరిశ్రమలకు ప్రాధాన్యతనివ్వాలి. ఉన్న ఊళ్లో వ్యవసాయం చేసుకుంటూ, సమీపంలో ఉన్న పట్టణానికి వెళ్లి వ్యాపారం చేసుకుని సాయంత్రంకల్లా తిరిగి ఊరు చేరుకునేలా జీవనశైలిని ప్రజలకు అందించాలి. కరోనా నేపథ్యంలో తిరుగు వలస వెళ్లిన కార్మికులు అక్కడే ఉంటామంటే, అందుకు ఈ సంఘటిత ఉపాధి అవకాశాలు ఉపయోగపడతాయి. ఇంకా మెరుగైన ఆదాయం కావాలనుకుంటే, తిరిగి నగరాలకు వస్తారు. అలా వస్తామనేవారు ఆత్మగౌరవంతో తిరిగి వచ్చే ఏర్పాట్లు చేయాలి. వలస వచ్చేవారికి జీవన భద్రత ఉండేలా, కొన్ని శాశ్వత చర్యలు తీసుకోవాలి. నగరాల్లో వారికి గృహ వసతి, ఉచిత ఆరోగ్య సదుపాయం, వారు రాజకీయంగా ఉనికిని చాటుకునేందుకు వీలుగా ఎక్కడ కోరుకుంటే అక్కడ ఓటు హక్కును వినియోగించుకునేందుకు చట్టబద్ధ ఏర్పాట్లు వంటివి చేయాలి.

## 5. పొలం నుంచి పళ్లెం దాకా రిటైల్ చెయిన్లతో రైతుకి-వినియోగదారుడికి లాభసాటిగా వ్యవసాయం

పంట ఎండినప్పుడే కాదు, బాగా పండినప్పుడు కూడా రైతులకు నష్టం చేకూర్చే పుణ్యభూమి భారతదేశం. 'ఇది ప్రకృతి శాపం కాదు.. పాలకులు చేస్తున్న పాపం' అని లోక్‌సత్తా జేపీ ఎన్నాళ్లగానో వాపోతున్నారు. ఈ ఏడాది కరోనా కాలంలో కూడా రైతులు మంచి దిగుబడుల్ని సాధించారు. అయినా రైతులకు అమ్ముకునే అవకాశం లేదు, వినియోగదారుడికి కొనుక్కునేందుకు సరకు లేదు. కొన్ని చోట్ల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసినా, కష్టానికి తగ్గ లాభం మాత్రం రైతుకు దక్కలేదు.

రైతు పండించిన పంటలు ఎన్ని అవాంతరాలొచ్చినా వినియోగదారులను చేర్చే ఏర్పాట్లని ఇప్పటిదాకా మన దేశంలో చేయలేదు. పైకి మాత్రం రైతే రాజు, రైతు లేకుంటే భారతదేశమే లేదు వంటి పొగడ్తలు వల్లిస్తుంటారు. చివరికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపకల్పనలో కూడా వ్యవసాయం కోణాన్ని పట్టించుకోలేదు. ఈ పథకాన్ని మెట్టప్రాంతాలు, కరువు జిల్లాల్లో నీటి వసతుల కల్పన వంటి వాటికి వినియోగం చేస్తే వ్యవసాయం బాగుపడుతుందని ఆరోజు జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ) సభ్యునిగా డా॥ జేపీ గట్టిగా వాదించినా, తెలుగు రాష్ట్రాలకే చెందిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి పడనీయలేదు. చివరికి ఆ పథకం మీద ఇప్పటికి రూ. 8,00,000 కోట్ల దాకా ఖర్చు పెట్టినా ప్రజల జేబుల్లో అనుత్పాదకంగా కొంత డబ్బు చేరటం మినహా పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. ఉపాధి హామీ పథకం నిధుల్ని గోతులు తీయటం, పూడ్చటం వంటి వాటి కోసం కాకుండా చెరువుల నిర్వహణ, వాననీటి సద్వినియోగం వంటి పనుల కోసం ప్రధానంగా మెట్టప్రాంతాల్లోనే వినియోగించాలని అసెంబ్లీలో కూడా జేపీ వాదించారు. అతని కంటే ఘనులం.. అన్నట్లు ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆ నిధుల్ని పందేరం చేయటం మినహా ఉత్పత్తి సాధనంగా ఉపయోగించలేదు. కరోనా అనుభవాల దృష్ట్యానైనా వ్యవసాయంలో సమూల మార్పులను మనం ప్రారంభించాలి.

రిటైల్ సప్లయ్ చెయిన్లను ఏర్పాటు చేస్తే, పొలం నుంచి ప్లేటు దాకా ప్రైవేటు పెట్టుబడులను, సహకార మార్కెటింగ్‌ను కూడా ప్రోత్సహిస్తే కరోనాలాంటి విపత్తులు వచ్చినా, అందరికీ అందుబాటు ధరలోనే ఆహారం అందుతుంది, మౌలిక వసతులు పెరగటం, దళారుల ప్రమేయం లేకపోవటం వల్ల రైతులకు కూడా మంచి రేటు దక్కుతుంది. ఇప్పుడు వినియోగదారుడు చెల్లించే ధరలో రైతుకి 30 శాతం వస్తుంటే, రిటైల్ చెయిన్లు ఉంటే 70 శాతం వరకూ లభించే అవకాశముంటుంది. పంట మీద ఆదాయం రావటం వల్ల కౌలు రైతులకు కూడా లాభం చేకూరుతుంది.

ప్రతి పెద్దదేశానికీ తన ప్రజలకు కనీసస్థాయి ఆహారాన్ని సమకూర్చేలా సాగులో మంచి ఉత్పాదకతతో స్వావలంబన ఉండాలిగానీ, ఆహారభద్రత పేరుతో అవసరానికి అనేకరెట్లు ధాన్యాన్ని నిల్వ చేసి కుళ్లబెడితే, స్వేచ్ఛా మార్కెట్‌ను అణగదొక్కితే రైతులు తీవ్రంగా నష్టపోతారు. వ్యవసాయం మీద ఆధారపడినవాళ్లు దాదాపు 40-50 శాతం ఉన్న భారత్ వంటి దేశాల్లో ఈ నష్టం ఇంకా ఎక్కువగా ఉంటుంది. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా కుంగుతుంది. ఒకప్పుడు ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కుహనా సోషలిస్టుల ప్రభావంతో ఆహారధాన్యాల కొనుగోలును కూడా జాతీయం చేస్తున్నట్లు ప్రకటించారు. అంటే ప్రభుత్వం తప్ప ఎవరూ ధాన్యం, గోధుమలు వంటివి కొనుగోలు చేయకూడదు. రైతులు ఇంకెవరికీ పంటల్ని అమ్ముకోవటానికి వీల్లేదు. కానీ దీనివల్ల తీవ్ర నష్టం, దుష్ప్రభావాలు మొదలవటంతో వెంటనే ఆమె ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు.

కొవిడ్ కారణంగా లాక్‌డౌన్ చేసే సమయానికి 8కోట్ల టన్నుల ఆహారధాన్యాలు నిల్వ ఉన్నాయని అంచనా. ఇవి కాకుండా కొత్తగా పెద్దఎత్తున పంట వచ్చింది. ఒకవేళ కొవిడ్ రాకుండా ఉండి ఉంటే, ప్రజలకు ఉచితంగా అదనపు ఆహార ధాన్యాల్ని పంచాల్సిన పరిస్థితి, ఇతర దేశాల్లో డిమాండు లేకపోతే, ఈ నిల్వలన్నీ ఏమై ఉండేవి?.. ఎంత పెద్దఎత్తున కుళ్లిపోయి ఉండేవి, పందికొక్కుల బారిన పడి ఉండేవి లేదా పక్కదారి పట్టేవి! ఆహార నిల్వల విధానం ఇంత

లెక్కలేనితనంతో ఉంది కాబట్టే ఎఫ్‌సీఐలో పోస్టింగులకు అంత డిమాండ్, అంత పెద్ద మొత్తంలో లంచాల వసూళ్లు.

అందుకే వ్యవసాయంపై అన్ని రకాల ఆంక్షల్ని తొలగించి, దాన్ని పర్యావరణ, జీవావరణహిత వ్యాపారంలా మార్చి రైతులు ఎగుమతులు చేసే అవకాశాన్ని కల్పించాలి. పెద్దఎత్తున రిటైల్ సప్లయ్ చెయిన్లను అనుమతించి మౌలిక వసతులను విస్తరించేలా చేయాలి.

ఎంత ఆదాయం వచ్చినా వ్యవసాయం మీద ప్రత్యక్షంగా మరీ ఎక్కువమంది ఆధారపడలేరు కాబట్టి.. పలువురు రైతులు తమ పిల్లల్ని బాగా చదివించాలనుకుంటున్నారు. అయితే విద్య, ఆరోగ్య రంగాలలో ప్రభుత్వాలు అధ్వాన్న విధానాలను అమలు చేస్తుండటంతో.. అవి వారికి పెనుభారంగా మారుతున్నాయి. పిల్లలకు కాస్త మంచి చదువు, కుటుంబానికి మెరుగైన ఆరోగ్యం కోసం రైతులు ఆస్తులు తెగనమ్ముకుంటున్నారు, అప్పుల పాలవుతున్నారు. అందుకే నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందరికీ అందుబాటులోకి తెచ్చే బాధ్యతను కూడా ప్రభుత్వాలు సక్రమంగా నెరవేరిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది, వ్యవసాయం నిజమైన పండుగలా మారుతుంది.

**మనకు అనుభవంలోకి వచ్చే ప్రతి 'కొత్త'ను మన గతంలోని ఏదోక పాతతో పోల్చి యధాతథ స్థితిని కొనసాగించేందుకు మానవ నైజం ప్రయత్నిస్తుంటుంది. ఇది సామాన్యులు, దిగువ మధ్యతరగతివారు యధాలాపంగా చేస్తే, సాంప్రదాయ రాజకీయ నాయకులు, సైద్ధాంతిక పిడివాదంలో కూరుకుపోయిన వెటరన్లు ఉద్దేశపూర్వకంగా చేస్తారు. కరోనా ఇంపాక్ట్ దాచేసినా దాగదు కాబట్టి.. ఎన్నో కొన్నిటిలో ఎంతో కొంత మార్పు చేసుకోకపోతే మనకు మనసొప్పదు, పాలకులకు గత్యంతరం ఉండదు. అసంకల్పితంగానే కొంత మార్పు జరిగిపోతుంది. కానీ ఆ మార్పుల్ని కూడా తెలిసోతెలియకో యధాతథ స్థితిలోకి ఏదోకరకంగా ఇమిడ్చే ప్రయత్నాల పట్ల మాత్రం అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికే ఇలాంటి ధోరణులు కనిపిస్తున్నాయి.**

## 6. చిట్టచివరి పౌరునికి కూడా సేవలనందించేలా పాలనా వ్యవస్థను ప్రక్షాళన చేయటం

జనరాజకీయం కాకుండా, ఏదోకరకంగా ఎన్నికల్లో గెలవటమే రాజకీయంగా మారటంతో.. మన దేశంలో ప్రభుత్వాల పట్ల ప్రజల్లో విశ్వాసం తక్కువ. పాలకుల నుంచి ఏరోజుకారోజు వీలైనంత దండుకుందామనే ధోరణే ఎక్కువగా కనిపిస్తుంది. ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రక్షాళన చేసి జవాబుదారీతనాన్ని, సామర్థ్యాన్ని పెంచితే ఎటువంటి సంక్షోభం వచ్చినా చిట్టచివరి పౌరునికి కూడా సమర్థంగా సేవలందుతాయి. ప్రభుత్వం పట్ల విశ్వాసం పెరుగుతుంది. కరోనా వంటి విపత్తులు వచ్చినప్పుడు, వందల, వేల కిలోమీటర్లు నడవాల్సిన, ప్రమాదాల బారిన పడాల్సిన, ఆ దృశ్యాల్ని చూడాల్సిన విషాదం నుంచి ఈ దేశం, సమాజం బైటపడతాయి. రాజకీయ పార్టీల మీద కూడా భారం తగ్గి, ఎన్నికల్లో సమర్థులు, నిజాయతీపరులు పోటీ చేసే అవకాశాలు మెరుగవుతాయి.

## 7. కష్టసమయంలో ప్రజలకు ఉదారంగా డబ్బు పంపిణీకి వీలుగా అనుత్పాదక, అసంబద్ధ పథకాలకు దుబారా చేయకుండా ఉండటం

పేదల జేబుల్లో వీలైనంత నగదును పెట్టాలని లోక్‌సత్తా లాక్‌డౌన్‌కు ముందునుంచీ చెబుతోంది. కానీ ఆ అవకాశం మన దేశానికి చాలా పరిమితంగా ఉంది. సంపన్న దేశాల్లా ఉద్యోగుల జీతాల్ని కొన్ని నెలలపాటు చెల్లించి, ప్రజలకు పెద్దఎత్తున నగదు బదిలీ చేసే పరిస్థితి భారతదేశ ఖజానాకు లేదు. రిజర్వుబ్యాంకు దగ్గర్నుంచి, పోటీతో సంబంధం లేకుండా గుత్తాధిపత్యంతో లాభాలు గడించిన ప్రభుత్వరంగ సంస్థల నుంచి మిగులు ఆదాయాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం తీసేసుకుంది. రాష్ట్రాల్లోనూ అదే తరహా తడుముకునే పరిస్థితి. పెట్రోల్ ధరలు తగ్గటం వంటి వివిధ సానుకూల అవకాశాల ద్వారా వచ్చిన లక్షల కోట్ల డబ్బును మోదీ ప్రభుత్వం వివిధ కారణాలతో వృథా చేయగా, రాష్ట్రాల్లో పెరిగిన సంపదను ఓట్ల కోసం అనుత్పాదక పథకాలు, తాత్కాలిక తాయిలాల కోసం పందేరం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్నిచ్చే ప్రత్యామ్నాయ ప్రణాళికల్ని పట్టించుకోకుండా కమీషన్లు, ఆర్భాటపు ప్రచారం కోసమే అన్నట్లు అనుత్పాదక, భూమిలోపలి వాటర్ టేబుల్స్‌ను మార్చేసే అసంబద్ధ ప్రాజెక్టుల్ని నిర్మించారు. ఇలాంటి పాలనా ధోరణుల వల్ల ప్రజలకు నిజంగా అవసరమైన ఈ సమయంలో డబ్బును పంచాలంటే అందుబాటులో సంపద లేకుండా పోయింది.

## అసలు ప్రభుత్వాలు చేయాల్సిన పనులేంటి?.. అన్న చర్చ మనందరిలో మొదలవ్వాలి

పైన పేర్కొన్న ఈ అంశాలతోపాటు (లోక్‌సత్తా విధానాల సమగ్ర వివరాల్ని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎఫ్‌డీఆర్ఇండియా.ఆర్గ్‌లో చూడవచ్చు) ప్రభుత్వంపై పెనుభారం లేకుండా ఉపాధితో వృద్ధికి దోహదం చేసే రియల్ ఎస్టేట్ తదిర రంగాలలో లిక్విడిటీ వంటి అంశాలను కూడా జోడించి కొవిడ్ సంక్షోభం నేపథ్యంలో ఆశావాదంతో జేపీ ఇచ్చిన సవివర రోడ్‌మ్యాప్‌లో కొన్నిటిని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్వీకరించింది. 'ఆత్మనిర్భర భారత్' లక్ష్యమంటూ సుమారు రూ.21 లక్షల కోట్లతో ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీలో వీటిని చేర్చారు. అయితే వంద అడిగితే పది, పదిహేను మాత్రమే ప్రకటించారు. కొంత దిశ మారిందని, క్రమంగానైనా మార్పు మొదలవుతుందని మాత్రం ఆశించవచ్చు. ఈ సంస్కరణల్ని

కూడా కాగితాల మీద నుంచి వాస్తవంలోకి తెచ్చి అమలు చేయటానికి ఎంత చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారో చూడాలి. ఈ తరహా సంస్కరణలను అమలు చేస్తానని హామీ ఇవ్వటం వల్లే, 2014 ఎన్నికల సమయంలో మోదీ నేతృత్వం వహిస్తున్న ఎన్డీయేకి లోక్‌సత్తా మద్దతిచ్చింది. ఎంతోకాలంగా చెబుతున్నవే అయినా, ఇప్పటికీ ఇవి అమలు కాకపోవటం వల్లే భారతదేశం కరోనా కాలంలో చేష్టలుడిగి మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

కరోనా నేపథ్యంలో ఇంతజరిగాకైనా భారతదేశం మారాలని, ఈ సంక్షోభాన్ని అవకాశంగా మలచుకోవాలని మనలో దాదాపు అందరూ భావిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలు, పౌర సమాజం, ప్రభుత్వాల్లోని వారు కూడా ఇదే అనుకుంటున్నారు. కానీ పాత జీవితంలో, రాజకీయంలో అలవాటైన పద్ధతుల్లో ఆ పనిజరగాలనే భావన నుంచి ఇంకా పూర్తిగా బైటపడలేదు. వలస కార్మికుల కష్టాన్ని వర్ణిస్తూ.. అలా బతకటం వారికి (కార్మికులకు) 'ఆనవాయితీ' అని రాసిన ఓ కవితకు ప్రథమ బహుమతి లభించటం మనలో ఇంకా నూతన కార్యాచరణకు కావలసిన మార్పు రాలేదని స్పష్టం చేస్తుంది. లాక్‌డౌన్ సమయంలో, కరోనా పట్ల భయాలు విపరీతంగా ఉన్న సమయంలో నిర్వహించిన పోటీ అది. పుట్టుకను బట్టి జీవితం నిర్ణయమైపోవటం ఆనవాయితీ, మామూలే అని భావించే భావజాలానికి ప్రథమ బహుమతి ఎలా ఇస్తారు?.. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన తప్పు కాదు. మనలో కులం, పేదరికం పట్ల వివక్షలు అనాదిగా, చాలా సాధారణమే అన్నట్లు పాతుకుపోయాయి. వాటిని మునుపెన్నడూ మనం ఎరుగనటువంటి లాక్‌డౌన్‌లాంటి అత్యంత అసాధారణ సందర్భం కూడా సమగ్రంగా కదిలించలేకపోయింది.

ప్రభుత్వాలు లాక్‌డౌన్‌ని అసంబద్ధమైన రీతిలో విధించి, అసంబద్ధమైనరీతిలో ఎత్తివేస్తుండటంతో మనలో ఏర్పడిన గందరగోళం కూడా మనలోని మార్పుని కొంత గందరగోళ పరుస్తోంది. మనం ఇలాంటి కల్లోలాలలో చిక్కుకోకుండా తగిన వ్యవస్థల నిర్మాణం ఎలా చేసుకోవాలి, మన జీవితాన్ని జీవిస్తూనే సాటి ప్రజల పట్ల, పర్యావరణం పట్ల ఎంతోకొంత బాధ్యతగా ఎలా ఉండాలి? అనే అంశాల్ని స్పష్టంగా తెలుసుకోవాలి. అసలు ప్రభుత్వం చేయాల్సిన పనులేమిటి? అని నిర్దిష్టంగా తేల్చుకోవాలి. కరోనా నేపథ్యంలో మనలో వచ్చిన సానుకూల మార్పులు, గాఢమైన అనుభూతుల వెనుక ఉన్న పరివర్తనల్ని జాగ్రత్తగా గుర్తించి రాజీలేని సంకల్పాలుగా మార్చుకోవాలి.

కొవిడ్ పరిణామాల గురించి మనకు ఇంకా పూర్తి వివరాలు లేకపోయినా, దానంతటదేనో, మందులు, వ్యాక్సిన్ ద్వారానో అది కాస్త అటూఇటుగా త్వరలోనే సద్దుమణుగుతుంది. కానీ ఇంత జరిగాక కూడా మనం దిద్దుబాట్లు చేసుకోకపోతే రాబోయే కాలంలో ఎదుర్కోవాల్సిన సంక్షోభం ఇంతకంటే తీవ్రంగా ఉంటుంది. ఎందుకంటే, కరోనా ముగింపు కాదు, అంతకుమించిన ఉత్పాతాలు మన చుట్టూ ఇప్పటికే ఉన్నాయని, విధానపరమైన వైఫల్యాల వల్ల మన దేశం ఇప్పటికే మధ్యాదాయ దేశం స్థాయికి పరిమితమవుతోందని కరోనాతోనైనా మనకు తెలిసొచ్చింది. మరోవైపు, ఆకలితో, అవమానంతో అంత దూరం ప్రయాణించిన ఆ కార్మికులు, వారి బిడ్డలు ఆ అనుభవాన్ని ఎప్పటికైనా మర్చిపోగలరా? ఈ జాతి నిర్లక్ష్యాన్ని, అహంకారాన్ని, అనాగరికతను అంత తేలిగ్గా క్షమించగలరా? పేదరికం, నివారించదగ్గ ఇతర బాధల నుంచి విముక్తి చేస్తూ ప్రతి బిడ్డకూ ఎదిగే గ్యారంటీ అవకాశాలనిచ్చే లోక్‌సత్తా భావజాలం మధ్య ఈ రచయిత దాదాపు 14 ఏళ్లుగా పనిచేస్తున్నా, రోజువారీ నడకలో, ప్రజారవాణా ప్రయాణంలో సమాజంలో పలుచోట్ల పాతుకుపోయిన దయనీయ జీవితాల్ని చూస్తే పరిష్కారంపై గుండె జారిపోతుంటుంది. ఎప్పటికి వీరి జీవితాల్ని బాగుచేయగలం? అనే అగమ్యతా భావం ఆవరిస్తుంటుంది.. పరిస్థితి అంత భయంకరంగా ఉంది. ఎంతో సమాచారం ఉండే ప్రభుత్వం.. వలస కార్మికుల బతుకుల్ని పాలకులు అంచనా వేయలేకపోవటం దిగ్భ్రమ కలిగిస్తుంది. ఓ కాళేశ్వరాన్ని, ఓ పోలవరాన్ని, మనం నిత్యం ప్రయాణించే జాతీయ రహదారుల్ని, ఢిల్లీ, హైదరాబాద్, ముంబయి వంటి మహానగరాల్లో కట్టడాల్ని, మెట్రో మార్గాల్ని నిర్మించిన వలస కార్మికులెవ్వరు.. అనే ప్రశ్నను ఊహించే సున్నితత్వాన్ని కూడా కోల్పోయిన మన ప్రభుత్వాలు, సమాజం ఎంతో, ఎంతో మారాల్సి ఉంది!

కళింగ యుద్ధాన్ని చూసిన అశోకుడు తన జీవితగమనాన్నే మార్చుకుని ప్రజారంజక పాలకుడయ్యాడు. రెండు ప్రపంచ యుద్ధాల తాకిడికి గురైన పాశ్చాత్య ప్రజలు ఆ చైతన్యంతో తమ దేశాలను అగ్రరాజ్యాలుగా మార్చుకున్నారు. కరోనా కాలంలో చూసిన, ఏదోకరూపంలో అనుభవించిన అపార వేదన, ఆక్రోశం తర్వాతైనా మనం దీర్ఘకాల వైఫల్యాల్ని దిద్దుకునేపాటి చైతన్యాన్ని, సంకల్పాన్ని నిలకడగా ప్రదర్శించలేమా?

కవులు కేవలం సహానుభూతిని ప్రకటిస్తే, నినాదాలిస్తే చాలదు. మేధావులు సమస్యల్ని తెలియజెప్తే చాలదు. రాజకీయ నేతలు విమర్శలు చేస్తే చాలదు. మీడియా సమస్య వర్ణనలకు పరిమితమైతే చాలదు. ప్రజలు అన్నిటినీ ప్రభుత్వాలకు వదిలేసి సమస్య ఎలా పోతుందా అనుకుంటుంటే చాలదు.. నిర్దిష్ట, హేతుబద్ధ పరిష్కారాలు కావాలి, అందులో అందరూ భాగస్వాములు కావాలి. వాటిని సాధించేందుకు సంఘటితంగా కృషి చేయాలి. అందరి ప్రయోజనాలనూ సమన్వయపరిచే హేతుబద్ధ పరిష్కారంలో భాగమవ్వకుండా నిరంకుశంగా మాట్లాడతాం, రాస్తాం, వ్యవహరిస్తామంటే ప్రజాస్వామ్యంలో కుదరదు.

అసలు ప్రభుత్వం చేయాల్సిన పనులేంటి? సంక్షేమ పథకాలు ఏరకంగా ఉండాలి? సంక్షేమం కోసం వెచ్చించే డబ్బును ఏ రకంగా పంపిణీ చేస్తే ఉత్పాదకంగా ఉంటుంది? బడ్జెట్‌లో ఎంతమేర పార్టీలు తమకు నచ్చిన హామీల్ని ఇవ్వవచ్చు?.. తదితర అంశాల మీద ఈ సమయంలో చర్చ జరగాలి. నాణ్యమైన విద్య, ఆరోగ్యాన్ని అందించకుండా మరే మార్గంలోనూ దేశ, సమాజ, వ్యక్తుల అభివృద్ధి సాధ్యం కానప్పుడు.. అవెందుకు మన ప్రభుత్వాల ప్రధాన

ఎజెండాగా మారటంలేదో ప్రతి ఒక్కరూ లోతైన ఆలోచన చేయాలి. మాస్కులు, భౌతిక దూరం, పరిశుభ్రత జాగ్రత్తల్ని పాటిస్తూనే, పిల్లల్ని, పెద్దవయసు వారిని, ఆరోగ్యసమస్యలున్నవారిని కాపాడుకుంటూనే, వైరస్ పరిణామ క్రమంలో అనుకోకుండా కొత్త సమస్యలేమైనా తలెత్తితే బెంబేలెత్తిపోకుండా ఆరోగ్యాన్నీ, ఆర్థికాన్నీ కూడా కాపాడుకుంటూ అధిగమిస్తూనే సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ పైన పేర్కొన్న ఎజెండా కోసం అప్రమత్తంగా కృషి చేయాలి.

కొసమెరుపు: చైనాతో మన దేశానికి ఉన్న సరిహద్దు వివాదాలు రెండు దేశాల మధ్యా ఉద్రిక్తతలకు కారణమవుతూనే ఉన్నాయి. చైనాను మనం ఏమీ చేయలేమా? అనే భావం మనలో చాలామందిలో పెరుగుతోంది. 1962లో అప్రకటిత యుద్ధంలో ఘోరపరాభవం నాటి నుంచి మనలో చైనా పట్ల వ్యతిరేకత అంతర్లీనంగా కొనసాగుతూనే ఉంది. కానీ ప్రపంచం ఈవేళున్న పరిస్థితుల్లో ఏ దేశాన్నయినా మరో దేశం సైనికంగా దెబ్బతీసే పరిస్థితులు చాలా తక్కువ. ముఖ్యంగా చైనాలాంటి దేశం మీద మనం అలాంటి యుద్ధాలు చేసి గెలవటం దాదాపు అసాధ్యం. ఒకప్పుడు అంతర్జాతీయ సమాజంలో గుర్తింపు పొందటానికి భారతదేశం సాయం తీసుకున్న చైనా.. 1960-70ల నుంచీ అసాధారణ దార్శనికతను, వాస్తవిక పరిస్థితులను మేళవించి ఆర్థిక సరళీకరణను, మానవ వనరులను అభివృద్ధి చేసే నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటివి ప్రజలందరికీ అందించే ఏర్పాట్లను వేగంగా చేసుకుంటూ ఎదిగింది. 'అందరికీ ఎదిగే అవకాశాల్ని కల్పించటం, వ్యక్తుల నుంచి సమాజాన్ని కాపాడటం' అనే రాజ్యవ్యవస్థ ప్రధాన బాధ్యతను మన కంటే చైనా ఎక్కువగా పాటించింది. దొంగ, బూర్జువా సోషలిషం (మన దేశంలో దశాబ్దాలుగా చెలామణి అవుతున్నది అసలైన సోషలిజం కాదు) ప్రభావంతో మన ప్రభుత్వాలు తాము చేయాల్సిన విద్య, ఆరోగ్యం, స్థానిక సాధికారత, చట్టబద్ధపాలన, మౌలిక వసతులు వంటి బాధ్యతలను వదిలేసి లైసెన్స్-పర్మిట్ వ్యవస్థను పెంచి పోషించి, తాత్కాలిక తాయిలాల పథకాల పేరుతో ఉన్న డబ్బును పందేరం చేస్తున్నాయి. దీంతో మనం చైనా కంటే ఉన్నకొద్దీ వెనుకబడ్డాం. ఇప్పుడు ఆ దూరం యోజనాల లెక్కన ఉంది. సంపద, తలసరి ఆదాయంలో, సైనిక పాటవంలో మన కంటే చైనాలో అనేక రెట్లు ముందుంది. ఏ కోణంలో చూసినా చైనాపై మనం సైనిక పరంగా గెలవటం కష్టం. అవసరమైతే చైనాకు గట్టి సమాధానం ఇవ్వగలమనే సంకేతాన్ని ఇస్తూనే, వాణిజ్యపరంగా, దౌత్యపరంగా ఆ దేశాన్ని నియంత్రిస్తూ లౌక్యంగా సరిహద్దుల వద్ద మన ప్రయోజనాల్ని సాధించుకోవటమొక్కటే మార్గం. ఇప్పటిదాకా వ్యవహరించినట్లే ఈ పూట గడిస్తే చాలన్నట్లు తాత్కాలిక తాయిలాలు, జవాబుదారీతనంలేని పాలన వంటి వాటినే కొనసాగిస్తే, విద్య, ఆరోగ్యం, స్థానిక సాధికారత వంటి అంశాల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే.. మనం చైనాను ఎప్పటికీ అధిగమించలేం. చైనా వస్తువుల్ని బహిష్కరించటం వంటి ఆచరణసాధ్యంకాని ఉక్రోషపు నినాదాలు, చర్యలకన్నా.. చైనాలాగా విద్య, ఆరోగ్యం వంటి మౌలిక రంగాల్లో సరైన విధానాలతో దీర్ఘకాలిక కృషి చేయటం అవసరం. చైనా కొన్ని దశాబ్దాల వెనక్కి, కొన్ని దశాబ్దాలు ముందుకి ఆలోచించి తన దార్శనికతను, లక్ష్యాల్ని నిర్ణయించుకుంటుంది. వర్తమానంలో వాటి సాధనకు కఠోర కృషి చేస్తుంది. ఆస్ట్రేలియాపై క్రికెట్ ప్రపంచ్‌కప్ గెలిచినంత తేలిక కాదు ఇప్పుడు చైనాను అధిగమించటం. కరోనా నేపథ్యంలో కలిగిన చైతన్యంతోనైనా మనం చైనాతో మాటల్లో కాకుండా చేతల్లో పోటీ పడాలి.

మన దేశంలో వ్యవస్థలు సక్రమంగా లేకపోవటం వల్లే విదేశాల నుంచి వచ్చిన కొందరు బాగా చదువుకున్న ప్రవాస భారతీయులు కూడా థర్మల్ స్క్రీనింగ్‌లో జ్వరం బైటపడకుండా పారాసిటమాల్ టాబ్లెట్‌ను వేసుకోవటం, క్వారంటైన్ కాలంలో యధేచ్ఛగా తిరుగుతూ జల్సాలు చేయటం ద్వారా మన దేశంలో వైరస్ వ్యాప్తికి కారణమయ్యారు. ఇదే ఎన్నారైలు విదేశాల్లో మాత్రం చట్టాల్ని తూచ పాటిస్తారు. మన దేశంలో వ్యవస్థలు సక్రమంగా లేకపోవటంతో చదువుకున్నవాళ్లు కూడా నిరక్షరాస్యులకన్నా కనాకష్టంగా వ్యవహరిస్తూ దేశాన్ని ఇంకా భ్రష్టు పట్టిస్తున్నారు. భారతీయులు దేన్నయినా కొత్తగా ఆలోచించి, సొంతంగా అభివృద్ధి చేయటంలో తడబడతారుగానీ, సరైన ప్రోత్సాహాలతో వ్యవస్థల్ని నిర్మించి మార్గం చూపిస్తే మాత్రం ప్రపంచంలో మరే దేశంలోనివారూ చేయలేనిరీతిలో అద్భుత సృజనాత్మకతతో, ఉత్సాహంతో కొత్త పుంతలు తొక్కించగలరు. ఆ జుగాడిస్ట్ అడ్వాంటేజ్‌కి మనం కరోనా నేపథ్యంలో కలిగిన చైతన్యాన్ని వినియోగించాలి.

మన దేశంలో వ్యవస్థలు సక్రమంగా లేకపోవటం వల్లే విదేశాల నుంచి వచ్చిన కొందరు బాగా చదువుకున్న ప్రవాస భారతీయులు కూడా థర్మల్ స్క్రీనింగ్‌లో జ్వరం బైటపడకుండా పారాసిటమాల్ టాబ్లెట్‌ను వేసుకోవటం, క్వారంటైన్ కాలంలో యధేచ్ఛగా తిరుగుతూ జల్సాలు చేయటం ద్వారా మన దేశంలో వైరస్ వ్యాప్తికి కారణమయ్యారు. ఇదే ఎన్నారైలు విదేశాల్లో మాత్రం చట్టాల్సి తూచ పాటిస్తారు. మన దేశంలో వ్యవస్థలు సక్రమంగా లేకపోవటంతో చదువుకున్నవాళ్లు కూడా నిరక్షరాస్యులకన్నా కనాకష్టంగా వ్యవహరిస్తూ దేశాన్ని ఇంకా భ్రష్టు పట్టిస్తున్నారు. భారతీయులు దేన్నయినా కొత్తగా ఆలోచించి, సొంతంగా అభివృద్ధి చేయటంలో తడబడతారుగానీ, సరైన ప్రోత్సాహాలతో వ్యవస్థల్ని నిర్మించి మార్గం చూపిస్తే మాత్రం ప్రపంచంలో మరే దేశంలోనివారూ చేయలేనిరీతిలో అద్భుత సృజనాత్మకతతో, ఉత్సాహంతో కొత్త పుంతలు తొక్కించగలరు. ఆ జుగాడిస్ట్ అడ్వాంటేజ్‌కి మనం కరోనా నేపథ్యంలో కలిగిన చైతన్యాన్ని వినియోగించాలి.

# రేపటి చరిత్ర నిర్మాణానికి సదావకాశం




కరోనా - పాజిటివ్స్!
కంగారు పడకండి మిత్రులారా,
ఆ మహమ్మారి మాటున ఉన్న గొప్ప అవకాశాలివి..
ప్రకృతి సమతౌల్యం - సమాజ హితం మధ్యనే వ్యక్తి సుఖం ఉందంటూ
ఆ అనాది గీతల్ని మానవాళికి గుర్తుచేసింది కరోనా!
మన దేశం గురించే మాట్లాడుకుందాం..
నాయకుల నిర్లక్ష్యం వల్ల విలవిల్లాడుతున్న కొన్ని అగ్రరాజ్యాలతో పోలిస్తే మెరుగని భారత్ సంబర పడటం సరికాదంటోంది కొవిడ్-19
వేగంగా పూర్వవైభవం సంతరించుకోగల ఆర్థిక, ఆరోగ్య, పాలనా బలం ఆ దేశాలకుందనీ, భారత్ కొంత ఆలస్యంగానైనా మేలుకొని చురుగ్గా వ్యవహరిస్తున్నప్పటికీ ఇక్కడ గొప్పగా చేయగలుగుతున్నది లాక్‌డౌన్ మాత్రమేనని ఎత్తిచూపుతోంది కరోనా
లాక్‌డౌన్ కింద నలిగిపోతున్న పదుల కోట్ల ప్రజల నిరుద్యోగాన్ని, అనారోగ్యాల్ని వెల్లడిస్తోంది కొవిడ్
పసలేని చర్చలు పోయి.. ఇప్పుడు నిపుణులు, జనహిత మేధావులు పాల్గొనే విలువైన చర్చలు వచ్చాయి చూడమంటోంది
వీటిల్లో తెలుగునేల నుంచి (థాంక్యూ లోక్‌సత్తా జేపీ) అగ్రరాజ్యాల దాకా ప్రపంచంలోనే అత్యుత్తమ మేధావులు, నిపుణులు అనదగ్గవారు ఏం చెప్పారో గుర్తుంచుకోమంటోంది
లాక్‌డౌన్ సామాన్యుల్ని చిదిమేయకుండా, రాతియుగంలోకి వారిని నెట్టకుండా చకచకా టెస్టింగులు, ట్రేసింగులు, ట్రీట్‌మెంట్లు చేస్తూ కొన్ని ఆంక్షలు, రక్షణలతో లాక్‌డౌన్‌ను ఎత్తివేయమంటోంది
అసాధారణ సందర్భం కాబట్టి వలస కార్మికులు, ఇతర పేదల చేతుల్లో వీలైనంత డబ్బు పెట్టమంటోంది
సామాజిక సేవ చేసే పౌరులకు, సంస్థలకు నూరుశాతం పన్ను రాయితీల్ని అందించమంటోంది
మాస్కులు, భౌతిక దూరాలు, శుభ్రత పాటించమంటోంది
తదనంతర కాలంలో చేసుకోవాల్సిన దిద్దుబాట్లను ఇంకా నిక్కచ్చిగా చెబుతోంది.. కొవిడ్
ఉపదేశాలు, ఆదేశాలే ఎక్కువగా ఇచ్చిన నిరంకుశ పాలకులకన్నా శాస్త్రీయంగా, ప్రజాస్వామికంగా వ్యవహరించిన నేతలే కరోనాను సమర్థవంతంగా కట్టడి చేశారని, ప్రజాస్వామ్య సంస్కృతిని పెంపొందించుకొమ్మంటోంది
ప్రజల మీద భారం - వైద్యుల మీద దాడులు లేని బలమైన ప్రజారోగ్య వ్యవస్థని, పటిష్ఠ స్థానిక ప్రభుత్వాలున్న సమాఖ్య వ్యవస్థని, చిట్టచివరి పౌరునికి కూడా సమర్థంగా సేవలందించగలిగిన ప్రభుత్వ యంత్రాంగాన్ని, పనిచేసే ప్రజలని అసంఘటిత రంగం నుంచి సంఘటిత రంగంలోకి తెచ్చే కార్మిక, భూ సంస్కరణల్ని, ఉపాధి, సామాజిక నైపుణ్యాలనందించే నాణ్యమైన విద్యని, మారిన ఆర్థిక అవసరాలకనుగుణంగా పరిశ్రమల్ని వేగంగాను, పర్యావరణహితంగాను నెలకొల్పేందుకు నిబంధనల ప్రక్షాళనను, వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు రైతుకూ వినియోగదారునికీ మధ్య దళారులు లేకుండా భారీ రిటైల్ సప్లయ్ చెయిన్లను, ఎగుమతులను ఏర్పాటు చేసుకోవాలని, చిన్నపట్టణాలను అభివృద్ధి చేసుకోవాలని అంటోంది కరోనా
ప్రభుత్వాలు ఎన్ని ఉచితాలనిచ్చినా.. ఉపాధి ద్వారా ప్రజలకు వచ్చే ఆదాయానికి, అవకాశాలకు అవి సాటిరావని గుర్తించమంటోంది
ప్రజానీకం పనిచేయకపోతే, పన్నులు కట్టకపోతే ప్రభుత్వాలు మిథ్య అని స్పష్టం చేస్తోంది
అందుకే, ప్రజాధనాన్ని తాత్కాలిక తాయిలాల పథకాల కోసం దుబారా పందేరం చేయకుండా ఉత్పాదక పథకాలకు వెచ్చించి ప్రజల ఆదాయాల్ని, దేశ సంపద నిల్వల్ని పెంచాలని సూచిస్తోంది
మూఢ మత బోధనల బారిన పడకుండా శాస్త్రీయంగా, హేతుబద్ధంగా వ్యవహరించమంటోంది
మిత్రులారా, ప్రపంచ యుద్ధాల వంటివి పాశ్చాత్య ప్రజలని కదిలించి ఆ దేశాల్ని అగ్రరాజ్యాలుగా మార్చాయి
మౌలిక వైఫల్యాలతో కునారిల్లుతున్న మన దేశానికి కరోనా అలాంటి కుదుపు కావాలి!
ఇప్పటిదాకా ఇలాంటి ఎజెండాతో పొరపాటున ఎవరైనా వస్తే ధమ్మని ఎన్నికల్లో ఓడిస్తున్నాం
కానీ ఇక మీదట ఇలాంటి ఎజెండానే మన రాజకీయాల్లో, పాలనలో, పౌరసమాజంలో ప్రోత్సహిద్దాం
మహమ్మారి కరోనా పరిణామం మనకు ఒక మహాసింహావలోకనం
మన రేపటి చరిత్రకు అతి పెద్ద మేలుకొలుపు, మహదవకాశం కూడా!

**(ఏప్రిల్, 2020)**

# నేటి ఆత్మనిర్భర్ భారత్ హామీ.. నాటి రైతు సత్యాగ్రహ యాత్ర పోరు!



కొవిడ్-19 మహమ్మారి కనీవినీ ఎరుగని ఒక సంక్షోభం అని చెబుతూ.. ఆర్థిక వ్యవస్థ, మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత వ్యవస్థలు, చైతన్యవంతమైన ప్రజానీకం, గిరాకీ అనే ఐదు స్తంభాలు ఆధారంగా ఒక స్వావలంబన భారతదేశాన్ని సాధించాలనే లక్ష్యాన్ని ప్రధానమంత్రి మోదీ మే మాసంలో ప్రజల ముందుంచారు. అంతర్జాతీయ సప్లయ్ చెయిన్‌లో భాగస్వాముల మవుతూనే స్థానికత చుట్టూ ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యమిస్తామన్నారు. నాలుగు 'ఎల్స్' (ల్యాండ్, లిక్విడిటీ, లేబర్, లాస్) సంస్కరణల్ని తెస్తామన్నారు. 'ఆత్మనిర్భర్ భారత్' పేరుతో రూపొందించిన ఈ ఆర్థిక ప్యాకేజీకి దాదాపు రూ.21 లక్షల కోట్లు కేటాయించారు. భారతదేశ స్థూల జాతీయోత్పత్తిలో ఇది 10 శాతం దాకా ఉంటుంది. సూక్ష్మ, చిన్నతరహా వ్యాపార సంస్థలను పునర్నిర్వచించి నాన్‌బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలతోపాటు నూరుశాతం ప్రభుత్వ గ్యారంటీతో రుణసదుపాయం కల్పించటం, వలస కార్మికులకు ఉచిత ఆహారధాన్యాల సరఫరా, ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు, వలస కార్మికులకు అందుబాటు అద్దెతో ఇళ్ల సముదాయాల నిర్మాణం, రైతులకు రాయితీ క్రెడిట్, వీధి వర్తక వ్యాపారులకు వర్కింగ్ క్యాపిటల్ రుణసౌకర్యం, బొగ్గు, ఖనిజాలు, రక్షణ, పౌర విమానయానం, విద్యుత్తు సరఫరా, సామాజిక మౌలిక సదుపాయాలు, అంతరిక్ష, పరమాణు శక్తి రంగాలలో సరళీకరణ సంస్కరణలు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమానికి అదనంగా రూ.40,000 కోట్లు, ఆరోగ్యం, విద్య, రాష్ట్రాల రుణపరిమితిని షరతులతో సడలించటం, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల్లో మార్పులు వంటివి ఇందులో ఉన్నాయి. వీటిల్లో కీలకమైనవి వ్యవసాయ రంగంలో ఆంక్షల తొలగింపునకు సంబంధించినవి.

పంట దిగుబడులను మంచి ధరలకు ఎక్కడైనా అమ్ముకునేందుకు అంతర్ రాష్ట్ర రవాణాపై ఆంక్షలు ఎత్తివేయాలని, ఇందుకోసం జాతీయ చట్టాన్ని తెస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. "ఇకపై రైతులు తమ ఉత్పత్తులను ఎక్కడైనా, ఎవరికైనా అమ్ముకోవచ్చని, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ చట్టం ప్రకారం గతంలోలాగా మార్కెట్ కమిటీలకో, మండీలకో నిర్దేశిత ధరలకే అమ్ముకోవాల్సిన పనిలేదని" ఆత్మనిర్భర్ భారత్ ప్యాకేజీని ప్రకటిస్తూ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పరిశ్రమల యజమానులు చేసే ఉత్పత్తులపై లేని ఆంక్షలు రైతుల ఉత్పత్తులపై ఎందుకుండాలని ఆమె ప్రశ్నించారు. వ్యవసాయ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో కూడా అమ్మే అవకాశం కోసం ఈ-ట్రేడింగ్‌కు వీలు కల్పిస్తామన్నారు. వ్యవసాయోత్పత్తులకు సరైన ధర లభించేందుకు వీలుగా ఆరున్నర దశాబ్దాల నిత్యావసర వస్తువుల చట్టాన్ని సవరిస్తామని, అత్యవసరమైతే తప్ప దాన్ని వినియోగించబోమని చెప్పారు (జూన్ మొదటివారంలో వీటికి సంబంధించి కొంత స్పష్టతనిస్తూ ఆర్డినెన్సుల్ని జారీ చేశారు). రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే క్రమంలో ఫామ్ గేట్ అగ్రిగేషన్ పాయింట్లు (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వ్యవసాయ సంబంధిత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు తదితరాలు) వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు రూ.లక్ష కోట్ల ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి తెలిపారు. ఇంకా పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి కూడా నిధుల కేటాయింపుని ప్రకటించారు.. గుర్తుందా? వ్యవసాయ మార్కెటింగ్‌లో ఆంక్షల్ని తొలగించి రైతులు తమ ఉత్పత్తులను పారిశ్రామికవేత్తల్లాగా దేశంలో, ప్రపంచంలో ఎక్కడ ధరుంటే అక్కడ అమ్ముకునే స్వేచ్ఛను కల్పించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ భుజాన బియ్యం మూటలతో చేసిన రైతు సత్యాగ్రహ యాత్ర! బీపీటీ ధాన్యానికి పక్క రాష్ట్రాల్లో ఎక్కువ రేటున్నా అక్కడకు తీసుకెళ్లి అమ్ముకోవటానికి వీల్లేదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియంత్రించటంతో.. అప్పటికే ఉన్న కేంద్ర ప్రభుత్వ చట్టంలోని ఓ వెసులుబాటును ఉపయోగించుకుని.. కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు బియ్యం మూటతో జేపీ స్వతంత్ర రైతు సంఘాలతో కలిసి బయల్దేరారు. పక్కరాష్ట్రంలో అమ్ముతాం, దమ్ముంటే అరెస్టు చేయండని ప్రభుత్వాన్ని సవాలు చేశారు. నిత్యావసర వస్తువుల చట్ట ధిక్కారం కింద కూడా కేసు నమోదు చేసే సాహసం చేయలేకపోయింది సర్కారు. దీంతో ఆంక్షలు సడలి పక్క రాష్ట్రాల్లో మన ధాన్యం అమ్మకాలు సాగాయి. దీనివల్ల 2012లో ఆ ఒక్క సీజన్‌లోనే, ఒక్క బీపీటీ ధాన్యం పంటకే తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ రైతులకు రూ.3,600 కోట్ల మేర లాభం చేకూరింది. ఇప్పుడు దీన్నే.. 'అసాధ్యమని ప్రజలు భావించిన సంస్కరణనూ తమ ప్రభుత్వం తేవటం'గా ప్రధాని మోదీ వర్ణిస్తున్నారు.

పాలకుల పాపాన్ని బైటపెట్టి ఆహారభద్రత పోను మిగిలిన ధాన్యాల్ని స్వేచ్ఛగా ఎగుమతి చేసేలా లోక్‌సత్తా 2010 నుంచి చేసిన పోరాటం వల్ల పెద్దఎత్తున ఎగుమతులు భారత్ నుంచి మొదలయ్యాయి. తన జీవితాన్ని ప్రభావితం చేసిన ముగ్గురు హీరోల్లో ఒకరైన శరద్ జోషి కృషిని విస్తరిస్తూ రైతుల్ని కులం, ప్రాంతం, పార్టీ, పంటలకతీతంగా ఏకం చేస్తూ జేపీ ఈ ఉద్యమాన్ని నిర్వహించారు. కేవలం జేపీ కృషి వల్లే 2016 నాటికి భారత ఆహారధాన్యాల ఎగుమతులు రూ.1,00,000కోట్ల మార్కుని దాటాయి (ఆహారధాన్యాల ఎగుమతుల్లోనే భారత్‌కు 100బిలియన్ డాలర్ల సామర్థ్యం ఉందని అంచనా). ప్రపంచంలో ఎక్కడ లాభముంటే అక్కడ రైతులు అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తామని 1992లో పార్లమెంటుకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి.. పారిశ్రామికవేత్తలకో న్యాయం, రైతులకో న్యాయం తరహాలో ఇష్టమొచ్చినట్టు అమలుచేస్తున్న ఎగుమతుల విధానాన్ని లోక్‌సత్తా సవరించింది. నిత్యావసర వస్తువుల చట్టాన్ని పూర్తిగా తొలగించటంతోపాటు.. ప్రజాపంపిణీ వ్యవస్థతో సంబంధం లేకుండా పౌష్టికాహారం అందరికీ అందుబాటులో ఉండేలా 1991లో పారిశ్రామిక రంగంలో ప్రవేశపెట్టిన స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణల్ని లొసుగులు, కంతలు లేకుండా వ్యవసాయంలో ప్రవేశపెట్టాలని లోక్‌సత్తా కోరుతోంది.

# నిజమైన హీరోయిజాన్ని గుర్తించే శక్తిని మనలో కరోనా పెంచిందా?

మనిషికి అందాన్ని, ఆకర్షణను, ఆనందాన్ని ఇచ్చే లక్షణం.. చుట్టుపక్కల ప్రపంచానికి కూడా మేలు చేసే గొప్ప గుణం 'హీరోయిజం'. తెలుగులో దీన్ని ధీరోదాత్తత లేదా వీరత్వం అనుకోవచ్చు.

హీరోయిజం.. మానవ స్వభావంలోనే అత్యున్నతమైన గుణమని మానసిక విశ్లేషకుల అభిప్రాయం. అయితే ఇటీవలి కాలంలో, ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చాక హీరోలకు, సెలబ్రిటీలకు తేడా తెలియక మనలో ఎక్కువమంది గందరగోళ పడుతున్నారు. ప్రముఖులు వేరు, హీరోలు వేరు. ప్రముఖులంతా హీరోలు కానక్కర్లేదు. చాలా సందర్భాల్లో అవరు కూడా. సినిమా హీరోలు, వాణిజ్య దిగ్గజాలు,



అధికారంలో ఉన్నవారు వీళ్లంతా హీరోలు కారు. అలాగే పొరుగువారు కష్టాల్లో ఉన్నప్పుడు సాయపడటం కూడా హీరోయిజం అవదు. అది మానవీయత అవుతుంది. హీరోయిజం మానవత్వం కంటే గొప్ప విషయం.

ధీరోదాత్తత అంటే.. తాను విధి నిర్వహణలో భాగంగా చేయాల్సిన పనుల్ని మాత్రమే, అవి ఎంతగొప్పవైనా, చేయటం కాదు. అంటే, అగ్నిమాపక దళంలో పనిచేసే వ్యక్తి మంటల నుంచి ఎవరినైనా కాపాడటం హీరోయిజం అవదు. తాను చేయాల్సిన పనికాకపోయినా రిస్కు తీసుకుని సాయం చేయటం, అలా ఏదైనా సన్నివేశంలో ప్రాణాలకు తెగించి ఎవరినైనా కాపాడటం హీరోయిజమవుతుంది. ఇలా కొన్ని సంఘటనలకు పరిమితంకాకుండా నిత్యజీవితంలో హీరోయిజాన్ని ప్రదర్శించేవారుంటారు. తమకు ఆదాయపరంగా, కెరీర్‌పరంగా నష్టం వచ్చినా సరే ప్రజలకు మేలు చేస్తుందని కొన్ని రంగాలను పనిగట్టుకుని ఎంచుకునేవారు, సమాజం కోసం తమ యవ్వనాన్ని, వ్యక్తిగత సమయాన్ని సైతం కేటాయించేవారు ఇలాంటి హీరోయిజం కేటగిరీలోకి వస్తారు. వీరిలో ఎవరి వల్ల సమాజానికి ఎంత ఎక్కువ మేలు జరిగితే, జరిగే అవకాశముంటే వారు అంత పెద్ద హీరోలవుతారు.

ప్రతి మనిషిలో హీరోయిజం ఉంటుంది. కొందరు దాన్ని మేలుకొలిపి, ఒకోసారి అవకాశాలు అనుకూలంగా లేకపోయినా పోరాడి గెలిచే ప్రయత్నం చేస్తుంటారు. కానీ అత్యధికులు సమస్యలు ఎదురైనప్పుడు, అన్యాయాలు జరుగుతున్నప్పుడు తమకు సంబంధంలేదన్నట్లు చూస్తూ ఊరుకుంటారు. ఎవరో వచ్చి పరిస్థితుల్ని మార్చాలని ఎదురుచూస్తుంటారు. మరోవైపు, బలప్రయోగంతో, మోసంతో, అవినీతితో, మీడియాను అడ్డం పెట్టుకుని తప్పుడు ప్రచారంతోనో డబ్బు, అధికారం, గుర్తింపు తెచ్చుకునేవారిని కూడా హీరోలుగా ఆరాధిస్తుంటారు. లేదా విపరీత త్యాగాలు చేసి అసాధారణ వ్యక్తిగత నిజాయతీని ప్రదర్శించేవారిని గౌరవిస్తుంటారు. నిజంగా హీరోయిజాన్ని అర్థం చేసుకుని, గుర్తించి దాన్ని ప్రదర్శించే వ్యక్తుల్ని గౌరవించటం తక్కువ. మనదేశంలో మరీ తక్కువ. గాంధీజీ దశాబ్దాల తరబడి వ్యక్తిగత త్యాగాలు చేయకపోయి ఉంటే, దేశానికి గనక స్వాతంత్ర్యం రాకపోయి ఉంటే ఆయన్ను మహాత్ముడి స్థాయి హీరోగా భారతీయులు గుర్తించే అవకాశాలు తక్కువని చలం గారే కాదు, ఇప్పటికీ పలువురు ఆలోచనాపరులు అంటుంటారు. గాంధీ గారి అహింసాయుత పోరాటపంథా అర్థమై ఆయనలోని నిజమైన

# మత విశ్వాసాల నుంచి ఆధ్యాత్మికత వైపు..

మత గురువులను హీరోలుగా చూసే ధోరణిలో మార్పుకి కూడా కొవిడ్ తాకిడితో అంకురం పడింది. మన దేశంలో ఒకటవ లాక్‌డౌన్ కాలంలోనే మతం పట్ల విశ్వాసాల్లో కొంత అపనమ్మకం మొదలైంది. దేవుళ్లు కొలువుంటారని మనలో పలువురు విశ్వసించే ప్రార్థనా మందిరాలు మూతపడటం.. వైరస్ మనల్ని అంతగా భయపెడుతున్నా మనం దేవుళ్లతో సమానంగా పూజించే మతాధికారులు, స్వామీజీలు బయటకు తొంగి కూడా చూడకపోవటం వంటివి మనలో సర్దిచెప్పుకోలేని సందేహాల్ని లేవనెత్తాయి. తెలుగునాట ముఖ్యమంత్రుల్ని గెలిపించానని చెప్పుకున్న స్వాములోరు సహా అందరూ ఆశ్రమాలకే పరిమితమైపోయారు. నిజమైన సవాలు ఏదైనా ఎదురైతే, పరిష్కరించేది సైన్స్, సైంటిఫిక్ ఆలోచనా తీరు, మన కృషి మాత్రమేనని పచ్చిగా కనిపిస్తుండటంతో దబాయించటానికి కూడా వీల్లేని పరిస్థితి. భారతీయ సంస్కృతిలో భాగమైన వైద్య పద్ధతుల్లో కొవిడ్‌కు మందు కనిపెడదామన్న ప్రతిపాదనకు పెద్దఎత్తున మద్దతిచ్చే ధైర్యాన్ని ప్రధాని మోదీ కూడా చేయలేకపోయారు. గతంలో ఏదైనా సమస్య వస్తే దైవదర్శనాలకు క్యూలు పెరిగిపోతుండేవి. ఇప్పుడు దేవుళ్లు, దైవదూతలే ఆత్మరక్షణలో పడటం.. విశ్వాసాలు, సెంటిమెంట్లు, దైవభక్తి కల్చర్‌నే టెక్నాలజీ టచ్‌తో కొనసాగిస్తున్న మిలీనియల్స్ తరాన్ని కూడా గందరగోళ పరుస్తోంది. అయోధ్యలో మసీదు కింద నిజంగానే రామమందిరం ఉన్నట్లు తవ్వకాల్లో బైటపడిందని వార్తలు వచ్చినా కొవిడ్ అనుభవాల వల్ల ఎగిరి గంతేయాలని ఎక్కువమందికి అనిపించలేదు. అయితే, ఇలా పురాతన భావపరంపరా ఫలకాల్లో కదలిక మొదలైనా కూడా దేవుడికి డిమాండ్ తక్షణం తగ్గకపోవచ్చు. మతం రాజకీయ, సామాజిక అవసరంగా బలంగా వేళ్లూనుకుని ఉంది కాబట్టి.. కరోనా వ్యాప్తికి కారణమైన తబ్లీఘీ లాంటి కార్యక్రమాలూ అన్ని మతాల్లో కొనసాగుతూనే ఉంటాయి. మత విశ్వాసాలకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు ఆయా శక్తులు శాయశక్తులా కృషి చేస్తాయి. ఇదేసమయంలో, కొవిడ్ కాలంలో దేవుళ్లు, మతాధికారులు కూడా చేతులెత్తేసిన నిస్సహాయ పరిస్థితుల్ని వలస కార్మికుల నుంచి లాక్‌డౌన్ కళాపోషకుల వరకూ మర్చిపోయే అవకాశాలు తక్కువ. దేవుడి పాత్రపై మొదలైన అంతర్మథనం పెరుగుతూనే ఉంటుంది. దేవుడున్నాడు కచ్చితంగా అనే నమ్మే స్థితి నుంచి.. దేవుడున్నా, లేకపోయినా మనకు కాస్త మనశ్శాంతి కోసం, అదనపు బలం అనుభూతి కోసం దేవుణ్ని పూజించటంలో తప్పు లేదు అనే ప్రాగ్మాటిస్టు ఆలోచనాతీరు వైపు మొగ్గు పెరగొచ్చు. స్వాములోర్లను కలిసినా కూడా గతంలోలా విశ్వాసంతో కంటే.. ఏదో సలహాలిచ్చే దేశవాళీ పెద్దాయన్ని కలిసేరీతిలో వెళ్లిరావటం ఎక్కువ కావచ్చు. గుడ్డిగా మతాన్ని అనుసరించే ధోరణులు పలచబడే అవకాశముంది. జీవనశైలి, మనశ్శాంతి, పరిష్కారాలు వంటి వాటి విషయంలో ఇప్పటిదాకా మతాలు, మత గురువులు, ప్రార్థనా మందిరాలు తదితరాలు పోషించిన పాత్రను సాంకేతికత సాయంతో వేరే రూపాల్లో భర్తీ చేసుకునే ప్రయత్నాలు మొదలవుతాయి. మత విశ్వాసాలు తగ్గుతూ.. మానసిక వికాసానికి, పరిణతికి దోహదం చేసే ఆధ్యాత్మికతకు, నిత్యజీవితంలో వివిధ రంగాలను స్పృశిస్తూ అటువంటి భావాల్ని పంచగల పరిణతిగల బోధకులకు, కార్యక్రమాలకు క్రమంగానైనా ప్రజల్లో ప్రాధాన్యత పెరిగే అవకాశముంది.

హీరోయిజాన్ని గుర్తించినవారి సంఖ్య మన జనాభాలో పరిమితమే. కానీ 2020లో కరోనా ప్రబలాక హీరోయిజం పట్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజల మనసుల్లో కొంత మార్పు వచ్చే అవకాశముందంటున్నారు హీరోయిజంపై అధ్యయనం చేస్తున్న ఫిలిప్ జింబార్డో. 'నిజమైన హీరోయిజమేంటో ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. కొవిడ్-19పై ముందుండి పోరాడిన డాక్టర్లు, వైద్య సిబ్బంది తమ వృత్తిలో భాగంగా రోజూ మృత్యుముఖంలోకి వెళ్లిరావటం ప్రజలను కదిలించింది. నర్సులంటే తెల్లబట్టలు వేసుకున్న చిన్న ఉద్యోగినులు, తమ వృత్తిలో భాగంగా ప్రజలకు సేవ చేస్తున్నారు అని మాత్రమే భావించినవాళ్లు.. కొవిడ్ కాలంలో భిన్నమైన దృశ్యాన్ని చూశారు. తామంతా ఇళ్లలో ఉంటూ ప్రాణాల్ని కాపాడుకుంటున్నప్పుడు, నర్సులు ముందుండి ప్రాణదాతలుగా పోరాడారు. అందుకే వారిలోని హీరోయిజాన్ని ప్రజలు

చూడటం ప్రారంభించారు' అని జింబార్డో అన్నారు. హీరో అంటే కండబలం, డబ్బు, పెత్తనం, అధికారం అనే ధోరణి నుంచి.. సేవ, అవగాహన, తెలివి, సున్నితత్వం, శాస్త్రీయత కలిగినవాడు అనే భావన కొవిడ్ కాలంలో మన దేశంలో కూడా పెరిగింది. మన చుట్టూ ఉన్న పారిశుద్ధ్య కార్మికులు, సాఫ్ట్‌గానే ఉంటూ ఎంతో సమర్థవంతంగా కరోనాను కట్టడి చేసిన విదేశీ మహిళా దేశాధినేతలు కూడా ఇందుకు దోహదం చేశారు. ఈ పరిణతి ఇంకా పెరగాలని ఆశిద్దాం. అన్నట్లు.. హీరోలు అరుదైపోతున్నందున, తమ పరిధిలో హీరోయిజాన్ని ప్రదర్శించేలా పాఠశాల స్థాయి నుంచి పిల్లలకు జింబార్డో, మాత్ ల్యాంగ్డన్ లాంటి వారు శిక్షణా కార్యక్రమాల్ని సైతం నిర్వహిస్తున్నారు.

శిక్షణ ద్వారా వ్యక్తిగత స్థాయి హీరోయిజం లక్షణాల్ని పెంపొందించుకోగలిగినా కెరీర్‌లో, జీవితంలో సామర్థ్యాన్ని, ఫలితాల్ని బాగా మెరుగుపరుచుకోవచ్చు. ఉదాహరణకు, 1960వ దశకం ఉత్తరార్థంలో హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ రాబర్ట్ రోజెంతాల్ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఓ అధ్యయనం చేశారు. దీన్ని "పిగ్మాలియన్ ఇన్ ది క్లాస్‌రూమ్: టీచర్ ఎక్స్‌పెక్టేషన్ అండ్ ప్యూపిల్స్ ఇంటలెక్చువల్ డెవలప్‌మెంట్' అనే పుస్తకంలో వివరించారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో ఓ స్కూలులో ప్రిన్సిపాల్ ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వీరిని ఎటువంటి ప్రాతిపదికా లేకుండా ర్యాండమ్‌గా ఎంపిక చేశారు. 'మీరు బోధనలో గొప్ప ప్రమాణాల్ని ప్రదర్శిస్తున్నారు. అందువల్ల మీకు బహుమానంగా మంచి తెలివైన విద్యార్థులున్న తరగతుల్ని అప్పచెబుతున్నాం. మీ బోధనలో వారు అద్భుత ఫలితాల్ని సాధిస్తారని మా నమ్మకం' అని ప్రిన్సిపాల్ చెప్పారు. ఆ ఉపాధ్యాయులు ఎంతో ఉప్పొంగిపోయారు. వారిలో హీరోయిజానికి ఓ ప్రేరణ దొరికింది. అలాగే కొందరు పిల్లల్ని కూడా ర్యాండమ్‌గా ఎంపిక చేశారు. వారికీ అదే తీరుగా చెప్పారు. 'మీరంతా బాగా తెలివైన విద్యార్థులని మేం గమనించాం. అందుకే మీకు గొప్ప టీచర్లను అందిస్తున్నాం. వారి బోధనలో మీరు టాప్ రిజల్ట్స్ తేవాలి' అన్నారు. వారు కూడా తాము హీరోలమనే రీతిలో ఉత్తేజం పొందారు. ఆ తర్వాత ఏడాదంతా బోధనను, పిల్లల చదువును గమనిస్తూ వచ్చారు. టాపర్ల స్థాయి వాళ్లం కదా అని పిల్లలు కష్టాన్ని ఓర్చుకుంటూ చదివారు. టీచర్లు కూడా, వారికి విషయం అర్థం కాకపోతే ఒకటికి పదిసార్లయినా విసుక్కోకుండా చెబుతూ.. టాపర్లకు అర్థమయ్యేలా చెప్పటం తమకొచ్చిన అవకాశం అన్నట్లు వ్యవహరించారు. సంవత్సరం చివర్లో నిర్వహించిన పరీక్షల్లో మూడు తరగతుల్లోని విద్యార్థులంతా తమ గతేడాది కంటే 20-30 శాతం అదనంగా ప్రతిభను ప్రదర్శించగలిగారు. టీచర్లను పిలిపించి ఫలితాల్ని వెల్లడించారు. 'మా విద్యార్థులంతా తెలివైన వాళ్లే గదా. వాళ్లకు రాకపోతే మంచి మార్కులు ఇంకెవరికి వస్తాయి' అన్నారు. వారికి అసలు విషయం – పిల్లలను ర్యాండమ్‌గా ఎంపిక చేసిన విషయం – చెప్పారు. 'అలా అయితే, మేం బోధన బాగా చేయగలిగే టీచర్లం కదా. అందువల్ల ఫలితాలు బాగా వచ్చి ఉండవచ్చు' అన్నారు. ఉపాధ్యాయులను కూడా ర్యాండమ్‌గా ఎంచుకున్నట్లు అప్పుడు వెల్లడించారు. సారాంశమేమంటే, ఓ ప్రేరణతో వ్యక్తిగత స్థాయి హీరోయిజాన్ని వెలికితీయటం ద్వారా వారి నుంచి స్కూలు ప్రిన్సిపాల్ ఆ మెరుగైన ఫలితాల్ని సాధించారు. అదే హీరోయిజాన్ని సామాజిక అవగాహన, ఉదాత్త లక్ష్యాలున్న వాస్తవిక స్వప్నాలు, రోల్‌మోడల్స్ వంటి వాటితో మరికొంచెం విస్తరిస్తే, వాళ్లు పూర్తిస్థాయి హీరోలవుతారు. తమ జీవితానికి తామే హీరోలుగా ఉంటూనే, సమాజానికి కూడా హీరోలవుతారు. ఇలా తమ జీవితంలో విజయవంతమవుతూ, సమాజహితం కోసం పనిచేసేవారు స్థానికంగా ఎక్కడికక్కడ ఉంటే, మొదటి స్వాతంత్ర్యపోరాట కాలంలో గాంధీజీ లాగానో, భగత్‌సింగ్‌లాగానో, రెండవ స్వతంత్ర పోరాటకాలంలో మరికొందరు మహోన్నత భారతీయుల్లాగానో అపార త్యాగాలు చేయాల్సిన అవసరం ఉండదు. హీరోయిజం మంచిదేగానీ.. వాళ్లు ఎదురింట్లో ఉండాలి, జీవిత సర్వస్వం త్యాగం చేయాలి, వారికి దండలేసి మేం కీర్తనలు పాడుతాం, మేం మాత్రం మౌనప్రేక్షకుల్లా ఉంటామంటే.. దానివల్ల యధాతథ పరిస్థితే కొనసాగుతుంది. కొవిడ్ మేలుకొలుపు నేపథ్యంలోనైనా నిజమైన హీరోల్ని గుర్తించే పరిణతిని పెంచుకోవటంతోపాటు.. వ్యక్తిగత జీవితాన్ని చూసుకుంటూ సమాజహితాన్ని పట్టించుకోగల స్థాయి హీరోయిజాన్ని విద్యార్థుల్లో, యువతలో పెంపొందించే శిక్షణను సాంకేతికతను వినియోగించుకుంటూ భారత్‌లో ముమ్మరం చేయాలి. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా తరపున వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వీలైనంత విస్తృతంగా తొలినుంచీ ఈ పని కూడా చేస్తున్నారు. ఎఫ్‌డీఆర్ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఆవిర్భవించిన పలు సంస్థలు ఈ మార్గంలో కృషి చేస్తున్నాయి. ఇలాంటి సంస్థలకు, ముఖ్యంగా యువత ఆధ్వర్యంలో నడిచే సంస్థలకు కూడా జేపీ వీలైనంత సమయాన్ని ఇస్తూ యువ థాట్ హీరోలను తయారుచేయటాన్ని ప్రోత్సహిస్తున్నారు. పరిజ్ఞానంతో నాయకత్వ బాధ్యతల్ని తీసుకోగల థాట్ లీడర్స్‌గా విద్యార్థులు, యువతను తీర్చిదిద్దటమే యువభారత్ ఉజ్వల భవితకు పెద్ద గ్యారంటీ. సమస్యలు, పరిష్కారాల పట్ల చిట్టచివరి పౌరునికి కూడా అవగాహన ఉండటమే పెద్ద విప్లవం.

# అంబేద్కర్ 2020

‘లోక్‌సత్తాను రాజకీయ పార్టీగా మార్చి జయప్రకాష్ నారాయణ్ చాలా నష్టపోయారు, ఆయన ఐఏఎస్‌గా, పౌర, రాజకీయ ఉద్యమకారునిగా ఎన్నో పెద్ద విజయాల్ని సాధించినా.. రాజకీయ పార్టీగా విఫలమయ్యారు’ అనే వ్యాఖ్యల్ని లోక్‌సత్తా సభ్యులు, అభిమానులు తరచూ వింటుంటారు. అలా ఈ రచయిత కూడా పలు సందర్భాల్లో ఆ విమర్శలను వినాల్సి వచ్చింది. అయితే విమర్శకుల్లో అత్యధికులు సానుభూతితోనే ఆ మాటలంటుంటారు. అలాంటి సందర్భంలో కాస్త చదువుకుని, అవగాహన చేసుకోగలిగినవారి వద్ద విడమర్చి చెప్పే ప్రయత్నం చేస్తుంటాం. మిగిలినవారి వద్ద ‘కాస్త టైం పడుతుంది’ అని చిరునవ్వుతో వ్యాఖ్యానించి వదిలేస్తుంటాం. కొందరు లోక్‌సత్తా వాళ్లు కూడా ఇలాంటి విమర్శలు చేసినప్పుడు మౌనం వహిస్తుంటాం. ఇలాంటి విమర్శలనే.. బాగా చదువుకుని, ఓ పేరున్న విద్యాసంస్థలో అధ్యాపక వృత్తిలో ఉన్న ఓ మహిళ ఇటీవల చేశారు. సోషల్ సైన్స్ రీసెర్చ్ నెట్‌వర్క్ (ఎస్ఎస్ఆర్ఎన్), ఇంటర్నేషనల్ జర్నల్ ఫర్ ఇన్నోవేటివ్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ (ఐజేఐఈఎంఆర్) పురస్కారాన్ని కూడా ఈమధ్య అందుకున్నారామె.

ఆమెకు సమాధానమిస్తూ, ‘రాజకీయమంటే ఎన్నికలు మాత్రమే కాదు, ఎన్నికల్లో గెలిచినవారు చేసేది మాత్రమే రాజకీయం అనుకుంటే ఈ దేశం ఎప్పుడో నాశనమైపోయి ఉండేది. ఎన్నికల్లో గెలిచినవాళ్ల కంటే.. చట్టసభలకు బయట ఉన్న నాయకులు, ప్రజల వల్లే భారతదేశం ఈ మేర నిలదొక్కుకుంది. ఎన్నికల్లో ఓటమే రాజకీయంగా ఓటమి అయితే అంబేద్కర్ కూడా ఓడిపోయారు. తాను రాసిన రాజ్యాంగం ద్వారా నిర్వహించిన ఎన్నికల్లోనే ఆయన ఓడిపోయారు. కానీ కాలం గడస్తున్నకొద్దీ ఆనాడు ఎన్నికల్లో గెలిచినవారు, పదవులను అలంకరించినవారిలో అనేకులు మరుగునపడిపోతున్నారు, అంబేద్కర్ ప్రాధాన్యతేమో రోజురోజుకీ పెరిగిపోతోంది. రాముడి గుళ్లలా అంబేద్కర్ విగ్రహాలు ప్రతి చోటా వెలుస్తున్నాయి’ అన్నాడీ రచయిత. ఆమె వెంటనే ఎదురుదాడి చేస్తూ, ‘అంబేద్కర్ రిజర్వేషన్లు ఇచ్చాడు కాబట్టి, వాటి ద్వారా లబ్ధి పొందే కులాలవారి ఓట్లు చాలా ఉన్నాయి కాబట్టి.. ఆయనకు విగ్రహాలు పెట్టి దండలేస్తున్నారు’ అన్నారు. ‘అందులో కొంత వాస్తవం ఉందికానీ, అంబేద్కరేమీ రిజర్వేషన్లను శాశ్వతంగా కొనసాగించమని చెప్పలేదు. వాటిని ఇంతకాలం కొనసాగిస్తారని ఆయన ఊహించి కూడా ఉండరు. అంబేద్కర్ కృషి రిజర్వేషన్లకు మించి ఎంతో ఉంది కాబట్టే, అంబేద్కర్ బొమ్మతో ఏ స్థాయి నాయకుడితోనైనా తలపడే సత్తా సమకూరుతుంది కాబట్టే.. ఆయన్ను అణగారినవర్గాలు నిండుమనసుతో ఆమోదించి ఎంతో ఎత్తున నిలబెట్టాయి. అంబేద్కర్ రిజర్వేషన్లకు మించిన ఫిగర్ కాబట్టే.. మిగతా ప్రజానీకంలోనివారు కూడా ఆయన్ను ఓ మహానేతగా క్రమంగానైనా ఆమోదిస్తున్నారు’ అన్నాను. ఆమె నా మాటలతో అంతగా ఏకీభవించలేదుగానీ.. అంబేద్కర్‌ను ఎందుకు గుర్తుంచుకోవాలి అనే అంశానికి సంబంధించి ఆ



తర్వాత కొన్ని నెలలకే కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ పరిణామాలతోనే 2020 సంవత్సరం మొదలైంది. కరోనా కల్లోలంలో ఇవి తాత్కాలికంగా మరుగునపడిపోయినా తిరిగి వాటి సానుకూల ప్రభావం ప్రస్ఫుటమవుతుందనటంలో సందేహం లేదు.

సీఏఏ (పౌరసత్వ సవరణ చట్టం), ఎన్ఆర్‌సీ (జాతీయ పౌర పట్టిక)లకు వ్యతిరేకంగా ప్రారంభించిన నిరసనల్లో ఢిల్లీలో, ఇంకొన్ని చోట్ల విద్యార్థులు, మహిళలు, సామాజిక కార్యకర్తలు అంబేద్కర్‌ను, అంబేద్కర్ బొమ్మ ఉన్న భారత రాజ్యాంగం పీఠికను ప్రదర్శిస్తూ తమ నిరసనల్ని వ్యక్తం చేశారు. జాతీయ జెండాను, రాజ్యాంగాన్ని కలిపి ప్రదర్శించటంతోపాటు అంబేద్కర్‌ను, గాంధీని కూడా కలిపి తమ ప్లకార్డుల్లా ప్రదర్శించారు. ఇందులో రాజకీయ పార్టీల ప్రభావంకన్నా పౌరసమాజ ప్రభావమే ఎక్కువనటంలో సందేహం లేదు. భారతదేశంలో డా॥ బీఆర్ అంబేద్కర్ పాత్ర ఏమిటి? అంబేద్కర్

అనగానే ఏమి గుర్తుకురావాలి?.. అనే ప్రశ్నలకు ఈ ఏడాది జరిగిన 'శాంతియుత' ఆందోళనలు కొంత స్పష్టతనిచ్చాయి (ఈ ఆందోళనల వెనుక ఉన్న డిమాండ్లన్నీ సహేతుకమైనవేనా, వీటిలో తర్వాత హింసాత్మక ఘటనలు ఎందుకు చొరబడ్డాయి తదితరాలు ఇక్కడ వేరే అంశాలు).

ఇప్పటిదాకా అంబేద్కర్ అంటే.. కొన్ని కులాలు, తెగలను ఏకం చేసి షెడ్యూల్డ్ విభాగంలో వారికి రిజర్వేషన్లు కల్పించిన నాయకుడుగానే ఎక్కువ గుర్తింపు ఉండగా, రాజ్యాంగ రచనా సంఘం సారథిగా, ప్రజామేధావిగా ఆయన చేసిన పలురకాల ఇతర కృషి పట్ల మాత్రం తెలిసీతెలియని గౌరవమే ఉంది. అంబేద్కర్‌ను దళిత నేత స్థాయికి కుదించాలని అణగారిన వర్గాలు.. ఆయన్ను జాతీయ నేతగా గౌరవించుకోవాలని దళితేతరుల్లో కొన్ని వర్గాలు .. ఎస్.సిలను పట్టించుకున్నట్లు బాబా సాహెబ్ తమను పట్టించుకోలేదని, దానివల్లే ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్ల విషయంలో తాము అన్యాయమైపోయామని దేశ జనాభాలో అత్యధికశాతం ఉన్న బీసీల్లో కొందరు నేతలు.. సంఘర్షించుకోవటం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కొనసాగుతూనే ఉంది. మనది రాజ్యాంగ ప్రజాస్వామ్యం అనే చైతన్యం ఇంకా ఏ వర్గంలోనూ బలంగా వేళ్లూనుకోలేదు. ఇలాంటి వాతావరణంలో.. వివక్ష, పేదరికం, అవిద్య ఉన్న భారతీయ సమాజంలో అందరికీ ఎదిగే సమానావకాశాలనివ్వటానికి "తాత్కాలిక పరిష్కార మార్గంగా షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లను అందించటం దగ్గర్నుంచి సమగ్ర పరిష్కార మార్గంగా ప్రపంచంలోనే ఉదాత్తమైన రాజ్యాంగాన్ని అందించటం వరకూ" అంబేద్కర్ అసాధారణ కృషి చేశారన్న స్పష్టతను 2020 ఆందోళనలు ప్రజానీకంలో పెంచాయి.

## రాజ్యాంగమే లేకపోతే.. అనే పరిస్థితినే ఊహించలేం!

నిజానికి స్వతంత్రం వచ్చినప్పుడు భారతీయుల్లో అత్యధికులు తమకు ఇలాంటి ప్రజాస్వామ్య రాజ్యాంగం కావాలని, ఎన్నికల పద్ధతి కావాలని అడగలేదు. గాంధీగారు, నెహ్రూగారు, ఇతర పెద్దలు చెప్పారు కాబట్టి.. అనుకుంటూ శిరసావహించారంతే. కానీ ఆ సంవిధానమే లేకపోతే, ఈవేళ కుల, మత వివక్షల తీవ్రత ఏ స్థాయిలో ఉండేదో ఊహించను కూడా లేము. వివక్షలు అంత భయంకరంగా తయారై ఉండేవి. దళితులు, ఇతర అణగారిన వర్గాల్లో పలువురు సహా ఈ దేశంలోని అత్యధికులు గుర్తించకున్నా.. రాజ్యాంగం ఒక ఛత్రంలా ఈ దేశంలో కోట్లాదిమంది సామాన్యుల హక్కుల్ని ఛత్రంలా కాపాడుతోంది. దేశానికి స్వతంత్రం తేవటం కన్నా.. ఎన్నో కులాలు, మతాలు, తెగలు, భాషలు, సంప్రదాయాలు, సంస్కృతులు, ఆచారవ్యవహారాలు ఉన్న భారతదేశాన్ని ఒక దేశంగా ఏకం చేయటం గాంధీ సాధించిన అద్భుత విజయం కాగా.. దాన్ని నిలబెట్టే రాజ్యాంగాన్ని అంబేద్కర్ అందించారు. స్వతంత్ర పోరాటకాలంలో గాంధీ చేసిన కృషిని రాజ్యాంగం ద్వారా స్వతంత్ర భారతదేశ ప్రజాస్వామ్యంలో వ్యవస్థీకృతం చేసేందుకు అంబేద్కర్ ఎంతో కృషి చేశారు.

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ కొన్నేళ్ల క్రితం చెప్పినట్లు..

"గాంధీజీ భారతీయ సమాజంలో యధాతథస్థితిని కొనసాగనివ్వలేదు. అలా అని సంఘర్షణ స్థాయికీ పోనివ్వలేదు. సృజనశీలమైన ఉద్వేగస్థితికి మాత్రం తీసుకెళ్లారు.. స్వతంత్రం వచ్చాక మన రాజ్యాంగం చేసింది కూడా ఇదే! స్వేచ్ఛ అనే మాట మరచి వెయ్యేళ్లు దాటిపోయిన సమాజానికి ఆ స్వేచ్ఛను ఇస్తూనే, దానిని ఏకతాటిపై నిలిపింది మన రాజ్యాంగం. సమత్వం గురించి ఏనాడూ ఆలోచించని సమాజాన్ని అదే ఆశయానికి కట్టుబడి ఉండేటట్లు మలిచింది. ఫెడరల్ లక్షణం లవలేశమైనా లేని మనదేశం విజ్ఞతాయుతమైన ఒక ఫెడరల్ వ్యవస్థలో ఒదిగేటట్లు చేసింది ఈ రాజ్యాంగమే. సమాజాన్ని కలిపి ఉంచడం రాజ్యాంగం బాధ్యత. ఆ పని అది అద్భుతంగా నిర్వహించింది".

అందుకే.. లోక్‌సత్తా పార్టీ తొలినుంచీ చెబుతున్నట్లు.. గాంధీ, అంబేద్కర్‌ల కృషి పరస్పర పూరకం, వారిద్దరినీ కలపటం ఆధునిక భారత నిర్మాణానికి అవసరం! ఇదే భావాన్ని ఇటీవల కన్నడ రచయిత, సామాజిక నేత దేవనూర్ మహదేవ కూడా వ్యక్తం చేశారు. 'పదవుల్ని తృణప్రాయంగా భావించి వివక్ష లేని సమాజం, సురాజ్యం కోసం గాంధీ, అంబేద్కర్‌లు కృషి చేశారు. కరడుగట్టిన హిందూ భావజాలాన్ని గాంధీ సున్నితీకరించకపోయి ఉంటే, అణగారినవర్గాల పక్షాన అంబేద్కర్ కృషి కష్టమై ఉండేది. అమానుషమైన వివక్షకు గురవుతున్న వర్గాల్ని అంబేద్కర్ మేలుకొలిపి మోహరించకపోతే, గాంధీ కృషి జటిలమై ఉండేది. ఈ రకంగా గాంధీ విజయాలకు, అంబేద్కర్ కృషి విస్తృతమవటానికి ఒకరికొకరు తమ కృషి ద్వారా సాయం అందించుకున్నారు. అందువల్ల వారిద్దరిని సహయాత్రికుల్లా తప్ప పరస్పర శత్రువుల్లా, విరోధుల్లా చూడవద్దు' అని ఆయన విజ్ఞప్తి చేశారు.. ఈ ఎరుకను వ్యక్తం చేస్తూ రాజ్యాంగాన్ని సొంతం చేసుకునే ప్రయత్నమే ఈ శాంతియుత ఆందోళనల్లో మనల్ని విశేషంగా ఆకర్షించే అంశం. పాలకులు వస్తుంటారు, పోతుంటారు.. కానీ భారత ప్రజలు, రాజ్యాంగ ప్రజాస్వామ్యం శాశ్వతం అని వారి చర్యలు స్పష్టం చేశాయి. భారత ప్రజలమైన మేము.. అన్న రాజ్యాంగం తొలి వాక్యానికి ఆచరణ దృశ్యంగా వారు నిలిచారు.

## గొప్ప నాయకులు, గొప్ప రాజ్యాంగంతో మొదలైనా ఇప్పటికీ ఎందుకిన్ని సవాళ్లు

మన జాతీయోద్యమ నేతలు ప్రపంచంలో మరే దేశంలోనూ లేని రీతిలో పెద్దసంఖ్యలో గొప్ప నాయకుల్ని ఒక తరం కాలంలోనే తయారుచేసి మనకు అందించారు. వారిలో అనేకమంది మహిళలు కూడా ఉన్నారు. సామాన్యుల్ని అసామాన్యులుగా మార్చిన, స్త్రీలపై వివక్షలు తీవ్రంగా ఉన్న కాలంలో కూడా మహిళలకు నాయకత్వ బాధ్యతలు అందించిన

ఘనత గాంధీది. అలాగే బాబాసాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో మనకు విశిష్ట రాజ్యాంగం సమకూరింది. గొప్ప నాయకత్వం, గొప్ప రాజ్యాంగంతో మొదలైనా మన దేశం ఇప్పటికీ అనేక సమస్యల్ని ఎదుర్కొంటోంది. మన ప్రజాస్వామ్యం 'ఓటింగ్, షౌటింగ్' స్థాయిని దాటటానికి తెగ ప్రయాసపడుతోంది. ఎందు కిలా? అంటే.. ఇందుకు కారణం ప్రధానంగా మన సమాజంలో వేళ్లూనుకుని ఉన్న బూజు పట్టిన భావాలు, రాజ్యాంగం రూపకల్పన సమయంలోనే చోటుచేసుకున్న కొంత గందరగోళం.

దీనికి సంబంధించి ఫెడరలిజం, స్థానిక సాధికారతల విషయంలో జేపీ వివరించినట్లు, "మనది ఎంతో వైవిధ్యమున్న సమాజం. ఇక్కడ గుర్తించిన భాషలే 22 ఉన్నాయి. ఎన్ని జీవన విధానాలు, ఎన్నెన్ని సంస్కృతులు మన దేశంలో ఉన్నాయి! ఊహించటం కూడా కష్టం. వివిధ కారణాల రీత్యా, మన రాజ్యాంగం ఆత్మ అత్యాధునికం, స్వయందిద్దుబాటు శక్తి కలిగినది.. కానీ అది నిక్షిప్తమై ఉన్న శరీరం మాత్రం పురాతనం. అందుకే సుమారు 200 ఏళ్ల క్రితం 1820లలో ఎలాంటి పాలనా వ్యవస్థ అమలైందో, ఇప్పుడు కూడా అదే కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్లు, వారి హోదాలు. అఫీషియల్స్, నాన్‌అఫీషియల్స్. అసలు ఈ రెండు మాటలు మన దేశంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా వాడరు. కానీ ఇది రాజ్యాంగ లోపం కాదు. రాజకీయ లోపం. విస్తరించే వలయాల మాదిరిగా అధికార వికేంద్రీకరణ జరగటం ప్రజాస్వామ్య లక్షణం. కానీ మన రాజ్యాంగం అధికారాన్ని కేంద్రీకృతం చేసింది. పౌరుడూ, కమ్యూనిటీల కేంద్రంగా మన అధికార వికేంద్రీకరణ జరగలేదు. రాజ్యాంగంలో ప్రస్తావించని ప్రతి అంశం కేంద్రం పరిధిలోకి వస్తుందని ఇక్కడ అన్నారు. అదే అమెరికాలో రాజ్యాంగంలో లేనివన్నీ రాష్ట్రాలకు చెందుతాయని అన్నారు. విచిత్రం ఏమిటంటే రాజ్యాంగంలో ఎక్కడా కేంద్ర ప్రభుత్వం అన్న మాటే లేదు. అలా అధికారం కేంద్రీకృతం కావటంతో మొదట దెబ్బతిన్నది మన గ్రామీణ వ్యవస్థే. రాజ్యాంగంలో ఈ అంశాన్ని చేర్చడం దగ్గరే కొంత గందరగోళం ఉంది. చాలా పైస్థాయిలో వచ్చిన గందరగోళం. గ్రామాలు రిపబ్లిక్‌లుగా ఉండాలన్నది గాంధీజీ ఊహ. కానీ గ్రామానికి ఎక్కువ అధికారం ఉంటే పెదధోరణులు ప్రబలుతాయన్నది అంబేద్కర్ దృష్టి. ముఖ్యంగా కులప్రభావం గురించి అంబేద్కర్ ఆలోచించారు. అలా 40వ అధికరణం మేరకు పంచాయతీలు ఆదేశిక సూత్రాల్లో భాగంగా ఉండిపోయాయి. అధికారస్వామ్యం, ఎమ్మెల్యే రాజ్యం కలిసే సరికి ప్రజాభిప్రాయానికి దగ్గరగా ఏ నిర్ణయమూ జరగడం లేదు. వ్యవసాయ రంగానికి, వృత్తులకు న్యాయం జరగడం లేదు. ఇప్పుడు ఇండియాకు కావలసింది, మనం చేయాల్సింది గాంధీని, అంబేద్కర్‌ని కలపటం. అందుకే లోక్‌సత్తా భావజాల ఐకాన్లుగా వారిద్దరినీ ఎంచుకున్నాం. అధికారాన్ని వికేంద్రీకరించి.. ఓ గ్రామానికి బదులు గ్రామాల సమూహమనే పెద్ద యూనిట్‌ను గణతంత్ర భారతదేశం ప్రాతిపదికగా తీసుకుంటే, సాంప్రదాయ గ్రామాలను 20,000 – 30,000 జనాభాకొకటి చొప్పున సమూహంగా కలిపి, ఆ సముదాయాన్ని (క్లస్టర్) స్థానిక ప్రభుత్వాలకు ప్రాథమిక యూనిట్‌గా ఏర్పాటు చేస్తే ఆ ఇద్దరు మహనీయులు ఆశించిన ఓ పెద్ద మౌలిక లక్ష్యం నెరవేరుతుంది, దేశ ఉజ్వల భవితకు పటిష్ట పునాదులు ఏర్పడతాయి. దీనివల్ల ప్రాథమిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన ఆర్థిక వనరులు సమకూరతాయి, నిర్వహణ సామర్థ్యం కొరత కూడా తీరుతుంది. గ్రామాల సముదాయంగా ఉండే ఒక పెద్ద యూనిట్ ప్రాతిపదికన సార్వత్రిక ఓటు హక్కుకి ఉండే ప్రభావం వల్ల కుల అసమానతలు పలచబడతాయి. అటువంటి స్థానిక ప్రభుత్వాలకి నిజమైన సాధికారత, వికేంద్రీకరణను స్వతంత్ర అంబుడ్స్‌మన్‌కి జవాబుదారీతనంతో అందిస్తే ప్రజలకు సేవలు మెరుగవుతాయి. జనాభాలో అత్యధికంగా ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మహిళలు, పేదలకు ప్రాతినిధ్యం వహించే వారికి నిజమైన నాయకత్వం, సాధికారత లభిస్తుంది. స్థానిక ప్రభుత్వాల్లో గణనీయంగా కల్పించిన రిజర్వేషన్లకు కూడా సార్థకత చేకూరుతుంది. గ్రామ పంచాయతీల నుంచి పట్టణ వార్డుల వరకూ స్థానిక సాధికారత ఉండే మూడో అంచె ఫెడరలిజం ఇప్పుడు మనకు ఎంతో అవసరమైన మార్పు".

## రాజ్యాంగాన్ని మార్చాలనే వాదనలు - ప్రజాస్వామ్యం బలపడకుండా అవరోధాలు

మరోవైపు.. రాజ్యం యొక్క అంగం కాబట్టి, మేం రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తామనే భావజాలురు ఒకపక్క, రాజ్యాంగం అవసరమేగానీ ఇప్పుడున్న రాజ్యాంగం భారతీయ సంస్కృతిని ప్రతిబింబించటంలేదని విమర్శించే భావజాలురు ఇంకోపక్క రాజ్యాంగ ప్రజాస్వామ్యం బలపడకుండా తొలినుంచీ అవరోధాలను కల్పిస్తూనే ఉన్నారు.

ఇందులో రెండో భావజాలంవారు ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి మార్గదర్శులు. భారతదేశం కొన్ని శతాబ్దాల క్రితం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని వీరు తమ వాదనకు మద్దతుగా గుర్తుచేస్తుంటారు. కానీ పొరుగు దేశాలు ఎదుగుతుంటే, భారత్ ఎందుకు వెనుకబడింది? ప్రపంచంలోని మరే దేశమూ అభివృద్ధి చెందకుండా ఉన్నంతకాలమే, భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎందుకు కొనసాగింది? భారత్ కేవలం తనకున్న శక్తిసామర్థ్యాలతో ఈవేళ ప్రపంచంలోని అగ్రదేశాలతో పోటీపడటం సాధ్యమా?.. అన్న ప్రశ్నలకు విశ్వాసాలకతీతంగా, లోతుగా ఆలోచించటానికి వీరు సుముఖత వ్యక్తం చేయరు. తమ భావజాలం స్థాయి దేశాభివృద్ధికి చాలక పోవటం వల్లే ఎంతో గొప్ప అవకాశం వచ్చినా మోదీ సర్కారు విఫలమవుతోందని గుర్తించటానికి వీరు నిరాకరి స్తున్నారు. పైకి ఎన్ని చెబుతున్నా, ఏదోక రూపంలో భారత రాజ్యాంగాన్ని మార్చాలన్నదే పై ఇద్దరి అభిప్రాయంగా కనిపిస్తుంది. వీరు కాకుండా.. 'రాజ్యాంగ రచనలో అంబేద్కర్‌కి స్వతంత్రత లేదు, ఉండుంటే భారత రాజ్యాంగాన్ని ఇంకా విప్లవాత్మకంగా రాసి

ఉండేవాళ్లు' అనే మధ్యేవాదులు, లౌక్యులు ఇంకొందరు ఉన్నారు. రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసుకోవాలంటే ఇలాంటి అభ్యంతరాలకు కూడా హేతుబద్ధంగా సమాధానమిస్తూ రాజ్యాంగ పద్ధతిలోనే వాటిని అధిగమించటం అవసరం.

## రాజ్యాంగం మార్పులకి అతీతం కాదనే మొండి వాదనలక్కర్లేదు


రాజ్యాంగం ఎప్పటికీ అలాగే ఉండాలని ఎవరూ అనరు. రాజ్యాంగం ఎంత గొప్పదైనా, అది మార్పులకి అతీతం కాదు. రాజ్యాంగం అనేది కేవలం సదాశయాల ప్రకటనపత్రంగానే మిగిలిపోయి రాజ్యవ్యవస్థ స్వభావాన్ని మలచటంలో ఎటువంటి పాత్రనూ పోషించలేకపోతే, అటువంటి రాజ్యాంగం చిత్తుకాగితంతో సమానం. 'రాజ్యాంగాలు సజీవ పత్రాలు' అని భారత రాజ్యాంగానికి స్ఫూర్తినిచ్చిన అమెరికా రాజ్యాంగ రచయిత, రాజనీతిజ్ఞుడు థామస్ జఫర్సన్ ఎంతో వాస్తవిక దృష్టితో స్పష్టం చేశారు. "రాజ్యాంగాల్ని నైతిక ఆధిపత్యంతో కూడిన పవిత్ర గ్రంథాల్లా, ముట్టుకుంటే మైలపడిపోతాయన్నట్లుగా కొంతమంది వ్యవహరిస్తుంటారు. గతకాలాల్లోని వారికి మానవాతీత విజ్ఞతను ఆపాదిస్తారు. పెద్దలు పొందుపరిచిన ప్రతిదీ సవరణలకు అతీతమన్నట్లు భావిస్తారు. కానీ, చట్టాలు, వ్యవస్థలు.. మానవ మేధస్సు అభివృద్ధితో కలిసిమెలిసే సాగాలి. కొత్త ఆవిష్కరణలు చేస్తున్నకొద్దీ, కొత్త సత్యాల్ని కనుగొంటున్నకొద్దీ మారిన పరిస్థితులకనుగుణంగా వ్యవహారశైలులు, అభిప్రాయాలు మారుతుంటాయి. వీటిని మనం గుర్తించాలి. కాలానుగుణంగా వ్యవస్థలు కూడా ఎదుగుతూండాలి".

## ఏ ప్రమాణాలతో చూసినా.. మన రాజ్యాంగాన్ని మౌలికంగా మార్చాల్సిన పన్లేదు

జఫర్సన్ చెప్పినట్లు ప్రతి తరానికీ గతం నుంచి అనుభవ ప్రయోజనం అందుతుంటుంది. ఈ అనుభవం పునాదుల మీద అవసరమైతే కొత్తగా నిర్మించుకునే సామర్థ్యం, హక్కు కూడా వారికి ఉండాలి. కానీ ఇటువంటి తిరుగులేని ప్రమాణాలతో చూసినా కూడా.. మన రాజ్యాంగాన్ని మౌలికంగా మార్చాల్సిన పనిలేదిప్పుడు. అటు తీవ్రవాద వామపక్షీయులు, ఇటు ఛాందస హిందూవాదులు చెప్పే రీతిలో రాజ్యాంగాన్ని మార్చటం లేదా రాజ్యాంగం పట్ల నిర్ణయాలు తీసుకోవటమైతే ఏకంగా ప్రమాదకరం కూడా. భారత్ లాంటి దేశానికి, దేశం ఇప్పుడున్న పరిస్థితులకు మన రాజ్యాంగం ఎంతో చక్కటి సంవిధానంగా మనకు సరిపోతుంది.

అయితే ఇంతకుముందే అనుకున్నట్లు.. కొన్ని గందరగోళాల్ని సరిచేయాల్సి ఉంది. రాజ్యాంగం పనిచేయకుండా, తన లక్ష్యాల్ని నెరవేర్చకుండా, కేవలం కాగితం మీద మిగిలిపోయేలా చేయటానికి ఈ లొసుగుల్ని జాతీయోద్యమ తరం తర్వాత వచ్చిన సాంప్రదాయ రాజకీయ పార్టీల నేతలు, పాలకులు ఉపయోగించుకుంటున్నారు. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించటానికి.. సమానస్థాయిని, అవకాశాల్ని కల్పించటానికి.. వ్యక్తి గౌరవాన్ని పరిరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించటానికి.. భారత రాజ్యాంగం తన పీఠికలోనే ఇచ్చిన నిర్దిష్ట హామీలు అమల్లోకి రాకుండా కుట్రపన్నినట్టు అడ్డుకుంటున్నారు.

జేపీ పలు సందర్భాల్లో చెప్పిన మాటలు మళ్లీ ఇక్కడ ప్రస్తావనార్హం. "సామాజిక న్యాయం అంటే మొక్కుబడిగా రిజర్వేషన్ల గురించి, దళితుల గురించి మాట్లాడటం కాదు. పుట్టుకతో వివక్షను తొలగించి సమానంగా ఎదిగే అవకాశాలనిచ్చే నిర్దిష్ట రాజకీయ, పాలనా మార్పులను లేవనెత్తటం, వాటి కోసం పనిచేయటం. రాజ్యాంగ పీఠికలోనే ఈ దిశానిర్దేశాన్ని పొందుపరిచారు. మన సమాజంలో కిందివర్గాల వారికి తిండిపెట్టటం, వారిని ఆదరంగా చూడటం వంటివి చేస్తారు, కానీ కిందిస్థాయివారి బిడ్డలు పైకి ఎదగటానికి కావలసిన మంచి చదువును అందించటానికి మాత్రం ఇష్టపడరు. కులప్రభావాన్ని తొలగించటంలో ప్రధానపాత్ర




వహించే నాణ్యమైన విద్యను ప్రతి బిడ్డకూ అందించటం గురించి 2019 ఎన్నికల్లో కూడా తెలుగు రాష్ట్రాల్లోనూ, జాతీయ స్థాయిలోనూ ఒక్క ప్రధాన పార్టీ కూడా మాట్లాడలేదు. పైకి మాత్రం సామాజిక న్యాయం అందిస్తామని నేతలు నటిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి డెబ్భై ఏళ్లు దాటినా ఈ దేశంలో పిల్లలకు నాణ్యమైన చదువు అందించాలన్న ఇంగితజ్ఞానం, పాపభీతి వామపక్షాలు, దళిత పక్షాలు సహా రాజకీయ పార్టీలకు ఎందుకు కలగలేదు అన్నది దిగ్భ్రాంతిని, వేదనను కలిగించే ప్రశ్న".

అంబేద్కర్, గాంధీ, రాజ్యాంగం పట్ల, ఈ త్రయం మధ్య ఉన్న విడదీయలేని సంధానం పట్ల మనకు పెరిగిన చైతన్యం ఈ అవరోధాల్ని, దుర్రాజకీయాన్ని ఛేదించి, ప్రభుత్వాలు, పార్టీలు రాజ్యాంగ ప్రజాస్వామ్యం దిశగా పనిచేసేలా చేయాలి. ఇందుకోసం పైన పేర్కొన్న స్థానిక సాధికారత, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యతోపాటు.. చట్టబద్ధపాలన, ప్రతి కుటుంబానికీ ఖర్చులేకుండా మంచి ప్రమాణాల ఆరోగ్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలు, నిజాయతీ, సామర్థం గల వారు చట్టసభలకు ఎన్నికయ్యేలా ప్రభుత్వాధినేతల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం, దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల కోసం మనం గట్టిగా డిమాండ్ చేయాలి. సోషల్ మీడియాలో

# చట్టబద్ధపాలన అమలు చేయలేని ప్రభుత్వాలు పేదరికాన్ని, వివక్షను నిర్మూలించలేవు

"చట్టపరంగా మనకు చట్టబద్ధపాలన ఉంది – చట్టం ముందు అందరూ సమానమే, చట్టం అందరి కంటే ఎక్కువ, ప్రభుత్వ జోక్యం లేకుండా న్యాయస్థానాలు స్వతంత్ర ప్రతిపత్తితో ఉంటాయి, చట్టప్రకారం పోలీసులు, ప్రాసిక్యూషన్ నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా వ్యవహరించాలి అని రాజ్యాంగం హామీ ఇస్తుంది.. కానీ వాస్తవంలోకొచ్చి చూద్దాం. భారతదేశంలోని 4,00,000 ఖైదీల్లో 75 శాతం మంది విచారణ దశలో జైళ్లలో ఉన్నవారే. ఎక్కువమంది చిన్న చిన్న నేరాల ఆరోపణల మీద మగ్గుతున్నవారే. బెయిలుకు దరఖాస్తు చేసుకుని, సమర్థవంతమైన న్యాయ సహాయం పొందేందుకు డబ్బులేని పేదరికం వీరిది. కోర్టుల్లో నిందితులు నేరాన్ని ఒప్పుకోవటమనేది మనదేశంలో పేదలపై థర్డ్ డిగ్రీ పద్ధతుల్ని, హింసను ప్రదర్శించటం ద్వారానే జరుగుతోంది. ఈ రకంగా బలవంతపు నేరాంగీకారం లేకుంటే, దేశంలో నేరాల్ని ఒప్పుకునేవారి సంఖ్య కేవలం 10 శాతం వరకు మాత్రమే ఉంటుంది. ప్రపంచంలోనే ఇది అతి తక్కువ. దాదాపు 3 కోట్ల కేసులు – రెండొంతులు క్రిమినల్, ఒక వంతు సివిల్ – మన కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. సంక్లిష్టమైన, ఉదాసీనమైన న్యాయ పద్ధతులు, ఎడతెగని వాయిదాలు, ఖర్చుతో కూడిన వ్యాజ్యాలు, సివిల్ కేసులను తెమల్చటంలో ఏళ్లు, దశాబ్దాల ఆలస్యం, న్యాయవ్యవస్థ అందుబాటులో లేకపోవటం కారణంగా సివిల్ వివాదాన్ని పరిష్కరించుకోవటానికి, తమ హక్కులను అమలు చేయించుకోవటానికి కోర్టులకు రావటానికి చాలా మంది పేద, మధ్యతరగతి ప్రజానీకం ధైర్యం చేయలేకపోతున్నారు. ఎక్కువమంది పేదలు.. జరిగిన అన్యాయాన్ని దిగమింగుకుంటూ నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తున్నారు. కొందరు ఏదన్నా న్యాయం జరుగుతుందనే ఆశతో లంచం ఇస్తున్నార్ను లేదా స్థానిక గూండా లేదా నేరచరితుడి దగ్గరకెళ్లి డబ్బులిచ్చి దౌర్జన్యంతో తక్షణ బందన్యాయం పొందే ప్రయత్నం చేస్తున్నారు.

వీటన్నింటి పర్యవసానం – న్యాయం సమిధవటం! పేదలే బలిపశువులవుతుంటారు, పేదరికం కొనసాగుతూనే ఉంటుంది. కాగితాల మీద ప్రకటనల్లో కాకుండా – నిరుపేదలకు, అత్యంత బలహీనురకు ఆచరణలో న్యాయం అందించలేని సమాజం.. పేదరికాన్ని, వివక్షను లేదా అణచివేతను నిర్మూలించలేదు. చట్టబద్ధపాలనను అమలు చేయటం ప్రభుత్వ మొట్టమొదటి బాధ్యత! మన పోలీసు వ్యవస్థలో విస్తృతమైన సంస్కరణల్ని అమలు చేయాలి. ముఖ్యంగా నేరదర్యాప్తులో, అక్కడ్నుంచి ప్రాసిక్యూషన్, న్యాయప్రక్రియ, న్యాయవ్యవస్థల్లో! ఈ మార్పుల్ని తెస్తేనే సామాజిక న్యాయానికి కనీసస్థాయి భరోసా కల్పించగలం".

– డా॥ బీఆర్ అంబేద్కర్, డా॥ బాబూ జగ్జీవన్ రామ్‌ల జయంతి సందర్భంగా ఏప్రిల్ 23, 2019న హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇచ్చిన కీలకోపన్యాసంలో లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ (ఆంగ్లంలో ఉన్న జేపీ ఉపన్యాస పాఠాన్ని ఓయూ ఎస్.సి/ఎస్.టి విభాగం (అంబేద్కర్ పరిశోధనా కేంద్రం) పుస్తకరూపంలో కూడా ప్రచురించి విడుదల చేసింది).

మన భావప్రకటనను, స్థానికంగా మన నాయకత్వాన్ని, ఎన్నికల్లో మన ఓటునీ ఈ డిమాండ్ల చుట్టూనే తిప్పాలి. అప్పుడే ఆదివాసీలు, దళితులు, బీసీలు, ఎంబీసీలు, మైనారిటీలు, మహిళలు, అగ్రవర్ణ పేదలు.. ఒక్క మాటలో చెప్పాలంటే, అవకాశాలు అందుకోలేని అందరూ.. వివక్ష నుంచి బైటపడి అంబేద్కర్ మహాశయుడు ఆశించినట్లు ఎదిగేందుకు సమానావకాశాల్ని పొందగలుగుతారు.

ఈ ఏడాది ఏప్రిల్ 14కి అంబేద్కర్ పుట్టి దాదాపు 130 ఏళు అవుతుంది. ఆయన కృషి పట్ల ఈ ఏడాది కనిపించిన చైతన్యం.. మన దేశంలో రాజ్యాంగ ప్రజాస్వామ్యం, కులరహిత సమాజం, యువతను ఆలోచనతో పనిచేసే నేతలుగా తీర్చిదిద్దటం పట్ల విశ్వాసాన్ని పెంచుతోంది. ఇది వ్యూహాత్మక ఎత్తుగడని, కొందరు ప్రజాసంఘాలవారు అంబేద్కర్, గాంధీ, రాజ్యాంగాలను వ్యూహాత్మకంగా అడ్డుపెట్టుకుంటున్నారని విమర్శలు కూడా లేకపోలేదు. ఇందులో కొంత వాస్తవం ఉండొచ్చు. అయితే, ఎవరు ఏ కారణంగా చేసినా.. ఇది సానుకూల మార్గం, యువతలో ఎంతో సానుకూల ప్రభావం చూపిన పరిణామం. అందుకే దీన్ని పటిష్ఠం చేసుకుంటూ నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకెళ్లాలి.

ఈ దేశంలో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనిచ్చేందుకు, నివారించదగ్గ బాధలను తొలగించేందుకు సుదీర్ఘకాలంగా లోక్‌సత్తా చేస్తున్న బహుముఖ మౌలిక కృషి కచ్చితంగా ఫలితాల్ని సాధిస్తుందన్న భరోసాని అంబేద్కర్ 2020 ఇస్తోంది. అయితే, ఎంత ఎక్కువమంది కన్నీరు కార్చకుండా, ఎంత వేగిరం ఈ మార్పుల్ని సాధించే సంఘటిత కార్యాచరణను ప్రదర్శించగలమన్నదే ఇప్పుడు మనందరి ముందు ఉన్న పెద్ద సవాలు.

# గాంధీని, అంబేద్కర్‌ని కలపటం భారత్‌కు చారిత్రక అవసరం





"ఇప్పుడు ఇండియాకు కావలసింది, మనం చేయాల్సింది గాంధీని, అంబేద్కర్‌ని కలపటం. అందుకే లోక్‌సత్తా భావజాల ఐకాన్లుగా వారిద్దరినీ ఎంచుకున్నాం. అధికారాన్ని వికేంద్రీకరించి.. ఓ గ్రామానికి బదులు గ్రామాల సమూహమనే పెద్ద యూనిట్‌ను గణతంత్ర భారతదేశం ప్రాతిపదికగా తీసుకుంటే, సాంప్రదాయ గ్రామాలను 20,000 – 30,000 జనాభాకొకటి చొప్పున సమూహంగా కలిపి, ఆ సముదాయాన్ని (క్లస్టర్) స్థానిక ప్రభుత్వాలకు ప్రాథమిక యూనిట్‌గా ఏర్పాటు చేస్తే ఆ ఇద్దరు మహనీయులు ఆశించిన ఓ పెద్ద మౌలిక లక్ష్యం నెరవేరుతుంది, దేశ ఉజ్వల భవితకు పటిష్ట పునాదులు ఏర్పడతాయి. దీనివల్ల ప్రాథమిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన ఆర్థిక వనరులు సమకూరతాయి, నిర్వహణ సామర్థ్యం కొరత కూడా తీరుతుంది. గ్రామాల సముదాయంగా ఉండే ఒక పెద్ద యూనిట్ ప్రాతిపదికన సార్వత్రిక ఓటు హక్కుకి ఉండే ప్రభావం వల్ల కుల అసమానతలు పలచబడతాయి".

– డా॥ జేపీ

## సరైన విద్యను అందించకుండా అంబేద్కర్ అంచనాలను చెల్లాచెదురు చేసిన స్వదేశీ ప్రభుత్వాలు

"అణగారినవర్గాలు వివక్షను ఎదుర్కొని తమ ప్రయోజనాలను సాధించుకోవాలంటే సంఘటితమై పోరాడాలన్నది బాబాసాహెబ్ అంబేద్కర్ స్వతంత్ర భారతదేశానికి చూపిన బాట. చెల్లాచెదురుగా అనామకంగా ఉన్న వందలాది కులాలను షెడ్యూల్డ్ కులాలుగా రూపొందించి వారిని ఏకం చేయటం ఆయన చేసిన గొప్ప మేలు. నిజానికి రిజర్వేషన్ల ఏర్పాటు ద్వారాకన్నా అస్పృశ్యులుగా వున్నవారిని ఎస్.సిలు అనే సంఘటిత శక్తిగా రూపొందించటం ద్వారానే అంబేద్కర్ ఎస్.సిలకు, తద్వారా భారతీయ సమాజానికి దీర్ఘకాలిక మేలు చేశారు. రిజర్వేషన్లు మౌలిక లేక అంతిమ పరిష్కారమని అంబేద్కర్ భావించలేదు. వాటిని ఆయన ఉపశమనాలుగా భావించారు కాబట్టే కాలపరిమితితో ముడిపెట్టారు. మన పాలకులు ప్రజలకు సరైన విద్యను అందించి వారు స్వతంత్రంగా తమ కాళ్ల మీద తాము నిలబడేలా చేస్తారని, తద్వారా రిజర్వేషన్ల ఉపశమనం అవసరం ఉండదని ఆయన భావించారు. కానీ మన స్వదేశీ పాలకులు అంబేద్కర్ అంచనాలను చెల్లాచెదురు చేసి వివక్షకు గురైన వర్గాలకి విద్య అందకుండా చేసి, కులాల మధ్య చిచ్చుపెట్టి, ఓట్లు కొల్లగొట్టే రాజకీయం చేస్తూ, అణగారిన వర్గాలను శాశ్వతంగా అణగారినవారుగానే కొనసాగించే ప్రయత్నం చేస్తున్నారు.

రిజర్వేషన్లలో పైచూపే తప్ప కింద చూపు ఉండదు. దానివల్ల నిచ్చెనమెట్లలో ముందువరసలో వుండి లబ్ధి పొందిన కొద్దిమందే మళ్లీ లబ్ధి పొందుతూ పైపైకి వెళ్తుంటే అడుగునవున్నవారు అలాగే మిగిలిపోతుంటారు. చివరకు ఏ సమస్య పరిష్కారం కోసమైతే ఒక సమూహంలో రిజర్వేషన్లు వచ్చాయో మళ్లీ అదే సమస్య ఆ సమూహంలో కూడా తలెత్తి... అవకాశాలున్నవారు, అవకాశాలు దక్కనివారుగా అది చీలిపోతోంది. అన్నదమ్ములే పరస్పర శత్రువులాగా మారిపోయి కొట్టుకోవటం మొదలవుతోంది. విధానాలు, విలువలు, ప్రజాప్రయోజనాలు అనే ఆలోచనే లేకుండా ఏదోరకరకంగా ఓట్లు దండుకుని అధికారాన్ని కైవశం చేసుకుందామన్న ఏకైక లక్ష్యంతో సాగుతున్న సాంప్రదాయ, పెత్తందారీ రాజకీయ పార్టీలకు అణగారిన కులాల మధ్య ఈ నిరంతర చిచ్చు ఓట్ల వర్షం కురిపిస్తోంది.

వీటన్నిటినీ పరిశీలించి చూస్తే... వెనకబడినవారిలో అడుగున, అట్టడుగున వున్నవారికి ప్రస్తుత వ్యవస్థలో రిజర్వేషన్లు అందవు, చదువు అందదు అని అర్థమైపోతోంది. ఇక మిగిలింది ఓటు అస్త్రం. ఓటును చూపి హక్కుల్ని సాధించుకునే పరిస్థితులకు కూడా మన ఎన్నికల విధానంలో వీరికి అవకాశం రావటం లేదు.

ఈ పరిస్థితులలో అవకాశాలు దక్కనివారంతా ఏకమై తమ సంక్షోభ పరిష్కారానికి సరైన మార్గాలని గుర్తించి వాటికోసం సంఘటితంగా ఉద్యమించటం ఒక్కటే మార్గం. మహాత్మాఫూలే, నారాయణ గురు, రామస్వామి నాయకర్, గాంధీ, అంబేద్కర్‌ని లోతుగా అర్థం చేసుకుని కాలానుగుణంగా వారి మార్గాన్ని మరింత విస్తరించుకుని పోరాడాల్సి వుంది. ఇదిగో ఈ క్రమంలో భాగంగానే అత్యంత వెనకబడిన కులాలు ఎం.బి.సిల పేరుతో ఏకమవ్వాలన్న పిలుపుతో ఈ పుస్తకం. మనదేశంలో వెనకబాటుతనానికి ప్రధాన కారణం– నాణ్యమైన విద్య రాజకీయానికి కేంద్రబిందువు కాకపోవటం! పేదరికం పోవాలన్నా, వివక్ష తొలగాలన్నా ఒకేఒక్క మార్గం–చదువు, చదువు, చదువు. కానీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా చదువును కీలక పరిష్కారంగా సోషలిస్టు భావజాలమున్న పార్టీలతో సహా ఏ రాజకీయపార్టీ కూడా ముందుకు తీసుకురాలేదు. దానివల్ల ఎంబీసీలు బాగా దెబ్బతిన్నారు.

ఎంబీసీల ముందున్న ప్రధాన లక్ష్యం– మంచి చదువు, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యాన్ని సాధించటం. అందుకు వారికముందున్న సరైన మార్గం–ఎంబీసీల గొడుగుకింద ఏకమవటం. పుట్టుకతో వివక్ష లేకుండా తమందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే భారతదేశపు రెండవ రిపబ్లిక్‌ను నిర్మించుకునేందుకు ఎంబీసీలంతా ఏకం కావాల్సిన తరుణమిది".

– 'ఎంబీసీలు' పుస్తకానికి 2012లో రాసిన ముందుమాటలో జేపీ

# పౌర సేవలకు గ్యారంటీ లేకుంటే.. పేద, అణగారిన వర్గాలు పీడనకు గురవుతూనే ఉంటారు

"మనం సమానత్వాన్ని, అవకాశాల్ని పెంపొందించటానిక్కి న్యాయాన్ని పొందటానికి చట్టబద్ధ వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకున్నాం. కానీ వాస్తవంలో మాత్రం.. నిజమైన సమానత్వం, అవకాశాలు, న్యాయం మన ప్రజల్లోని అత్యధిక సంఖ్యాకులకు అందటం లేదు. పుట్టుకతో అసమానతల్ని కొనసాగించటానికి పెద్దఎత్తున కారణమవుతున్న రాజ్యవ్యవస్థ పనితీరుకు సంబంధించి కీలకాంశం పౌర సేవలు!

ప్రజలకు మంచినీరు, మురుగు పారుదల, వరద డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర కనీస సేవల్ని సక్రమంగా, కచ్చితంగా అందించటం ప్రభుత్వ మౌలిక బాధ్యత. రోజువారీ జీవితానికి ఎంతో అవసరమైన ఈ సేవలను అందించటంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రధానంగా పేదల జీవితాలు దుర్భరంగా మారతాయి, మెరుగైన భవిష్యత్తు కోసం వారు ఎంతో ఆరాటంతో చేసే ప్రయత్నాలకు ఆ మేరకు గండిపడుతుంది. ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపించేది, గుర్తించాల్సినది – ఒక సాధారణ పౌరునికి, ఒక అతి దిగువ స్థాయిలో ఉన్నా సరే ప్రభుత్వోద్యోగికీ మధ్య నెలకొన్న భారీ అంతరం, అసమతుల్యత! మన దేశంలో పనిచేసేవారిలో 90 శాతం మందికి తక్కువ జీతాలు, ఆదాయమే ఉన్నాయి. వీళ్లంతా జీవన భద్రతలేకుండా అసంఘటిత రంగంలో ఉన్నవారు లేదా స్వయంఉపాధి పొందుతున్నవారు. దీనివల్ల, ఒక సాధారణ ప్రభుత్వోద్యోగి కూడా ఆర్థికంగా వీరి కంటే ఎక్కువ భద్రతను కలిగి ఉంటాడు, మెరుగ్గా చదువుకుని, విషయ పరిజ్ఞానం కలిగి ఉంటాడు, జనాభాలోని అత్యధికుల కంటే ఎక్కువ పలుకుబడి, అధికారం కలిగి ఉంటాడు! లంచాలు, వేధింపులు, జాప్యాలు లేకుండా సామాన్య పౌరులకు ప్రభుత్వ సేవల్ని సవ్యంగా అందించటంలో స్వతంత్ర భారతదేశ వైఫల్యం వల్ల మన ప్రజలు నిస్సహాయంగా అర్థించేవారుగా మిగిలిపోగా.. ప్రజాసేవకులుగా ఉండాల్సిన ఉద్యోగులు యజమానుల్లా తయారయ్యారు. ఇలా పాత్రలు తారుమారవటం, వలసపాలన నాటి మనస్తత్వం నుంచి బైటపడకపోవటం, లైసెన్స్–కంట్రోల్–పర్మిట్ విధానాలు కలగలిసి పేదలకు తీవ్ర నష్టం చేసి దేశాన్ని వెనక్కి గుంజుతూ వచ్చాయి. తమకు హక్కుగా అందాల్సిన మౌలిక సేవలకు దాదాపు 65 శాతం కుటుంబాలు ప్రతి సంవత్సరం లంచాలు చెల్లిస్తున్నాయని సర్వేలు సూచిస్తున్నాయి. వీరంతా బలవంతపు అవినీతి బాధితులు. తమకు అప్పనంగా మేలు చేయమనో, తమ పట్ల పక్షపాతం చూపాలనో వీరు అడగటం లేదు. తమకు హక్కుగా రావాల్సిన సేవలను సక్రమంగా అందించమని అడుగుతున్నారు. కానీ ఆలస్యాలు, వేధింపులు, అవమానాలు, అయోమయాలు, కొన్ని సందర్భాల్లో పూరించలేని నష్టానికి గురై నలిగిపోతున్నారు. పేదల నుంచి లంచాలు వసూలు చేయటం ఒక ఆనవాయితీగా మారిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటం కోసం వీరు మధ్యవర్తుల సాయం కోరాల్సి వస్తోంది. స్థానిక రాజకీయ కార్యకర్తలు, పలుకుబడి గలవారి మీద ఆధారపడాల్సి వస్తోంది. ఫలితంగా పేదలు రాజకీయ బానిసత్వంలో శాశ్వతంగా మగ్గుతున్నారు. సార్వత్రిక ఓటుహక్కు, ప్రజాస్వామ్యం నానాటికీ బలహీనపడుతున్నాయి.

మౌలిక సేవలను వేగంగా, నిర్దిష్ట కాలపరిమితిలోగా అందించేట్టుగా మనకు సర్వీస్ గ్యారంటీని (హక్కుగా పౌర సేవలకు చట్టబద్ధ ఏర్పాటు) అమల్లోకి తేవాలి. గడువులోగా సేవలను అందించలేకపోతే పరిహారం చెల్లించాలి. యు.కెలో ఈ రకమైన సిటిజన్స్ చార్టర్లను జాన్ మేజర్ ప్రభుత్వం వ్యవస్థీకృతం చేసింది. అనేక దేశాలు దీన్ని అనుసరించాయి. పౌర సేవల్ని సక్రమంగా అందించటానికి భారతదేశంలో ఇప్పటి వరకూ చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగలేదు. దీంతో, ప్రజలకనెత్తిన అందనంత ఎత్తులో ఉన్న అధికార వ్యవస్థ, అధ్వాన్న పౌర సేవలు అలాగే కొనసాగుతూ ప్రజల్ని పీడిస్తున్నాయి. దీన్ని సరిదిద్దడానికి బదులుగా, భారత ప్రభుత్వం అడ్డగోలుగా తుగ్లక్ తరహాలో స్పందించింది. పౌర సేవల సంక్షోభం పరిష్కారం కాకపోగా వ్యతిరేక ఫలితాలు వచ్చేలా చట్ట సవరణ చేసింది. 2018లో పార్లమెంటు అవినీతి నిరోధక చట్టాన్ని ఏకగ్రీవంగా సవరించింది. వామపక్షాలు, దళిత, అగ్రకులాల అనే తేడా లేకుండా అన్ని పార్టీలూ ఈ సవరణలో ప్రభుత్వానికి మద్దతు పలికాయి. చట్టానికి రెండు దిగ్భ్రమ కలిగించే నిబంధనల్ని జోడించారు. మొదటిది, వేధింపులు లేకుండా సకాలంలో నాణ్యమైన పౌర సేవల్ని అందించే జవాబుదారీతనం కలిగిన నిర్మాణాన్ని ఏర్పాటు చేయటానికి బదులు.. ఓ చిన్నపాటి ధ్రువపత్రం కోసమో, విద్యుత్ మీటర్ కోసమో గతి లేక లంచమిచ్చే నిస్సహాయ బాధిత పౌరుడికి ఏడేళ్ల జైలుశిక్ష విధించేలా సవరణ చేశారు. కనీస శిక్ష మూడేళ్లు! దేశంలో ఇలా తప్పనిసరి శిక్ష చాలా నేరాలకు లేదుగానీ, నిస్సహాయ పౌరులకు మాత్రం వర్తింపచేశారు. లాలూచీ అవినీతి అయితే, లంచం ఇచ్చేవాడు, లంచం తీసుకునేవాడు ఇద్దరూ తమ అక్రమ లాభం కోసం దేశానికి నష్టం కలిగిస్తే, న్యాయమైన పోటీని అణగదొక్కితే లేదా ఏ రూపంలోనైనా ప్రజాప్రయోజనాలను కాలరాస్తే.. అప్పుడు మాత్రమే లంచం ఇచ్చేవాడు కూడా లంచం తీసుకునేవాడితో సమానంగా నేరస్తుడవుతాడు. చట్టపరంగా అప్పుడు మాత్రమే ఇచ్చేవాడి మీద కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. కానీ బలవంతపు అవినీతికి బాధితులైన నిస్సహాయ సామాన్యులు తమకు హక్కుగా రావాల్సిన జనన లేదా ఆదాయ ధ్రువపత్రం, భూ రికార్డు లేదా హక్కుల రికార్డు పత్రం, నీటి సరఫరా, లేదా విద్యుత్తు కనెక్షన్‌కు గతి లేక లంచాలిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యానికి, బలవంతపు అవినీతికి బాధితులైనవారికి విధిగా మూడేళ్ల జైలు శిక్ష విధించటం ఎంత క్రూరమైన వైచిత్రి! అటువంటి ధోరణులు పేదరికాన్ని, సామాజిక, ఆర్థిక అసమానతను ఇంకా కొనసాగిస్తాయి. కులపరమైన అణచివేతని, పుట్టుకతో ప్రతికూలతల్ని అధిగమించేలా రాజ్యవ్యవస్థ పేదలు, బలహీనులలను బలోపేతం చేస్తుందని బాబాసాహెబ్ ఆశించారు. కానీ దానికి బదులుగా, పేదలను పిండి, వారిని ఇంకా అణగదొక్కే ఒక రాకాసిని మనం సృష్టించాం. చట్టానికి ఇంకో ఘోరమైన సవరణ కూడా చేశారు. గతి లేక లంచం ఇచ్చినవాడిని కఠినంగా శిక్షించటం ఒకపక్కయితే.. లంచం తీసుకునేవాడిని మాత్రం ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా కనీసం విచారణ కూడా చేయకూడదట! గతంలో అధికారుల ప్రాసిక్యూషన్‌కు మాత్రమే ముందస్తు అనుమతి రక్షణ ఉండేది. ఇప్పుడు ఏకంగా ప్రాథమిక విచారణకు కూడా అనుమతి తీసుకోవాలనే నిబంధన పెట్టారు. పేద, నిస్సహాయ పౌరునికి, ఆ పౌరునికి సేవకుడైన ప్రభుత్వోద్యోగికి మధ్య నిచ్చెనమెట్ల అంతరం ఎంత అగాథంలా ఉందో తెలియజెప్పటానికి ఇంతకంటే పెద్ద దృష్టాంతం కావాలా? మనకు నిజమైన జవాబుదారీతనం కావాలి, ప్రభుత్వం నుంచి హక్కుగా జరగాల్సిన పనులకు సర్వీస్ గ్యారంటీ ఏర్పాటు కావాలి, బలవంతపు అవినీతికి బాధితులైన సామాన్య ప్రజలను శిక్షించే క్రూరమైన చట్టసవరణల్ని ఉపసంహరించుకోవాలి. ఇవి చేయకుంటే, ప్రభుత్వ యంత్రాంగపు క్రౌర్యానికి, ద్రోహానికి పేదలు బలిపశువులవటం కొనసాగుతూనే ఉంటుంది".

**– డా॥ బీఆర్ అంబేద్కర్, డా॥ బాబూ జగ్జీవన్ రామ్‌ల జయంతి సందర్భంగా ఏప్రిల్ 23, 2019న హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇచ్చిన కీలకోపన్యాసంలో డా॥ జయప్రకాష్ నారాయణ్**

# అంబేద్కర్ భావ పోరాటాలు: 'మూక్‌నాయక్' పత్రికకు వందేళ్లు

- సిద్ధార్థ్

అంబేద్కర్ తన 65 సంవత్సరాల జీవితంలో 36 సంవత్సరాలపాటు (1920-56) ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పత్రికా రచనను కొనసాగించారు. ఆయన ప్రారంభించిన తొలి పత్రిక 'మూక్‌నాయక్' 1920 జనవరి 31న వెలుగు చూడగా తుది పత్రిక 'ప్రబుద్ధ భారత్' తొలి సంచిక 1956 ఫిబ్రవరి 4న ప్రచురితమయింది. ఈ రెండు పత్రికల మధ్యకాలంలో 1927 ఏప్రిల్ 3న 'బహిష్కృత భారత్', 1928 జూన్ 29న 'సమత', 1930 నవంబర్ 25న 'జనత' ఆయన ప్రారంభించారు. 'మూక్ నాయక్' నుంచి 'ప్రబుద్ధ భారత్' దాకా ఆయన మేధోగమనం ఒక స్ఫూర్తిదాయక భావయానం, చైతన్యశీల పోరాట ప్రస్థానం.

భారతీయ వార్తాపత్రికల్లో అత్యధిక భాగం కులాధార




దురభిప్రాయాలలో కునారిల్లుతూ, స్వార్థ ప్రయోజనాలను ప్రోత్సహించేవిగా ఉన్నాయని శతాబ్దం క్రితమే అంబేద్కర్ భావించారు. 1920 జనవరి 31న ప్రచురితమైన 'మూక్‌నాయక్' ప్రారంభ సంచిక సంపాదకీయంలో వార్తాపత్రికలపై తన అభిప్రాయాన్ని ఆయన ఇలా వ్యక్తం చేశారు. 'బొంబాయి ప్రెసిడెన్సీలో ప్రచురితమవుతున్న వార్తాపత్రికలను పరిశీలిస్తే, వాటిలో చాలా పత్రికలు అగ్రకులాల ప్రయోజనాల పరిరక్షణకే ప్రాధాన్యమిచ్చేవని అర్థమవుతుంది. ఇతర కులాల ప్రయోజనాల గురించి ఇవేమాత్రం పట్టించుకోవు. కొన్నిసార్లు వ్యతిరేకంగా వ్యవహరిస్తాయి. అత్యధిక పత్రికలు కులతత్వంతో, పక్షపాత వైఖరితో అస్పృశ్యులు, అణగారిన కులాల ప్రయోజనాలను దెబ్బతీస్తుంటాయి' అన్నారాయన. అంటరానివర్గాల వారి ప్రయోజనాలను పరిరక్షించడానికి ఒక వార్తాపత్రిక అవసరమని భావిస్తూ అంబేద్కర్ ఇలా రాశారు: 'మన ప్రజలకు వర్తమానంలో జరుగుతున్న, భవిష్యత్తులో జరగబోయే అన్యాయాలను రూపుమాపే మార్గాలను సూచించేందుకు వార్తాపత్రికలను మించిన ఉత్తమ సాధనం మరొకటి లేదు. అధికారమూ, జ్ఞాన సంపదా లేకపోవటం వల్ల బ్రాహ్మణేతరుల పురోగతికి అవరోధాలు ఏర్పడ్డాయి. అయితే మిగతావారికి పేదరికం ప్రయాస లేదు. వ్యవసాయం, వర్తక వాణిజ్యాలు, ప్రభుత్వ ఉద్యోగాల ద్వారా వారు భద్రమైన జీవనాధారాలను కలిగివున్నారు. కానీ, అస్పృశ్యులనేవారు సామాజిక అసమానతల ప్రభావంతో సర్వనాశనమవుతున్నారు. నిస్సహాయత్వం, పేదరికం, అజ్ఞానంలో నిండా మునిగిపోయివున్నారు'.

అంటరానివారికి వ్యతిరేకంగా జరుగుతున్న దురాగతాలను ప్రపంచ దృష్టికి తీసుకువెళ్లేందుకు, సహస్రాబ్దాల దోపిడీ, దౌర్జన్యాల నుంచి వారిని విముక్త పరిచేందుకు 'మూక్‌నాయక్'ను తీసుకురావాలని అంబేద్కర్ నిర్ణయించారు. అయితే, మూక్‌నాయక్‌లోనూ, ఆయన స్థాపించిన మరో నాలుగు వార్తాపత్రికలలోనూ ఎప్పుడూ ఎలాంటి కులపరమైన దురభిప్రాయాల వ్యక్తీకరణకు ఆయన తావివ్వలేదు. ఒక నిర్దిష్ట కులానికి నష్టం కలిగించేది యావత్ సమాజానికీ భారీ నష్టాన్ని కలిగిస్తుందని అంబేద్కర్ విశ్వసించారు. సమాజాన్ని ఒక నావతో పోల్చుతూ, కులపక్షపాత వార్తాపత్రికలను హెచ్చరిస్తూ 'ఏ ఒక్క కులమైనా భ్రష్టు పట్టిపోతే దాని ప్రభావం ఇతర కులాలపై కూడా పడుతుంది. సమాజం సముద్రంలో పోతున్న ఒక నావ వంటిది. ఒక కులం ప్రయోజనాలను దెబ్బతీస్తే అది

సమస్త కులాలపైన ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ప్రభావాన్ని తప్పక నెరపుతుంది. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని విశాల దృక్పథంతో వ్యవహరించడం పత్రికల నైతిక కర్తవ్యం. 'మూక్‌నాయక్' ఏ కులం లేదా వర్గం వారి ప్రయోజనాలను దెబ్బతీయాలని యోచించదని, ప్రతి ఒక్కరూ ఇతరులకు హాని చేయకుండా వారి ప్రయోజనాలను పరిరక్షించే సమాజ నిర్మాణానికి నిబద్ధమవుతుందని' అంబేద్కర్ రాశారు.

వార్తాపత్రికల కులతత్వంతోపాటు పాత్రికేయ వృత్తి వ్యాపారీకరణ, పాత్రికేయుల అనైతిక నడవడి మొదలైన అంశాలపై కూడా అంబేద్కర్ ఆందోళన వ్యక్తం చేస్తుండేవారు. 'భారతదేశంలో జర్నలిజం ఒకనాడు వృత్తిగా విలసిల్లింది. అది ఇప్పుడు వ్యాపారంగా పరిణమించింది. ఎటువంటి నైతిక కర్తవ్యాన్ని నిర్వర్తించడం లేదు. వివేచనాపూరిత అభిప్రాయానికంటే అనాలోచిత భావావేశాలకు ప్రాధాన్యమిస్తున్నారు. వీరారాధనతో దేశ ప్రయోజనాలను విస్మరిస్తున్నారు. నాయకులను గుడ్డిగా ఆరాధిస్తున్నారు" అని అంబేద్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ వార్తాపత్రికలకు కొన్ని ప్రమాణాలను ఆయన నిర్దేశించారు. అవి: జర్నలిజం స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. ఇలా ఉండటమంటే, భారతీయ సమాజ సందర్భంలో, కుల పక్షపాతం, మతపరమైన దురభిప్రాయాలకు తావివ్వకపోవడమే. ముందుగా రూపొందించుకున్న భావాలు, అభిప్రాయాలపై కాకుండా యదార్థాల ప్రాతిపదికన మాత్రమే వార్తలు రాయాలి. జర్నలిజం ఒక వ్యాపారం కాకూడదు. అది నిరంతరం ఒక సమున్నత లక్ష్యంగా, విద్యుక్త ధర్మంగా ఉండాలి. వీరారాధనకు ఎట్టి పరిస్థితులలోను తావుండకూడదు. సంచలనాత్మకత కాకుండా నిష్పాక్షికతే వార్తాపత్రికల ఆదర్శం కావాలి. భావావేశాలను రెచ్చగొట్టటానికి బదులు సమాజంలో హేతుయుక్తమైన ఆలోచనలను పెంపొందించేందుకు పాత్రికేయులు పూనుకోవాలి.

భారతీయ సమాజంలోని అంటరానివారు, ఇతర అణగారిన కులాలవారు సొంత వార్తాపత్రికలను కలిగివుండటం అవసరమని అంబేద్కర్ గట్టిగా అభిప్రాయపడ్డారు. 'అస్పృశ్యులకు పత్రికలు లేవు. కాంగ్రెస్‌కు మద్దతునిచ్చే పత్రికలు అంటరానివారి వార్తలకు ప్రాధాన్యమివ్వవు. ఇందుకు కారణాలు ఏమిటో స్పష్టమే' అంటూ, సొంత వార్తాపత్రికను ప్రారంభించేందుకు అస్పృశ్యులకు ఆర్థికస్తోమత లేదనే విషయం పట్ల తన ఆందోళనను ఇలా వ్యక్తం చేశారు: 'మనకు డబ్బు లేదు, వార్తాపత్రికలు లేవు. దేశమంతటా మన ప్రజలు పెత్తందారీ ధోరణుల మూలంగా నానా అవస్థలు పడుతున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను పత్రికలు పరిగణలోకే తీసుకోవటం లేదు. పైగా వివక్ష చూపుతున్నాయి. సామాజిక రాజకీయ సమస్యలపై మన భావాలు, అభిప్రాయాలను పత్రికలు పథకం ప్రకారం అణచివేస్తున్నాయి'.

ఆర్థిక వనరులు అంతగాలేని ఒక సామాజిక వర్గం ఒక వార్తాపత్రికను తీసుకురావడంలో ఎదురయ్యే సమస్యల గురించి ఆయనకు అవగాహన ఉన్నది. అయినప్పటికీ 29 సంవత్సరాల వయస్సులోనే అంబేద్కర్ 'మూక్‌నాయక్' ప్రారంభించారు. దరిమిలా ఆయన పోరాటంలో వార్తాపత్రికలు ఒక అనివార్య ఆయుధమయ్యాయి. అంబేద్కర్ తన 65 సంవత్సరాల జీవితంలో 36 సంవత్సరాలపాటు (1920–56) ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పత్రికా రచనను కొనసాగించారు. ఆయన ప్రారంభించిన తొలి పత్రిక 'మూక్‌నాయక్' 1920 జనవరి 31న వెలుగు చూడగా తుది పత్రిక 'ప్రబుద్ధ భారత్' తొలి సంచిక 1956 ఫిబ్రవరి 4న ప్రచురితమయింది. ఈ రెండు పత్రికల మధ్యకాలంలో 1927 ఏప్రిల్ 3న 'బహిష్కృత భారత్', 1928 జూన్ 29న 'సమత', 1930 నవంబర్ 25న 'జనత' ఆయన ప్రారంభించారు. 'మూక్‌నాయక్' నుంచి 'ప్రబుద్ధ భారత్' దాకా ఆయన మేధోగమనం ఒక స్ఫూర్తిదాయక భావయానం, చైతన్యశీల పోరాట ప్రస్థానం. ఈ 'మూక్‌నాయక్' తన ప్రజల విముక్తిని 'ప్రబుద్ధ భారత్'లో చూశారు. శతాబ్దాలుగా అమానుష అన్యాయాలను భరిస్తూ వచ్చిన అసంఖ్యాక ప్రజలకు గొంతుకనివ్వడంతో ప్రారంభమైన అంబేద్కర్ పత్రికా రచన వ్యాసంగం 'ప్రబుద్ధ భారత్' ద్వారా జ్ఞాన వికాసోద్యమ భారత్‌ను నిర్మించే స్వప్నంతో ముగిసింది.

'అంబేద్కర్ ఒక కొత్త భారతదేశాన్ని స్వప్నించారని' ఆయన మేధో కృషిని లోతుగా అధ్యయనం చేసిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త గెయిల్ ఆంవెట్ అన్నారు. 'భారత స్వాతంత్ర్యోద్యమం నిర్ణయాత్మక దశకు చేరుకున్న ఈ కాలంలో, అంబేద్కర్ పోరాటం ఒక భిన్న స్వాతంత్ర్యం కోసం జరిగింది. భారతీయ సమాజంలోని అణగారిన వర్గాల వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై జరిగిన పోరాటమది. వలసపాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం కంటే ఆయన చేసిన పోరాటం విశాలమైనదీ, ప్రగాఢమైనదీ. ఒక కొత్త జాతిని నిర్మించాలని ఆయన స్వప్నించారు'. అంబేద్కర్ పత్రికా రచనలు, ఆయన వ్యవస్థాపించిన పత్రికలు, అణగారిన వర్గాల స్వాతంత్ర్య సాధనకేగాక కొత్త భారతదేశ నిర్మాణానికి నిండు నిదర్శనాలు.

**(కర్టెసీ: ఫార్వర్డ్ ప్రెస్/ఆంధ్రజ్యోతి)**

# రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని తీసేస్తామంటే ఎలా?

"అధికారంలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ.. రాజ్యాంగసంస్థ కాలాన్ని కుదించేస్తాను, సంస్థను మూసేస్తాను, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని తీసేస్తాను అంటే ఇక రాజ్యాంగ పదవులు ఎందుకు?" అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ ప్రశ్నించారు. "పదవిలో ఉన్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పదవీకాలం కుదించటం అంటే ఆయన్ను పదవిలో నుంచి తొలగించినట్లే. ఆ అధికారం రాష్ట్ర శాసనసభకు లేదు. ఇది న్యాయస్థానాల్లో చెల్లదు. ఇందులో నాకు ఏమాత్రం సందేహం లేదు. ఈ రకమైన ఏర్పాటు లేకపోతే రాజ్యాంగ సంస్థల ఉనికికి అర్థం లేదు" అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తొలగింపు అంశంపై జేపీ 'ఈనాడు'తో మాట్లాడారు (ఏప్రిల్ 10న). ఆయన ఏం చెప్పారంటే..

+ ఒకసారి రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని నియమించిన తర్వాత తీసేసే అధికారం లేదని రాజ్యాంగంలోని 243 (కె) అధికరణం స్పష్టంగా చెబుతోంది. ఆర్టికల్ 124 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులను ఎలా తొలగిస్తారో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానాధికారినీ అలాగే తొలగించాలి. రాష్ట్ర ప్రభుత్వం.. 'మేం ఆయనను తీసెయ్యలేదని, పదవీకాలం తగ్గించామని' అంటోంది. ఒకసారి ఎన్నికల ప్రధానాధికారిగా పదవిలో నియమించిన తర్వాత ఆయన పదవీకాలం మొదట ఎంతవరకు నిర్దేశించారో అంతకాలం వర్తిస్తుంది. అలాకాకుండా పదవీకాలం తగ్గించామనే వంకతో చేసినా అది పదవి నుంచి తొలగించినట్లే. గడుసుగా చేసిన ప్రయత్నం ఇది.

+ ఎన్నికల ప్రధానాధికారిని నియమించడానికి ముందే పదవీకాలం మూడేళ్లు మాత్రమే ఉంటుందని ప్రకటించి చట్టం చేసి అమలు చేస్తే ఇబ్బంది లేదు. అందుకు రాష్ట్ర శాసనసభకు అధికారం ఉంది. ఆ అధికారాన్ని గౌరవించాలి.

అంతెందుకు ఒక్కసారి పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించిన తర్వాత వాటి పదవీకాలాన్ని కుదించే అధికారం లేదు. ఏదైనా తప్పు చేస్తే విచారణ చేసి తొలగించే అధికారమే ఉంది. మళ్లీ ఆ పంచాయతీకి ఎన్నికలు నిర్వహిస్తే మిగిలిన పదవీకాలమే వర్తిస్తుంది తప్ప అయిదేళ్లు వర్తించదు. రాజ్యాంగం కల్పించిన రక్షణ ఇది. రాజ్యాంగం చేతులు కట్టేసి.. నేను రాజును నా ఇష్టమొచ్చినట్లు చేస్తానంటే కుదరదు.



## నేను రాజుని.. ఇష్టం వచ్చినట్లు చేస్తామంటే కుదరదు

## న్యాయస్థానాల్లో ఇది చెల్లదు

## లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్

## గవర్నర్ తొందరపడ్డారు.. హైకోర్టు తీర్పుని ప్రభుత్వం గౌరవించాల్సిందే!

ఎస్ఈసీగా నిమ్మగడ్డ రమేష్ కుమార్ తొలగింపు సరికాదంటూ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పుని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించాల్సిందేనని లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజ్యాంగ వ్యవస్థలను గౌరవించటం అలవరచుకోవాలన్నారు. ముఖ్యమంత్రే అడ్డదిడ్డంగా వ్యవహరిస్తే రేపు ప్రజలు ముఖ్యమంత్రిని కూడా గౌరవించని పరిస్థితులు వస్తాయన్నారు. ప్రభుత్వం ఆగమేఘాల మీద తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ కళ్లు మూసుకుని సంతకం పెట్టటాన్ని లోక్‌సత్తా తప్పుపడుతోందన్నారు. వివాదాల్ని, భేషజాల్ని వీడి ప్రభుత్వం పరిపాలనపై దృష్టి పెట్టాలన్నారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రతినిధులు అల్లంశెట్టి నాగభూషణం, భీంపల్లి భాస్కరుడు తదితరులు పాల్గొన్నారు.

# సిగ్గుపడండి.. రహదారిపై ధాన్యం తగులబెడుతున్నారు!







విజయనగరం జిల్లాలో గడచిన ఆర్నెల్లుగా ధాన్యం పంటను అధికారులు కొనుగోలు చేయకపోవటం, కొన్న పంటకు చెల్లింపులు చేయకపోవటంతో రైతులు రోడ్లెక్కారని, ధాన్యాన్ని రహదారిపై వేసి తగులబెట్టి నిరసన వ్యక్తం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. జనవరి మాసంలో వేపాడ, గరుగుబిల్లి, పార్వతీపురం, డెంకాడ మండలాల్లోని రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయలేదని వరి పనలకు రోడ్డుపై నిప్పెట్టారన్నారు. ఇప్పటికీ ప్రభుత్వం మేలుకోకపోవటంతో తాజాగా తమ వద్దనున్న 1075 రకం, 1121 తదితర రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయటం లేదని సాలూరులో రైతులు ధాన్యాన్ని తగులబెట్టారన్నారు. ప్రభుత్వం, జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులు సిగ్గుపడాలన్నారు. రైతుల వద్ద నుంచి కొన్న పంటకు వెంటనే చెల్లింపులు చేయాలని, మిగిలిన ధాన్యాన్ని కూడా తక్షణం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల దుస్థితిపై జనవరిలో లోక్‌సత్తా ఆందోళనలు చేసి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిందని, నిర్లక్ష్యం ఇంకా కొనసాగితే రైతు ఉద్యమాన్ని చేపడతామని బాబ్జీ హెచ్చరించారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు.

✦ విజయనగరంలోని చారిత్రక 3 లాంతర్ల కట్టడాన్ని కూల్చి వేయటాన్ని బాబ్జీ, ఇతర లోక్‌సత్తా పార్టీ నేతలు తీవ్రంగా నిరసించారు. చరిత్రను కాపాడుకుంటూ అభివృద్ధి చేయాలన్నారు. ఓ పక్కన పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామంటూనే, ఇలాంటి విజ్ఞత లేని పనులకు పాల్పడ్డారన్నారు.

✦ మద్యనిషేధం విధిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కరోనా కాలంలో మద్యం అమ్మకాలకు తెరతీయటం దారుణమని బాబ్జీ అన్నారు. ప్రజలు లాక్‌డౌన్ సమయంలో 43 రోజులపాటు ఒక దీక్షలా మద్యానికి దూరంగా ఉన్నారని, కఠిన మద్యనియంత్రణకు దీన్నో అవకాశంగా వినియోగించాల్సింది పోయి, మళ్లీ బార్లా తెరిచారన్నారు. రోగనిరోధకశక్తిని తగ్గిస్తూ మహిళలు, చిన్నారులపై హింసను పెంచే మద్యాన్ని కొవిడ్ ఉధృతంగా ఉన్న సమయంలో అందుబాటులోకి తేవటాన్ని నిరసిస్తూ విజయనగరంలోని జోతిబా ఫూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు రమేష్, సత్యనారాయణ, శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

✦ వలస కార్మికుల సమస్యను గుర్తించటంలో, పరిష్కరించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరసమాన నిర్లక్ష్యాన్ని చూపాయని బాబ్జీ అన్నారు. లాక్‌డౌన్‌కి ముందే సొంతూళ్లకు వెళ్లే అవకాశాన్ని వలస కార్మికులకు ఇవ్వటం మేలని, దీనివల్ల వారికి అన్ని రకాలుగా సాయం అందే అవకాశం ఉందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ ముందుగానే చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు వలస కార్మికుల దయనీయతే పెద్ద సమస్యగా మారిందన్నారు. విజయనగరం మీదుగా కాలినడకన వెళ్తున్న ఒడిషా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వాసులను ఆయన పలకరించి ఆహారపదార్థాలను అందించారు.

# విద్యుత్ రంగంలో జవాబుదారీతనం ఉండాల్సిందే!



విద్యుత్ రంగంలో వస్తోన్న నష్టాలను పూడ్చటానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరేళ్లుగా తీసుకున్న చర్యలు శూన్యమని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. విద్యుత్ పంపిణీ, సరఫరాలో వస్తోన్న లైన్, టెక్నికల్ నష్టాలను, పారిశ్రామిక రంగంలోని చైర్యాన్ని, వ్యవసాయ రంగంలో వృధాని అరికట్టలేకపోయారన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి వివిధ దశల్లో సబ్ స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద 'ఎనర్జీ ఆడిట్' ప్రతీ యేటా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎనర్జీ ఆడిట్‌తో విద్యుత్ నష్టాలను అదుపు చేయవచ్చున్నారు. రాష్ట్రంలో వస్తున్న విద్యుత్ నష్టాలను, చౌర్యాన్నీ వ్యవసాయ రంగ పద్దు కింద చూపెట్టి దొంగలను కాపాడే ప్రయత్నం ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న 'సెంట్రల్ పవర్ బిల్లు-2020' ద్వారా విద్యుత్ వినియోగదారులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న మోసాలకు కళ్లె పడుతుందని, ప్రైవేటు విద్యుత్ సంస్థలతో ఆయా రాష్ట్రాలు చేతులు కలిపి ప్రజాధనాన్ని దోచుకునే పరిస్థితులు తగ్గుతాయని అన్నారు. బిల్లింగ్‌ను ఒక శాతం పెంచితే మూడు వందల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని, బిల్లింగ్‌ను పది శాతానికి పెంచితే ఈరోజు రాష్ట్రంలో వచ్చే విద్యుత్ నష్టాలను పూడ్చవచ్చని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా, ఉమ్మడి రాష్ట్రంలో, విభజన అనంతరం కూడా మన ప్రభుత్వాలు ఏనాడూ విద్యుత్ నష్టాన్ని నియంత్రించిన పాపాన పోలేదన్నారు. కొత్తగా వచ్చే చట్టం వల్ల విద్యుత్ ఛార్జీలు వినియోగదారులపై భారం కాకుండా హేతుబద్ధంగా వ్యవహరించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని శ్రీనివాసు అన్నారు.

**తెలంగాణలో కఠిన మద్యనియంత్రణ విధానం తేవాలి**

రాష్ట్రంలో కరోనా వైరస్ విజృంభిస్తున్న సమయంలోనే, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తున్నా కూడా వినిపించుకోకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల్ని తెరవటం దురదృష్టకరమని శ్రీనివాసు అన్నారు. ఇది అసమర్థతను కప్పిపుచ్చుకునే చర్య అన్నారు. లాక్‌డౌన్ విధింపు, నిర్వహణలో మూస ధోరణిలో వ్యవహరించి పాలకులు చేసిన తప్పులకి ప్రజలు, ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలు, పిల్లలు మూల్యం చెల్లించాల్సి వస్తోందన్నారు. కరోనా నియంత్రణలో ప్రాణాలను పణంగా పెట్టి కృషి చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను ఆయన అభినందించారు. మద్యానికి అనుమతివ్వటమంటే వీరి సేవలను కూడా అవమానించటమేనన్నారు. తెలంగాణలో పేదలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా కాపాడటానికి కఠిన మద్యనియంత్రణ విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంలో సమూల మార్పులు తీసుకొస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, లోక్‌సత్తా తరపున కూడా సూచనల్ని అందజేస్తామని శ్రీనివాసు తెలిపారు.

## సంస్కరణలకు నిలకడతో కూడిన సమర్థ, సంఘటిత కార్యాచరణ కావాలి

అమెరికాలో జార్జి ఫ్లాయిడ్ హత్యనేపథ్యంలో నేర న్యాయవ్యవస్థలో, పోలీసు విభాగంలో సంస్కరణలపై నిరసనకారులు నిర్దిష్టంగా డిమాండ్లు పెట్టాలని.. దీన్ని ముందుకు తీసుకురానట్లయితే ఎన్నికైనవారు కీలకమైన సంస్కరణల పట్ల నామమాత్రంగా స్పందిస్తూ, ప్రజా నిరసనలు తగ్గుముఖం పట్టాక యధావిధిగా తమ తమ రోజువారీ పనుల్లో మునిగిపోతారని ఆ దేశ పూర్వ అధ్యక్షుడు బరాక్ ఒబామా అన్నారు. "సమాజంలో కొనసాగుతున్న అసమ న్యాయానికి వ్యతిరేకంగా అమెరికాలో లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి గళమెత్తుతున్నారు. నిజమైన మార్పుని తీసుకురావాలని మనం కోరుకున్నట్లయితే.. ప్రజల్లో జాగురూకతను పెంచడానికి మనం జనాల్ని కూడగట్టాలి. పాలనా సంస్కరణలను తీసుకురాగల అభ్యర్థులను మాత్రమే మనం ఎన్నుకునేలా, మన ఓటుహక్కును వినియోగించుకునేలా మనం సంఘటితం కావాలి. నిర్దిష్ట చర్యలు తీసుకోవటంపై మీకు శ్రద్ధాసక్తులు ఉంటే ఒబామా ఫౌండేషన్‌లో ఒక నిబద్ధత గల సైట్‌ను రూపొందించాము. సంవత్సరాలుగా స్థానిక, జాతీయ స్థాయిల్లో మంచి కోసం పోరాడుతూ వస్తున్న సంస్థలకు, వ్యక్తులకు ఇది ఉపయోగకరమైన వనరుగా ఉంటుంది. మన ధర్మాగ్రహాన్ని శాంతిమార్గం వైపు మళ్లించాలి. నిలకడతో కూడిన సమర్థ కార్యాచరణను చేపట్టాలి. అప్పుడు మాత్రమే మన అత్యున్నత లక్ష్యాలకు అనుగుణంగా మన దేశం సాగించే సుదీర్ఘ ప్రయాణంలో ప్రస్తుత ఘట్టం నిజమైన మూలమలుపు అవుతుంది" అని ఓ వ్యాసంలో ఒబామా పేర్కొన్నారు.

**(గమనిక: కొవిడ్ నేపథ్యంలో లాక్‌డౌన్ కారణంగా 'జనబలం' ఏప్రిల్ నుంచి వెలువడలేదు. ఏప్రిల్, మే, జూన్ మాసాల పత్రికగా ఈ సంచికను వెలువరిస్తున్నాం. పాఠకులు గమనించగలరు - ఎడిటోరియల్ టీం)**




## కరోనాకు ముందూ విద్యారంగం దారుణమే..

# నటన కట్టిపెట్టి నిజాయతీగా లోపాల్ని సరిదిద్దుకోవాలి



"విద్యారంగానికి సంబంధించి భారత్ చాలా భ్రమల్లో ఉంది. కరోనా తర్వాత విద్యారంగం ఏమైపోతుందో అన్న భయం అవసరం లేదు. కరోనాకు ముందు బ్రహ్మాండంగా ఉంటే కదా? విద్యారంగంతో పాటు అన్ని రంగాల్లో 70 ఏళ్లుగా అంతా బాగుందన్న నటన కట్టిపెట్టి నిజాయతీగా లోపాల్ని గుర్తించి.. సరిదిద్దుకోవాలి" అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

'కరోనా అనంతరం విద్యా సంవత్సరం భవిష్యత్తేంటి?' అంశంపై విద్యావేత్తలు, నిపుణులతో ఈటీవీ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

"విద్యానాణ్యతలో భారత్ అట్టడుగున ఉంది. దేశీయంగా ప్రథమ్ విడుదల చేసే 'అసర్' నివేదికలు చూస్తే ప్రతి ఏటా విద్యాసామర్థ్యాల స్థాయి దారుణంగా ఉంది. 25 శాతం మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు రెండో తరగతి పాఠం తప్పులు లేకుండా చదవలేకపోతున్నారు. అంతర్జాతీయంగా నిర్వహించే 'పీసా' సర్వేలో 74 దేశాలు పాల్గొంటే భారత్ 73వ స్థానంలో నిలిచింది. అందుకే ఈ సంక్షోభాన్ని ఒక అవకాశంగా మార్చుకుని మేల్కోవాలి.

"బండ పరీక్షలకు స్వస్తి చెప్పి బుద్ధికుశలత పెరిగేలా విద్యనందించాలి. మూడేళ్ల ప్రశ్నాపత్రాలను బట్టీపడితే ఇంటర్‌లో 90 శాతం మార్కులు వస్తాయి. భయంకరంగా మాస్ కాపీయింగ్ జరుగుతోంది. పాఠశాల విద్య కోసం రెండు తెలుగు రాష్ట్రాలూ ఏటా రూ.65,000 కోట్లు వ్యయం చేస్తున్నాయి. ఒక్కో విద్యార్థి మీద ప్రభుత్వం రూ.90,000 ఖర్చు పెడుతోంది. 17-18 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు.

"ఇక నుంచైనా మనకున్న వనరులను పునర్వ్యవస్థీకరించాలి. సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలి. విద్యార్థి ప్రతిభను అంచనా వేయటానికి ఏదో ఒక చోట పరీక్షలను కొలమానంగా తీసుకోవాలి. పరీక్షల తీరుతెన్నులపై ప్రధానంగా ఇప్పుడు కసరత్తు జరగాలి" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు (ఈ కార్యక్రమం పూర్తి వీడియోను డా॥ జేపీ సోషల్ మీడియా ఖాతాల్లో చూడవచ్చు).




**"మన సాధిస్తున్న దానికి, సాధించగలిగిన దానికి మధ్య అంతరాన్ని అధిగమిస్తే చాలు.. చాలా సమస్యలు పరిష్కారమవుతాయి"**

**-గాంధీజీ**

# Tertiary Care in Public Hospitals in India

FOUNDATION FOR DEMOCRATIC REFORMS
www.fdrindia.org

Tertiary care is specialized healthcare for patients who are referred by primary and secondary healthcare providers for more advanced treatments such as for burns, cardiac issues, cancer treatment, neurosurgery etc.

## Shortcomings

- Low public health expenditure
- Overcrowding in public tertiary hospitals
- Heavy reliance on private sector

## Stats

- 9,000 patients/day in OPD* of AIIMS; 5,000/day in OPD of Gandhi Medical Hospital, Hyderabad
- Public expenditure = 1.2% GDP; South Africa/Brazil = 4-5% GDP
- Inadequate infrastructure - 7.1 lakh public hospital beds only in India
- Private sector care accounts for 74% of total healthcare

*OPD - Out Patient Department

## Solutions

- Increase public expenditure so that expenditure per bed/year in public hospitals increases
- Strengthen primary healthcare system so that overcrowding in public hospitals reduces

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th June, 2020 Posting Date 15 &16th of every month




# BOOK POST

## PRINT MATTER

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**